# కౌముది.నెట్

చక్కటి కుటుంబ వార పత్రిక

## ఆగష్ట్ 2013

# కథలు




“అబ్బబ్బ ఈ కొంప ఎన్ని సార్లు సర్దినా ఇంతే.” అంటూ అలమారాలో వున్న కాగితాలన్నీ కింద పడేసి 'ఏవండీ... ఏవండీ... మిమ్మల్నే' అంటూ భర్త రాఘవరావుని పిలిచింది.

'ఏవిటే ని గోల' అంటూ వచ్చాడు.

కింద పడివున్న కాగితాలని చూసాడు. 'ఏవిటే అన్నీ ఇలా పడేసావు' అంటూ విసుక్కున్నాడు.

'ఏ కాగితాలు పనికి వస్తాయో, ఏ కాగితాలు పనికి రావో తెలిసి చావదు. అవన్నీ చూసుకుని పనికి రానివి పక్కన పడెయ్యండి. రేపు పేపర్లతో కలిపి అమ్మేస్తాను' అంటూ లోపలికి వెళ్లి పోయింది.

'ఖర్మ దీనికి ఏ టైములో ఏమవుతుందో తెలియదు. ఇప్పుడు ఇవన్నీ కింద పడేసి పెద్ద పని పెట్టింది అంటూ రాఘవరావు కింద అడ్డ దిడ్డంగా వున్నా కాగితాలు తీసి సర్దుతున్నాడు. ఆ కాగితాల్లోంచి ఓ కవరు కింద పడింది. రాఘవరావు ఆకవరు తీసి ఓపెన్ చేసి అందులోంచి ఓ కాగితం తీసాడు.

అది తన జాతకం కాగితం. తీసి చదివాడు. మొహం లో ఫీలింగులు మారి పోయాయి.

అందులో రాఘవరావు జాతకం 11-12-13 వరకు రాసి వుంది. రాఘవరావు క్యాలెండరు వంక చూసాడు.

ఇవాళ నవంబరు ఎనిమిది. అంటే ఈ జాతకం ప్రకారం నేను రెండు మూడు రోజుల్లో పోతానన్న మాట. మరి నా కోరిక ఈ రెండు మూడు రోజుల్లో తీరుతుందా. ఇంత చిన్న కోరిక తీర్చు కోలేనా? తీరదా? ఎలా? అనుకుంటూ ఆలోచనలతో గుండె బరువెక్కి 'శాంతా' అంటూ భార్యని పిలిచాడు.

హడావిడి పరుగు లాంటి నడకతో వచ్చింది శాంత.

'శాంతా గుండెల్లో ఏదో బరువుగా వుంది. తలతిరుగుతుంది' అన్నాడు.

శాంత కంగారు పడి 'అవన్నీ అలా వుంచండి. తర్వాత సర్దుకోవచ్చు. వేడిగా కాఫీ ఇస్తా, తాగి కాసేపు పడుకోండి. తగ్గి పోతుంది.' అంటూ లేవదీసి మంచం మీద పడుకోపెట్టి

కాఫీ తీసుకురావడానికి లోపలికి వెళ్ళింది.

రాఘవరావు పడుకుని అలా ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

శాంత కాఫీ తీసుకువచ్చింది.

'ఏవండీ... ఇదిగోకాఫీ. లేవండి... మిమ్మల్నే... అప్పుడే నిద్ర పట్టేసిందా' అంటూ తట్టి లేపింది.

రాఘవరావులో కదలిక లేదు. కంగారు పడింది శాంత.

'ఏవండీ... ఏవండీ...' అంటూ కుదిపింది. అయినా రాఘవరావులో కదలిక లేదు.

'ఏవండీ... ఏవండీ...' అంటూ ఏం చెయ్యాలో తోచక రాఘవరావు ప్రాణ స్నేహితుడు విశ్వనాధం కి ఫోన్ చేసింది.

విశ్వనాథ్ పది నిముషాల్లో డాక్టర్ కామేష్ తో హడావిడిగా వచ్చాడు.

శాంత జరిగినదంతా డాక్టర్ కి చెప్పింది.

కామేష్ రాఘవరావుని టెస్ట్ చేసాడు.

'ప్రాబ్లం ఏమీ కనిపించడం లేదు. కాకపోతే ఆయన స్పృహలోలేరు. 'అంటూ రెండు ఇంజెక్షన్ లు చేసాడు. 'కంగారు పడాల్సిన అవసరం లేదు. తగ్గి పోతుంది. స్పృహ వస్తుంది. మళ్ళీ రేపు వస్తాను. ఈ లోగా ఏవన్నా అవసరం అయితే ఫోను చెయ్యండి.' అంటూ వెళ్లి పోయాడు.

మర్నాడు కామేష్ వచ్చి చూసాడు. రాఘవరావులో చలనం లేదు. సెలేన్ ఎక్కిస్తున్నారు. కామేష్, కార్డియాలజి స్పెషలిస్టు శ్రీనివాసరావుని పిలిపించాడు. అయినా రాఘవరావు లో చలనం రాలేదు. ఇద్దరు నర్సులని కేర్ టేకర్స్ గా పెట్టారు.

అమెరికా నుంచి పెద్దబ్బాయి సుధాకర్, కోడలు సునీత, బెంగళూర్ నుంచి కూతురు సుజాత, అల్లుడు అరవింద్, ఢిల్లీ నుంచి చిన్నబ్బాయి వంశీ వచ్చారు.

అందరూ ఏమి జరిగిందో అని కంగారుగా వున్నారు.

డాక్టర్ శ్రీనివాసరావు 'అంతా బాగానే వుంది. ఇది కార్డియాలజీ ప్రాబ్లం కాదు. న్యూరోలజిస్ట్ డాక్టర్ నూకరాజుకి చూపిస్తే బాగుంటుంది. అన్నాడు కామేష్ తో.

విశ్వనాథం వెంటనే వెళ్లి నూకరాజుని తీసుకు వచ్చాడు.

డాక్టర్ నూకరాజు రఘురాం ని టెస్ట్ చేసి 'కాలి బొటన వేలు నుంచి హెడ్ వరకూ నెర్వస్ సిస్టం అంతా బాగానే వుంది. ఏం ప్రాబ్లం లేదు.' అన్నాడు.

'హార్టు బీటింగు, వాల్వ్స్, బి పి, షుగర్ అన్నీ నార్మల్ గానే వున్నాయి. కాని ఏ ట్రీట్మెంటు కి బాడీ రియాక్టు కావటం లేదు' అన్నాడు కామేష్.

'ఈయన చాలా డిప్రెషన్ లోకి వెళ్లి పోయారు.' అన్నాడు నూకరాజు.

'హాస్పిటల్ లో జాయిన్ చెయ్యమంటారా' అడిగాడు విశ్వనాథం.

'నో ... ఈ పరిస్థితిలో ఈయన్ని కదపటం మంచిదికాదు. ఈయన స్పృహలో లేక పోయినా బాడీ లో ప్రతీ పార్టు తన పని తాను క్యాజువల్ గా చేసుకుపోతోంది. కానీ ఇలాగే వుంటే ఈయన మెల్లిగా కోమాలోకి వెళ్ళే అవకాశం వుంది. కాబట్టి ఆయన్ని మనం డిప్రెషన్ లోంచి త్వరగా బయటికి తీసుకురావాలి.' అన్నాడు నూకరాజు.

'ఏం చేద్దామంటారు' అంటూ అడిగింది శాంత.

ఆయన్ని చూస్తుంటే ఏదో విషయం గురించి ఆలోచిస్తూ అలా ట్రాన్స్ లోకి వెళ్లిపోయినట్టు అన్పిస్తోంది. అ ట్రాన్స్ లోంచి బయటికి రావాలంటే ఆ విషయం ఏంటో మనం తెల్సు కోవాలి.' అన్నాడు నూకరాజు.

'అదెలా తెలుస్తుంది' అంటూ అడిగాడు వంశీ.

'అది ఏదయినా కావచ్చు. ఎవర్నయినా బెంగతో చూడాలని వుండొచ్చు. ఏదయినా చెయ్యాలని గానీ, చెప్పాలని గానీ వుండొచ్చు. ఏవయిన తినాలని గానీ, ఏదయినా జరిగినదానిని గురించి గానీ, ఏదయినా తీరని కోరిక గురించి గానీ ఎక్కువ అలోచించి ట్రాన్స్ లోకి వెళ్లి వుండాలి. ఏదో వుంది ఆయన మనసులో. అది మనం తెల్సుకుంటే ప్రాబ్లం సాల్వయినట్టే.' అన్నాడు నూకరాజు.

'నాకు తెల్సి ఆయనకి ఏ సమస్యలూ లేవు డాక్టరు గారూ' అంది శాంత.

'అదీ నిజమే... కుటుంబపరంగా, ఆర్థికంగా, బిజినెస్ పరంగా కూడా ఎటువంటి సమస్యలూ లేవు' అన్నాడు విశ్వనాథం.

'నాన్న గారు ఏ విషయం గురించి బాధపడటం మేం చూడలేదు' అన్నారు అంతా.

'ఇంకో రెండు రోజులు చూద్దాం . ఆతర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం. సిస్టర్స్ ... టేక్ కేర్. ఏమయినా ఇంప్రూవ్ మెంటు వుంటే వెంటనే ఫోన్ చెయ్యండి. మళ్ళీ సాయత్రం వచ్చి చూస్తాం.' అంటూ వెళ్ళిపోయారు డాక్టర్ నూకరాజు, కామేష్.

ఇంటి పక్క ఇంట్లో ఏదో ఫంక్షన్ జరుగుతోంది. వాళ్ళు బ్యాండు మేళం పెట్టారు. ఆ శబ్దం గోలగా వినపడుతోంది.

'రాఘవా... నేనురా... విశ్వాన్ని. ఏమయిందిరా. నిన్నెప్పుడూ ఇలా చూడలేదు. ఏంట్రా... నువ్విలా పడుకుని వుంటే నాకు ప్రాణం పోయినట్టు వుందిరా... లేరా...లే... ` అంటూ రాఘవరావు బుగ్గలు నిమురుతూ ఆన్నాడు విశ్వం.

అందరూ రాఘవ చుట్టూ చేరారు. విశ్వనాథం పక్కకి జరిగాడు.

అక్కడే పక్కన పడేసిన రాఘవ చొక్కా జేబులో ఓ కాగితం కనిపించింది. అది గమనించి విశ్వం అటుగా వెళ్ళాడు.

'నాన్నా... నేను సుదాకర్ ని... చెప్పు నాన్నా. నీకెవర్నయినా చూడాలనుందా. ఏదయినా చూడాలనుందా... చెప్పు... అంటూ చెవిలో అడిగాడు సుధాకర్.

'నాన్నా... నీ కేమయినా తినాలనుందా? గారెలు, బూరెలు, బిర్యాని, స్వీట్లు చెప్పండి నాన్నా...' అంటూ అడిగింది సుజాత.

రాఘవరావులో ఏ చలనం లేదు. అలాగే ప్రశాంతంగా పడుకుని వున్నాడు.

విశ్వనాథం రాఘవరావు చొక్కా జేబులో దొరికిన జాతకం కాగితాన్ని చదువుతున్నాడు. అది ఎవరూ గమనించలేదు.

'నాన్నాన్న... నేను వంశీని... నీకు తీర్థయాత్రలు ఏవన్నా చెయ్యాలనుందా. కాశీ... రామేశ్వరం... గయా... షిర్డీ... బదరీనాథ్... చెప్పండి నాన్నా... నేను తీసుకువెళ్తాను.' అన్నాడు వంశీ.

'ఏవండీ ఒక్కసారి కళ్ళు తెరవండి. నా వల్లేమయినా తప్పు జరిగిందా... జరిగితే నన్ను క్షమించండి.' అంటూ బావురుమంది శాంత.

రాఘవరావులో మార్పులేదు.

'అమ్మా... వూరుకో... నాన్నకి ఏమీ కాదు.' అంటూ అందరూ శాంత ని సముదాయించారు.

'ఈ జాతకం చదివి తను రెండు మూడు రోజుల్లో పోతానని తెల్సి డిప్రెషన్ లోకి వెళ్ళాడన్న మాట.' అనుకున్నాడు విశ్వనాథం.

బయట 'డడ్డనక డన్... డడ్డనక డన్... అంటూ డప్పుల మోత భీభత్సంగా వినబడుతోంది.

'అసలే ఇక్కడ టెన్షన్తో చస్తుంటే బయట ఆ డప్పుల గోలొకటి... ఆ కిటికీ తలుపులు వెయ్యండి' అంది శాంత.

సుధాకర్ వెళ్లి శబ్దం లోపలికి రాకుండా తలుపులు వేసి వచ్చాడు.

సరిగ్గా అప్పుడే ఓ వింత జరిగింది. దాన్ని విశ్వనాధం గమనించాడు. 'ఎస్' అనుకుంటూ బయటకి వెళ్లిపోయాడు.

'మావయ్య గారూ మేం అమెరికా నుంచి తిరిగి ఇండియా కి వచ్చేస్తాం. లెండి మావయ్య గారూ.' అంది సునీత.

అందరూ చుట్టూ చేరి రాఘవరావు చెవిలో ఏవో చెబుతూనే వున్నారు.

రాఘవరావులో మార్పు లేదు.

ఇంతలో అంబులెన్స్ సౌండ్ వినిపించింది.

కాసేపటిలో విశ్వనాధం డాక్టర్ నూకరాజు, కామేష్ లతో వచ్చాడు.

'మీ నాన్నకి ఏం కాలేదు. పక్కకి జరగండి...' అన్నాడు విశ్వం.

'మీరు చాలా రిస్క్ తీసుకుంటున్నారు.' అన్నాడు కామేష్.

'ఏం కాదు డాక్టర్. నాదీ పూచి ముందు అంబులెన్స్ ఎక్కించండి.' అన్నాడు విశ్వనాధం

రాఘవరావుని స్ట్రెక్చర్ మీద పడుకోబెట్టి తీసుకెళ్ళారు.

బయట డప్పుల శబ్దం వినిపిస్తోంది.

అందరూ రాఘవరావు తో బయటికి వచ్చారు.

'నేను కూడా వస్తా' అంది శాంత.

'చూడండి. ఎవరూ రావద్దు. మేం ఓ మూడు నాలుగు గంటల్లో వచ్చేస్తాం. మీ నాన్న కూడా హుషారుగా లేచి నాతో వస్తాడు. నాదీ గ్యారంటీ. ఎవన్నా అవసరమయితే నేనే మీకు ఫోన్ చేస్తా. పోనీ డ్రైవర్' అంటూ అంబులెన్స్ డోర్ మూసేసాడు విశ్వనాథం.

అంబులెన్స్ దూసుకు పోయింది.

***

రాత్రి పదవుతోంది. అందరిలోనూ టెన్షన్.

బయట అంబులెన్స్ ఆగిన శబ్దం. అందరూ గబ గబా బయటికి వెళ్లారు.

రాఘవరావు విశ్వనాథం భుజం మీద చెయ్యి వేసుకుని సంతోషంగా దిగాడు.

అందరూ ఆశ్చర్య పోయారు.

'కంగ్రాట్స్' మీ డాడీ ఆరోగ్యం పూర్తిగా నయమయింది.' అన్నాడు డాక్టర్ నూకరాజు.

'థాంక్ యు డాక్టర్' అన్నాడు సుధాకర్.

'థాంక్స్ నాకు కాదు. విశ్వనాథం గారికి చెప్పాలి. ఇదంతా ఆయన ట్రీట్మెంటు.' అన్నాడు నూకరాజు.

'ముందు రాఘవ ని లోపలికి తీసుకెళ్ళి పడుకోబెట్టండి. బాగా అలిసిపోయాడు.' అన్నాడు విశ్వనాథం.

అంబులెన్స్, డాక్టర్ నూకరాజు, కామేష్ లు వెళ్లి పోయారు.

సుధాకర్, వంశీ లు రాఘువరావుని ఇంట్లోకి తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టారు...

'థాంక్స్ రా విశ్వం. ఈ జన్మలో తీరదనుకున్న నాకోరిక నీ వల్ల తీరింది. ఇంక ఇప్పుడు నేను హాయిగా పోవచ్చు.' అన్నాడు రాఘువరావు.

'నోర్ముయ్యిరా... అలాంటి మాటలు మాట్లాడకు. నా ట్రీట్ మెంటు తో నీ ఆయుష్షు ఇంకో యాభై సంవత్సరాలు పెరిగింది.' అన్నాడు. విశ్వనాథం.

ఇంకా ఏదో అనబోతున్న రాఘువరావుతో 'ఇంక ఎక్కువగా మాట్లాడకుండా రెస్టు తీసుకో... రేపు వస్తాగా... అప్పుడు మాట్లాడుకుందాం.' అన్నాడు విశ్వనాథం.

'ముందు మీరు పడుకోండి.' అంది శాంత

రాఘువరావు అలిసిపోయి వుండటంతో మాట్లాడకుండా పడుకున్నాడు.

అందరూ బయటకి వచ్చారు.

'ఏం ట్రీట్మెంటు ఇచ్చారు అంకుల్' అంటూ అడిగాడు వంశీ.

'రేపు వస్తాగా. అప్పుడు చెబుతా.' అన్నాడు విశ్వనాథం.

'చెప్తే గాని ఇంటికి వెళ్ళనీయం.' అంటూ పట్టుపట్టడం తో చెప్పడం మొదలుపెట్టాడు విశ్వనాథం.

'మీ నాన్నకి జాలీగా తిరగటం, సరదాగా అందరితో కలిసి వుండటం అంటే ఇష్టం. కానీ మీ తాతగారు క్రమశిక్షణ అంటూ బయటికి వెళ్ళ నిచ్చేవారు కాదు. ఆరోజు వూర్లో జాతర వుంటే మీ నాన్న ఇంట్లో చెప్పకుండా నాతో జాతరకి వచ్చాడు. అక్కడ కొందరు డప్పులు కొడుతుంటే అందరితో పాటూ మేం కూడా డాన్సులు చేస్తూ ఎగరటం మొదలు పెట్టాం. అది మీ తాత గారి కంటబడింది. అంతే ఆయన ఇద్దర్నీ అక్కడే వుతికేసారు. ఆ తర్వాత మా నాన్న కూడా ఎగస్ట్రాగా నన్ను ఇంకో రెండు పేకాడు. మీ నాన్నకి అలా డప్పు కొడుతుంటే డాన్సు చెయ్యాలంటే ఇష్టం. మీ తాత గారి భయం వల్ల చెయ్యలేకపోయాడు. ఆ కోరిక అలా వుండిపోయింది. తర్వాత స్కూళ్ళు, కాలేజీలు, పెళ్లి, పిల్లలు, మనవలు. కాలం మారింది కానీ ఆ కోరిక మాత్రం తీరకుండా వుండి పోయింది. తీర్చుకోవాలంటే సిగ్గు, స్టేటస్ అడ్డొచ్చి తీర్చుకోలేని పరిస్థితులు.' ఆగాడు విశ్వనాథం 'మరి ఇప్పుడెలా తీరింది' అడిగాడు వంశీ.

'ఇందాకా మీ నాన్న చొక్కా జేబులో ఈ జాతకం కాగితం దొరికింది. ఇందులో మీ నాన్న జాతకం 11-12-2013 వరకే రాసాడు. ఈ సంఘటన ఎనిమిదో తారీఖున జరిగింది. ఇంకా రెండు మూడు రోజుల్లో పోతాననుకుని, తన కోరిక ఇంక తీరదని ఆలోచించుకుంటూ అలాగే ట్రాన్స్ లోకి వెళ్లి పోయాడు. మొన్ననే మేం మా చిన్నతనం రోజులు గుర్తు చేసుకుంటూ నా ఈ కోరిక చచ్చే లోపలయినా తీరుతుందా అని అన్నాడు. అప్పుడు గుర్తుకువచ్చింది.' అన్నాడు విశ్వనాథం.

'జాతకం ప్రకారం అన్నీ జరిగాయా.' అడిగింది సుజాత.

'ఆ... ఇరవయ్ నాలుగో ఏట పెళ్లి, ఇరవయ్ ఆరో ఏట పిల్లలూ తప్ప ఏం జరగలేదు.' అన్నాడు విశ్వనాథం.

'అంకుల్... ఇంతకీ మీరిచ్చిన ట్రీట్మెంటు ఏంటో చెప్పలేదు.

'ఏంటంటే' అంటూ చెప్పడం మొదలు పెట్టాడు.

***

అంబులెన్సు వూరావతల వున్న ఓ గుడిసె ముందు ఆగింది. విశ్వనాథం గబా గబా కిందికి దిగి గుడిసె పక్కనే వున్న చెట్టు కింద మంచం వేసాడు.

రాఘవ రావుని తీసుకొచ్చి మంచం మీద పడుకో పెట్టి అందరూ పక్కకి వెళ్ళి పోయారు.

'మీరేం చేస్తున్నారో నాకు అర్థం కావటం లేదు' అన్నాడు నూకరాజు

'చూస్తూ వుండండి' అంటూ విజిల్ వేసాడు విశ్వనాథం.

చేతిలో డప్పుతో మందు మీదున్నా డప్పు సాయిగాడు వచ్చాడు.

వీరలెవల్లో డప్పు వాయించడం మొదలు పెట్టాడు. డప్పు శబ్దం హోరెత్తి పోతూంది. రాఘవరావులో కదలిక వచ్చింది. మెల్లిగా కళ్ళు తెరిచి చూసాడు.

ఎదురుగ డప్పు సాయిగాడు వాయిస్తున్నాడు.

రాఘవరావు చుట్టూ చూసాడు. ఎవ్వరూ కనపడలేదు. సాయిగాడు తప్ప.

వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టు రాఘవరావు లేచి డప్పు శబ్దానికి అనుగుణంగా స్టెప్పులు వేస్తున్నాడు. ఇద్దరూ రెచ్చిపోయారు.

ఇంతలో విశ్వనాథం కూడా స్టెప్పులు వేస్తూ వచ్చాడు.

డాక్టర్ నూకరాజుకి కూడా స్టెప్పులు వెయ్యాలని పించింది. కానీ స్టేటస్ అడ్డు వచ్చి ఆగాడు.

'ఫర్వాలేదు అందరూ మనోళ్ళే. కానివ్వండి.' అన్నాడు విశ్వనాథం. అందరూ స్టెప్స్ వేసా రు.

'అదే డప్పులో వున్న మహిమ' అన్నాడు విశ్వనాథం.

అందరూ ఎగరలేక మంచం మీద కూల బడ్డారు. సాయిగాడు వాయిస్తూనే వున్నాడు. విశ్వనాథం సాయిగాడిని పిలిచి ఐదు వందల నోటు చేతిలో పెట్టాడు. సాయిగాడు ఆనందంగా వెళ్ళి పోయాడు.

'చాలురా... ఈ జన్మకిది చాలు. నా కోరిక తీరిపోయింది. ఇప్పుడు ఇంక పోయినా ఫర్వాలేదు.' అన్నాడు రాఘవరావు.

***

'అదీ నా ట్రీట్మెంట్.' అన్నాడు విశ్వనాథం చెప్పటం ముగిస్తూ.

'అవునంకుల్... ఇదీ విషయమని మీకు ఎలా తెలిసింది.' అడిగింది సుజాత

'మనింటి పక్కన ఫంక్షన్ డప్పు వాయించారు గుర్తుందా.' అడిగాడు విశ్వనాథం

'అ నేను కిటికీ తలుపు కూడా వేసాను' అన్నాడు సుధాకర్.

'ఆ డప్పు శబ్దానికి మీ నాన్న కాలి వేళ్ళు కదిపాడు. అది మీరెవ్వరూ చూడలేదు. నేను చూసాను. అంతే అదే కోరికని తెలిసిపోయింది.' అన్నాడు విశ్వనాథం. అందరూ విశ్వనాథానికి థాంక్స్ చెప్పారు.

***

ఆ రోజు రాఘవరావు పుట్టిన రోజు . రాఘువరావు కేక్ కట్ చేసాడు.

'ఏరా ప్రతీ పుట్టిన రోజుకి స్పెషల్ గిఫ్ట్ ఇచ్చే వాడివి. ఈసారి ఏంటి నీ స్పెషల్ గిఫ్ట్.' అడిగాడు రాఘువరావు విశ్వనాథాన్ని.

'తీసుకో' అంటూ ఒక సి.డి. ఇచ్చాడు.

'ఏంటి జోల పాటలా' అన్నాడు రాఘువ రావు.

'పెట్టి చూడు తెలుస్తుంది.' అన్నాడు విశ్వనాథం.

వంశీ డెక్ లో పెట్టి ఆన్ చేసాడు.

అంతే డప్పు సాయిగాడి డప్పు శబ్దంతో హాలు హోరెత్తిపోయింది. విశ్వనాథం విజిల్ వేసాడు.

రాఘవరావు ఆనందంతో డాన్సు మొదలు పెట్టాడు.

అందరూ రాఘవరావుతో పాటూ అందరూ స్టెప్స్ వేసారు.

రాఘవరావు కోరిక మరోసారి తీరింది.



చంద్రశేఖర్ నివ్వెర పోయాడు

ఒక రకంగా షాక్ తిన్నాడు.

ఎందుకంటే అతను చాలా సున్నిత మనస్కుడు. కవి. ఆవేశంగా రాస్తూ ఉంటాడు. పేదల పక్షపాతి. ధనవంతులంతా దోపిడీదారులని - నిరుపేదలంతా పీడితులని అతని అభిప్రాయం. అతని కవితల్లో కూడా అలాంటి భావాలే వినిపిస్తుంటాడు.

ఎదురుగా వున్న బక్కపల్చటి ప్రాణిని తేరిపాక చూశాడు. మందు మీదున్నట్లున్నాడు - తూలుతున్నాడు.

శ్మశానం బయట అరుగుమీద కూర్చుని వున్నాడు. బీడీ తాగుతున్నాడు. చాలా నిర్లక్ష్యంగా బ్రతుకన్నా - భవిష్యత్తన్నా భయం లేనట్లు ఠీవిగా మొహం పెట్టాడు.

"చూడు అన్నా! వాళ్ళు వాళ్ళమ్మ చచ్చి ఏడుస్తున్నారు. నువ్వు ఆ శవాన్ని పాతిపెట్టడానికి - చిన్న గూడు దానిపైన కట్టడానికి ఎంత అడుగుతున్నావో తెల్సా?" చంద్రశేఖర్ నచ్చ చెప్పబోయాడు.

"నేనేం లక్ష అడిగానా - పాతికవేలు - పాతికమంది - గిట్టుబాటు కాదు." తలబిరుసుగా చెప్పాడు.

"ఇందులో గిట్టుబాటేంటి? ఇదేవన్నా వ్యాపారమా? చచ్చిన శవానికి అంత్యక్రియలు చేస్తున్నాం -" కోపంగా చెప్పాడు.

"చచ్చిన శవం కాబట్టే! బతికి వున్న వాడ్ని పాతికవేలకు ఎవరు పాతి బెడతారు! లక్ష యిచ్చినా చెయ్యరు -" హరిశ్చంద్రుడిలా చెప్పాడు.

"ఇందులో యింత కష్టపడాల్సింది ఏమీ లేదు - ఆరడుగుల గుంత - ఆపైన మట్టి - ఆపైన ఓ నూరు ఇటికలు - మహా అయితే ఓ బస్తా సిమెంటు - అంతే గదా!" నిస్సహాయంగా అన్నాడు.

"కష్టం మాది - చూసే మీకేం తెలుస్తుంది?"

"మీది కాబట్టే ఓ పదివేలు తీసుకో!"

"ఇదేమన్నా కూరగాయల బేరమా? పాతికకు ఒక్క వంద తగ్గినా శవాన్ని పూడ్చనివ్వం - ఇది ఫిక్సిడ్ రేటు. నువ్వేదో ఇవ్వాళ వచ్చి కొత్తగా చెబుతున్నావు!" చులకనగా చూశాడు.

"మాకేం అనుభవం? రోజూ చావరుగా - నీకంటే అలవాటు -"

"సరే నాటైం వేస్టు చెయ్యకు - ముందు ఓ పదైదు యివ్వు పని పూర్తయింతర్వాత మిగిలాది - పోయి శవాన్ని పట్టుకురా!" చికాగ్గా అన్నాడు.

చంద్రశేఖర్ యింకొంచెం నచ్చ చెప్పాడు.

"చూడు బాబు! వాళ్ళు కూడ నీ లెక్క పేదలే! వాళ్ళేమీ ధనవంతులు కారు. ఉన్నదంతా ఆ హాస్పటల్ సిబ్బంది నొక్కేశారు. వైద్యానికి వేలకు వేలు గుంజారు - శవాన్ని అప్ప చెప్పడానికి కూడ వేలు తీసుకున్నారు - వాళ్ళ దగ్గరున్నదంతా అయిపొయింది."

"అయితే నేనేం చెయ్యను - రోడ్డు మీద పారేస్తే - మున్సిపాలిటీ వాడు ఎత్తి పారేస్తాడు కదా!" విసురుగా అన్నాడు అతను.

ఈడ్చి తందామన్నంత కోపం వచ్చింది.

తమాయించుకున్నాడు - అవసరం తమది. ఇప్పటికిప్పుడు పోయి ఎన్ని శ్మశానాలు ఎంక్వయిరీ చేయగలడు? ఇది వాళ్ళింటికి

దగ్గర -

పదివేలు వాడి మొహాన కొట్టి ఏర్పాట్లు చెయ్యమని వచ్చేశాడు చంద్రశేఖర్.

రత్నమ్మ శవం చుట్టూ చేరి బంధువులు - పిల్లలు - పెద్దలు ఏడుస్తున్నారు - ఆమెకు డబ్బై సంవత్సరాలు. గుండ్రాయిలాగా మొన్న మొన్నటి దాకా బాగుండేది. నోట్లోంచి నెత్తురు పడితే హాస్పిటల్లో చేర్పిస్తే ఆ టెస్టు ఈ టెస్టు అని చెప్పి వేలకు వేలు వసూలు చేశారు. ఆపైన మందులకని - ఆపరేషన్ అని యింకొన్ని వేలు కొట్టేశారు. చివరికి ఆపరేషన్ అయిన రెండు రోజులకే ఆమె కన్ను మూసింది. ఆమెను అలా హింసించకపోయినా యింకా కొన్ని నెలలు బ్రతికుండేది అని అనిపించింది చివరికి. కాని నింద లేంది బొంది పోదుగా!

చంద్రశేఖర్ తనే ఏటియం లోంచి కొంత డబ్బును విత్ డ్రా చేసి వాళ్ళకిచ్చాడు, కార్యక్రమానికి దాచుకున్న డబ్బంతా వైద్యానికే సరిపోయింది మరి - వాళ్లకు.

ఎలాగో శవాన్ని పాతి పెట్టి యిల్లు చేరుకున్నారు.

చంద్రశేఖర్ రత్నమ్మకు దూరపు చుట్టం అవుతాడు. ఆమె కొడుకు సింహం ఇతనికి మంచి స్నేహితుడు. కాని సింహానికి మంచి ఉద్యోగం లేదు. చిరుద్యోగంతో లాక్కొస్తున్నాడు బండి. రత్నమ్మ టీచరుగా రిటైరయింది. పెన్షన్ డబ్బులొచ్చేవి పిల్లల పెళ్ళిళ్ళు చేసి అప్పుల్లేకుండా సంసారం నడిపిస్తుండేది.

దండిగా భోజనాలు చేయించాల్సి వచ్చింది బంధుమిత్రులకు - దానికీ ఖర్చే!

మొత్తానికి పెద్ద కర్మ పూర్తయ్యేసరికి సింహానికి చుక్కలు కనిపించాయి. అప్పులు పాపాల్లాగా పెరిగిపోయాయి. అడుగడుగునా దోపిడీ!

ఎవడూ కూడా సందర్భం చూసి అయ్యో పాపం అన్నవాడు లేడు - అందినకాడికి దోచుకుందామన్న వాళ్ళే!

పేదవాళ్ళని పేదవాళ్ళు కూడా దోచుకుంటున్నారు - అంతకు ముందు ధనికులే అనుకునేవాడు చంద్రశేఖర్.

"చందూ! ఉన్నయిల్లు అమ్మేద్దామనుకుంటున్నాడు -" ఓ రెండు నెలల తర్వాత సింహం చెప్పాడు.

"ఈ కాలం ఇల్లు అమ్మితే మళ్ళీ కట్టుకోగలవా? టౌనులో యింత సెంటరులో ఎక్కడ దొరుకుతుంది? ఊరికి నాలుగు కిలోమీటర్లు దూరం పోయినా ప్లాటు కొనుక్కుందామన్నా మనకు అందుబాటు ధరలో లేదు." చంద్రశేఖర్ చెప్పాడు.

"ఏం చెయ్యను. వడ్డీలు కట్టలేక చస్తున్నా! పెన్షన్ ఆగిపోయింది - వడ్డీ కట్టాలి - నాది చిరుద్యోగం? ఎలా?" సింహం బాధ సింహంది.

"స్వంతిల్లుంది కాబట్టి తల దాచుకుంటున్నాను - అదే బాడుగకు తీసుకోవాలంటే మూడు వేలకు తక్కువ కాదు -" చంద్రశేఖర్.

"నిజం - అందుకే చిన్న గ్రామంలో తీసుకుని - రోజూ వస్తూ పోతూంటే బాగుంటుందేమోనని" సింహం చెప్పాడు.

"దానంత పిచ్చిపని యింకోటి లేదు. గ్రామాల్లో ఉన్నవాళ్ళంతా పట్టణాల్లోకి వస్తున్నారు పనీ పాటలు దొరక్క. ప్రయాణ ఖర్చులు తడిసి మోపుడవుతాయి, ఆపైన శ్రమ - టైం వేస్టు. ఆ ఆలోచన విరమించుకో!" అని కోప్పడి పంపించి వేశాడు.

చంద్రశేఖర్ బైకులో పోతూంటే సడెన్ గా తూలుకుంటూ ఒకడొచ్చి బండి కింద పడ్డాడు. దెబ్బలు బాగా తగిలాయి. రక్తం బాగా కారి పోతున్నది. స్టాండు వేసి వాడిని పైకి లేవదీశాడు.

హరిశ్చంద్రుడు! అప్పటికే చుట్టూ చేరి జనం నానా గోల చేస్తున్నారు. ఎవరో ఫోన్ చేస్తే అంబులెన్స్ వచ్చింది. తీసుకుపోయి హాస్పిటల్లో చేర్చారు.

చంద్రశేఖర్ కూడ అతని వెంబడున్నాడు.

"ట్రీటుమెంటు చెయ్యాలంటే ముందు పాతికవేలు కట్టాలి - ఎవరు కడతారు?" నర్సు వచ్చి అడిగింది.

అప్పటికి హరిశ్చంద్రుడి భార్య ఏడ్చుకుంటూ వచ్చింది.

"అమ్మా! మేము పేదోళ్ళం - మా దగ్గర అంత డబ్బు ఎక్కడుంటుంది - కాటికాపరి మా ఆయన - కనికరించమ్మా!"

హరిశ్చంద్రుడి భార్య లబలబ కొట్టుకుంది.

"దానికి మేమేం చెయ్యం? మీలాంటి వాళ్ళు రోజుకు ఒకళ్ళు తగిలితే మా హాస్పిటల్ మూసుకుపోవాలి!"

చివరికి ఆమె చేతి గాజులు తాకట్టుపెట్టి తెచ్చింది.

డాక్టర్లు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

"పచ్చి తాగుబోతు - యితని అలవాట్లు బాగోలేవు - మా చేతుల్లో ఏముంది? పదివేలు కట్టి శవాన్ని తీసుకుపోండి!" డాక్టరు చెప్పాడు నిర్వికారంగా.

హరిశ్చంద్రుడి భార్య గోల చేయడం చంద్రశేఖర్ కు వినపడ్డం లేదు. చివరికి ఎంతటి వాడైనా మనిషి ధనం చేతిలో బానిసయి పోయాడని బాధపడ్డాడు. దానికి రాజు - పేద ఎవరూ అతీతులు కారు.

మానవత్వం ధనం కాళ్ళక్రింద తొక్కి వేయబడుతున్నట్లు గ్రహించాడు చంద్రశేఖర్. అప్పటి నుంచి అతను ఆకలి కవిత్వం రాయడం మానుకున్నాడు.




అర్థరాత్రి ఒంటి గంట దాటింది.భాగ్యనగరం భళ్ళున ఎప్పుడు తెల్లారుతుందా... అని ఎదురు చూస్తున్నాడు భరణి. కృష్ణానగర్ లోని ఓ గదిలో కూర్చొని సీరియస్ గా రాసుకుంటున్నాడు. ఉదయాన్నే వచ్చి ప్రొడ్యూసర్ కలవమన్నాడు. రాసిన కధనే తిప్పి,తిప్పి మళ్ళీ చూసుకుంటున్నాడు. ఇది ఒకరోజు, రెండు రోజుల నుంచి ఎదురుచూస్తున్న రోజు కాదు. పది సంవత్సరాల కల. తిరిగి తిరిగి విసిగిపోయినా ఆశ చావక ఎదురుచూస్తున్న రోజు. ఏ రోజుకైనా సిల్వర్ స్క్రీన్ మీద దర్శకుడిగా తనపేరు చూసుకోవాలని ఓ ఆశ.

***

"ఒరేయ్... నాన్నా, ఇంటికి వచ్చి చాలా రోజులైందిరా. మీ చెల్లికి పెళ్ళి కూడా కుదిరేలా వుంది. ఓ సారి ఇంటికి వచ్చి వెళ్ళరా" అవతలనించి ఫోన్ లో తల్లి చెప్పిన మాటలు.

"లేదమ్మా, వెండితెర మీద నాపేరు, వాల్ పోస్టర్ మీద నా ఫోటో పడనిదే నేను మన ఊరిలో అడుగుపెట్టను. అప్పటివరకు నా మొహం మీకు చూపించను" అదే మొండితనం తో అన్నాడు భరణి.

"అనవసరం గా ఎందుకు రా లేనిపోని పంతాలు, ఇక్కడ నీకు ఏమి తక్కువయిందిరా. నీ మీద బెంగతో మీ నాన్న రోజు,రోజుకి శల్యమైపోతున్నారు. నీ చెల్లి నువ్వు రాకపోతే పెళ్ళిపీటలెక్కనని ఖరాకండీగా తేల్చేసింది. ఇప్పటికైనా నువ్వు అర్థం చేసుకొని ఓసారి రారా. మమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టకురా. సినిమా పిచ్చి వుందనుకున్నాం కాని ఇలా తయారవుతావనుకోలేదురా" అంది కన్నీళ్ళు నిండిన స్వరంతో.

వెంటనే ఫోన్ కట్ చేసాడు భరణి..

***

పది సంవత్సరాల క్రితం...

డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన చివరి రోజు. స్నేహితులందిరితో కలసి తన అభిమాన హీరో సినిమా చూసిన రోజు. ఎన్నో ఊహలతో మరెన్నో ఆశలతో ధియేటర్ లో అడుగుపెట్టిన భరణి బృందానికి తీవ్ర ఆశనిపాతం కలిగించింది ఆ సినిమా. ఊహించని షాక్ లా సినిమా డిజాస్టర్,అట్టర్ ఫ్లాప్ అని టాక్ వచ్చేసింది. అందరిలోనూ చెప్పలేనంత నిరుత్సాహం ఆవరించింది.

"బాగా బుక్ అయిపోయాం రా... బుర్ర తినేసాడు రా డైరక్టర్... ఒరేయ్ నాకో డౌట్, సినిమా తీసిన తర్వాత ఒకటికి, పది సార్లయినా చూస్తారు కదా. వాళ్ళకి అప్పుడనిపించదా. ఇంత దరిద్రంగా ఉందేమిట్రా బాబూ అని"   అన్నాడు ఆవేశంగా భరణి స్నేహితుల్లో ఒకడు.

ఈలోగా మరో స్నేహితుడు అందుకొని "ఏదో ప్రయోగాత్మకంగా చేసాం అంటారు ఒకరకం, ఏది చూపించినా పాపులర్ హీరో అయితే చూస్తారనుకొనే రకం మరికొందరు, ఆరుపాటలు, అయిదు ఫైట్లు తో కలిపి హీరోయిన ఆరబోత తో లాగించేద్దామనుకొనే రకం మరో

టైపు. ఇలా తీసి వదులుతారంతే. వీటి మధ్యలో కథ అనే ప్రధానమైన వస్తువు నూలువస్త్రం లో దారపుపోగు చందం లా తయారవుతోంది." అన్నాడు పరిశ్రమ ని కాచి వడబోసినవాడిలా.

భరణి కల్పించుకొని "ఆపండిరా మీ అనాలసిన్. సినిమా అనేది ఓ రంగులకల. సప్తవర్ణ సమ్మిళితం. 24 క్రాఫ్టుల సమ్మేళనం. దానికి ఎవర్నీ పూర్తి బాధ్యుల్ని చేయలేం. సినిమా ఈజ్ ఏ టీం వర్క్," అన్నాడు.

"ఏంట్రా నువ్వో పెద్ద సినీ మేధావిలా మాట్లాడతావ్. ఇలాంటి అనలిస్టులు ఈ దేశం లో కొన్ని కోట్లమంది వున్నారు. ఇక అందులోనూ మన రాష్ట్రంలో అయితే చెప్పక్కరలేదు. ఏదైనా చెప్పడం సులువు, చెయ్యడం కష్టం. టికెట్ కొని చూసే సగటు ప్రేక్షకుడుకి ఈ సొద అంతా అక్కరలేదు. బొమ్మ బాగుందా, లేదా అదొక్కటే చూస్తాడు. బాగుంటే హిట్ లేకపోతే ఫట్." అన్నాడు ముందు మాట్లాడిన స్నేహితుల్లో ఒకడు.

"అందుకేరా, సగటు ప్రేక్షకుడి గుండెచప్పుడు తెలిసిన వాడ్ని కాబట్టే నేను డైరెక్టర్ ని అవుదామనుకుంటూన్నాను. దానికోసమే అప్పుడప్పుడు అనేక కథలు రాసి వివిధ పత్రికలకు పంపేవాడ్ని. వాటిలో అనేకం అచ్చు అయ్యాయి కూడా. అది మీకూ తెలిసిన విషయమే. ఇప్పుడు నేను హైదరాబాద్ వెళ్ళి తీవ్రంగా ప్రయత్నిస్తాను." అన్నాడు ఎంతో ఆత్మవిశ్వాసం తో భరణి.

"ఒరేయ్ భరణి... సినిమా అనేది రంగులకల కాదురా, రంగుల వల. ఆ వల లో చిక్కుకొనేవరకు అది మనల్ని ఆకర్షిస్తూనేవుంటుంది. కాని ఆ వల లోకి వెళ్ళామంటే మన జీవితం కూడా చిరిగిపోక తప్పదు. ఎంతో మంది ఇలాంటి కలలతోటే భాగ్యనగరం లో అడుగు పెడతారు. స్వయంకృషి తో ఎదగాలని చూస్తారు. వెయ్యిమంది వెళితే ఒకడు వెలుగులోకి వస్తాడు. మిగిలిన వాళ్ళంతా చీకటిలో కలిసిపోతారు. ఇక అక్కడికి వెళ్ళిన దగ్గరనుంచి ఆకలికేకలు, అవమానాల కాకలతో సగం ప్రాణం పైనేపోతుంది. ఇది ఎంతోమంది చెప్పుకోని వాళ్ళ అనుభవం." అన్నాడు సినీ జగత్తు ని కాచి వడబోసిన ఓ స్నేహితుడు.

"కాని నువ్వు చెప్పిన దాంట్లోనే ఓ సత్యం వుంది చూసావా..." అన్నాడు భరణి.

"ఏమిటది...?" అన్నాడు ఆశ్చర్యం గా అతని స్నేహితుడు.

"వెయ్యి మంది వెళితే ఒకడు వెలుగులోకి వస్తాడనినువ్వే చెప్పావు. ఆ ఒక్కడు నేనే ఎందుకు కాకూడదని నా లాంటివాళ్ళ అందరి ఆశ." అన్నాడు భరణి.

"సరే రా, దీన్ని బట్టి మాకు అర్థమయినదేంటంటే, నేనైతే ఆ సినిమాని ఇలా తీస్తాను, ఆ సీను అలా తీస్తాను అని చెప్పే నువ్వు సినిమాలలోకి వెళ్ళాలని డిసైడైపోయావని తెలుస్తోంది. కాని ఇలా వెళ్ళిన చాలామంది అక్కడ బాదలు పడలేక తిరుగుటపా కట్టేసిన వాళ్ళున్నారు . ఆ జాబితా లో నువ్వు ఉండకూడదని కోరుకుంటున్నాం." అన్నాడు అతని స్నేహితుడు.

"నాకు ఎన్ని కష్టాలెదురైనా, నా పేరు స్క్రీన్ మీదా, నా ఫొటో పోస్టర్ మీదా చూడకుండా నేను మళ్ళీ ఈ ఊర్లో అడుగుపెట్టను." అని భరణి శపథం చేసాడు.

స్నేహితులు ఆల్ ది బెస్ట్, చెప్పడం తో ఆత్మవిశ్వాసం తో రైలెక్కాడు భరణి.

***

దిగితే కాని లోతు తెలియదు - చాలా పాత సామెత, అనుభవం లోకి వచ్చింది భరణికి.

ఇంటిదగ్గర వద్దంటున్నా తనమీద నమ్మకం తో బయలుదేరి టాలివుడ్ ఆశలకలల సౌధం, సినీ సామ్రాజ్య కేరాఫ్ అడ్డా కృష్ణా నగర్ లో పడ్డాడు. కలలు కనీ,కనీ కళ్ళు వాచిపోయిన ఎంతోమంది తనలాంటి మిత్రులు అక్కడ పరిచయమయ్యారు భరణికి.

అందులో ఒకతను " ఏమవుదామని వచ్చావు ఇక్కడికి " అన్నాడు.

"డైరెక్టర్ ని" అన్నాడు కాన్ఫిడెంట్ గా భరణి.

"ఎక్కడైనా ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ లో చేరావా...? " అడిగాడు అతను.

"నాకు ఆ ఫీజులు చెల్లించి నేర్చుకొనే శక్తి లేదు. కళ అనేది సృజనాత్మకత తో అనుసంధానమైనది. దానికి కావల్సినది సాధన, అనుభవం అని నా అభిప్రాయం.అది చూపించేవాడి అభిరుచి, మనోదృష్టి మీద ఆధారపడివుంటుంది. వర్మ ఏ ఇన్ స్టిట్యూట్ నించి వచ్చాడు, దాసరి ఏ ఇన్ స్టిట్యూట్ లో చదువుకున్నాడు. సినిమా తియ్యడానికి    కావలసినది తపన, తపస్సు. సినిమా ని ప్రేమించగలిగే తత్వం. సినిమా ని చూసి మైమరచిపోయే నైజం. ఇవే నిజమైన క్రియేటర్ కి వుండాల్సిన ప్రాథమిక లక్షణాలు." అన్నాడు సూటిగా బదులిస్తూ భరణి.

అతనికి వీడిలో విషయం వుంది అనిపించింది. నెమ్మదిగా అక్కడనించి జారుకున్నాడు.

ప్రతీరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి ప్రొడక్షన్ ఆఫీసు గుమ్మం ఎక్కడం, దిగడం అలవాటయింది. ఈ ఎక్కి దిగడం వల్ల ఆయాసం రావడం తప్ప, ఆకలి తీరడం లేదు. ఇండస్ట్రీ లో తెలిసిన వాడు లేకపోతే ఇలాంటి పాట్లు తప్పవన్న సత్యం అనుభవం లోకి వచ్చింది. ఈ క్రమం లో ఆకలి తీరేమార్గాన్ని వెదుక్కుంటూ నెమ్మదిగా జూనియర్ ఆర్టిస్టు ఏజంట్ దగ్గర పనిలో చేరాడు. అది అరంగేట్రానికి సరిపోయింది. ఇక తనలో వున్న కథకుడ్ని నిద్రలేపాలనుకున్నాడు.

అవకాశం దొరికినప్పుడల్లా అసిస్టెంట్ డైరెక్టర్ల దగ్గరకెళ్ళి కూర్చొనేవాడు. తన దగ్గరున్న కథల్ని వాళ్ళకి వినిపించేవాడు. ఇవేం పాత చింతకాయ పచ్చడి కథల్లా వున్నాయి. ఇలాంటి కథలు ఇప్పుడు ఎవడూ చూడరు. కొత్తకథలు రాసుకో పో అని చెప్పేవారు. మరో ఆర్నెళ్ళకి అవే కథలు వెండితెరమీద కనిపించేవి.

'అవాక్కయ్యారా..." అని అడిగినట్టుండేది భరణికి. నెమ్మదిగా సినీ ప్రపంచపుపోకడలు బోధపడ్డాయి.

ఇక్కడ ఎవడు ఎదగాలన్న ఆరాటం వాడిదే. ఎవడు ఎదగడానికి వాడే నిచ్చెనలేసుకోవాలి. కిందనించి నిచ్చెనలు లాగే వాళ్ళుంటారు. అక్కడక్కడ పైకి ఎక్కించే వాళ్ళు కూడా వుంటారు.

అలా ఎక్కించే ఓ ఆణిముత్యం కంట్లో పడ్డాడు భరణి. భరణి తపన, పడే కష్టం చూసి అతనికి ముచ్చటేసింది. తన దగ్గర అసిస్టెంట్ గా చేర్చుకొని అన్ని విభాగాల్లోనూ ఆరితేరేలా చేసేడు. తనే ప్రోత్సహించి నిర్మాతల దగ్గరకి పంపి కథలు చెప్పమనేవాడు.

అలా కాలక్రమం లో పదేళ్ళు గడిచాయి. ఆ నిర్మాతకి కథ నచ్చడం తో పూర్తి బౌండెడ్ స్క్రిప్ట్, తయారుచేసాడు. అది అతనికి ఇవ్వడానికి బయలుదేరాడు.

***

కోటి ఆశలు కళ్ళముందు సందడి చేస్తుండగా బయలుదేరాడు భరణి. తన చిన్న గదిలో వున్న దేవుని పటాలన్నిటికీ మళ్ళీ, మళ్ళీ దణ్ణాలు పెట్టుకున్నాడు. సినిమా ఫీల్డంటేనే సెంటిమెంటల్ ఫీల్డని నమ్మకం కొందరికి. అనుకున్న టైం కి చేరుకొని సమయపాలన అవసరాన్ని ఎదిగినవాడుగా పేరు తెచ్చుకోవాలనుకున్నాడు.

హడావిడి గా కిందనున్న తన స్నేహితుని మోటార్ సైకిల్ తీసుకొని, తన దగ్గరున్న బ్యాగ్ లో ఆ పుస్తకాన్ని, కొన్ని కాయితాల్ని పెట్టుకొని బయలుదేరాడు.అడుగడుగున అడ్డుపడుతున్న ట్రాఫిక్ కి మనసులోనే తిట్టుకున్నాడు. నెమ్మదిగా అలా నిర్మాత ఇంటిముందర సందు తిరిగేంతలోనే ఊహించని ఉపద్రవం జరిగింది. వెనకనించి వేగం గా వస్తున్న హోండాసిటీ కారు డాష్ ఇవ్వడం తో స్పృహ కోల్పోయాడు భరణి.

ఆ కారు ఆ నిర్మాత దే కావడం, అతను చకచకా ఆసుపత్రి లో జాయిన్ చేయడం, పెద్ద ప్రమాదం కాకపోవడం తో త్వరగానే కోలుకున్నాడు భరణి. ఆ కథ నిర్మాతకి విపరీతంగా నచ్చడం తో షూటింగ్ కూడా వేగంగా ముగిసింది. భరణి లో ఇంతకాలం నిద్రాణమై వున్న క్రియేటర్ ఒక్కసారిగా జూలు విదిల్చాడు. మూస లో కొట్టుకుపోతున్న పరిశ్రమకి ఓ కొత్త చుక్కాని లా తన చిత్రాన్ని మలచి చూపించాడు.

***

ఆర్నెళ్ళ తర్వాత ఓ రోజు సంధ్య దియేటర్ దగ్గర పెద్ద వినైల్ పోస్టర్. దానిమీద ఓ పక్క భరణి కట్ అవుట్, కింద కథ - కథనం - దర్శకత్వం:భరణి.

ఆ రోజు తన మిత్రులతో పాటు, తన అమ్మ, నాన్నలని కూడా అక్కడికి తీసుకువచ్చాడు భరణి.

అక్కడికి వచ్చిన మిత్రుడు భరణితో "సరదాగా - పోస్టర్ మీద పోటో, స్క్రీన్ మీద టైటిల్ పడ్డాయిరా... ఆ వెయ్యి మంది లో ఆ ఒక్కడివి నువ్వే... కధ అయిపోయింది" అన్నాడు.

"లేదురా కధ ఇప్పుడే మొదలయింది" అన్నాడు భరణి.




ఆ రోజు శివరాం హోటల్ దగ్గరకు రాగానే, రిసెప్షన్లో డ్యూటీ చేస్తున్న వ్యక్తి అతన్ని చూసి గుర్తుపట్టి పలకరింపుగా నవ్వాడు.

ఆ తర్వాత, అతను ఎప్పుడు కోరుకునే గది తాళం చెవి గుత్తి అతని చేతిలో ఉంచాడు. వాటిని తీసుకుని తలపంకించి మెల్లగా తన గది వైపు సాగిపోయాడు.

శివరాం ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా, నెలకోమారు ఆ ఊరు వస్తాడు. అక్కడికి వచ్చినప్పుడల్లా అదే గది కావాలని కోరుకుంటాడు. మేనేజర్కి ముందుగా ఫోన్ చేసి మరీ గదిని సిద్ధం చేయించుకుంటాడు.

ఆ గదిలో దిగటం వల్ల తనకు బాగా 'కలిసొస్తుందని' అతను గాఢంగా నమ్ముతాడు. ఆ నమ్మకం ఏడాది క్రితం అతనిలో ఏర్పడింది.

మొదటిసారి కాన్ఫరెన్సుకు వచ్చినప్పుడు ఇదే గదిలో దిగాడు.

'బాస్ చండశాసనుడు. మనం ఒళ్లు వంచి పనిచేసినా సంతృప్తి చెందడు. ఇంకా ఇంకా పనిచేయాలంటాడు. ఏటికేడు టార్గెట్ పెంచి మనకు మనశ్శాంతి లేకుండా చేస్తాడు.      పరమ దుర్మార్గుడనుకో"

సమావేశానికి వెళ్ళే ముందు హెచ్చరించారు కొలీగ్స్.

భయం భయంగా లోపలకి అడుగుపెట్టాడు.

"కస్టమర్లను ఆకట్టుకోవటం ఓ కళ. మీ మాటలతో వాళ్లని లొంగ తీసుకోవాలి. మీ కంపెనీ తయారు చేస్తున్న ప్రోడక్టు మిగతా వారి కంటే నాణ్య మైంది... మన్నికయిందన్న నమ్మకం వారికి కలగాలి. అప్పుడే కొనటానికి ఎగబడతారు. అమ్మకాలు బావున్నాయి కదా అని నాసిరకం వస్తువులు అంటగట్టారా, రెండో నెలలో వాడు మీ మొహం చూడడు. పైగా నలుగురికి చెబుతాడు. పరమ దరిద్రంగా ఉంది. ఈ వస్తువు కొంటే మీరు మునిగిపోతారు జాగ్రత్త అని హెచ్చరిక చేస్తాడు. ఈమౌత్ పబ్లిసిటీ... బ్యాడ్ ప్రాపగాండా మనకు చెరుపు చేస్తుంది. కనుక ఎక్కడయినా ఫిర్యాదులుంటే... వాటిని తక్షణం మన హెడ్ ఆఫీసుకు తెలపండి. సమస్య పరిష్కారం అయ్యేలా చూడండి." ప్రవాహంలా సాగింది ఆయన సంభాషణంతా.

"కంపెనీ వేరు, మీరు వేరు అన్న భావన మీకొద్దు. దీన్ని మీ సొంత సంస్థలా భావించండి. అప్పుడే మీరు అంకిత భావంతో పనిచేయగలుగుతారు. ఏ పనీ పెద్దగా శ్రమ అనిపించదు. కస్టమర్లను ఆకట్టుకోటానికి మీ సొంత అజెండాతో వెళ్లగలుగుతారు. విజయం సాధిస్తారు."

"అలా అని మీరు పడిన శ్రమకి ప్రతిఫలం ఉండదని అనుకోకండి. కంపెనీ ప్రతి ఒక్కరి కృషిని గుర్తిస్తుంది. ఇన్సెంటివ్ లు, ప్రమోషన్లతో

మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. ఒకప్పుడు నేనూ మీలాగే సాధారణ సేల్స్ మెన్ ని. ఇప్పుడు ఈ స్థాయికి చేరానంటే, నేను చేసిన శ్రమ ఒక్కటే కాదు... కంపెనీ నుంచి నా కందిన సహకారం కూడా కారణం. నన్ను చూసి మీరంతా ఈ విషయాన్ని గ్రహిస్తారని ఆశిస్తాను"

ఆయన రూపం, వాగ్ధాటి రెండూ శివరాంని ఆకట్టుకున్నాయి. మిగతావాళ్లుకూడా చెవులు రిక్కించి విన్నారు. ఆ తర్వాత మొదలయింది అసలు వ్యవహారం.

ఒక్కొక్కళ్లని పిలిచి వాయించటం మొదలు పెట్టాడు.

"రోజూ కనీసం పది మందితో మాట్లాడి అందులో కనీసం ముగ్గురు నలుగురి చేతయినా వస్తువు కొనిపించలేని వాడివి... ఎందుకయ్యా? అసలు పని మీద నీకుఆసక్తి లేదు. ఉంటే ఈ పదేళ్లలో ఎంత అనుభవం సంపాయించుకునేవాడివి. పనితీరు ఎంత మెరుగుపరుచుకునేవాడివి. నీ అవసరం లేదు. వేరే పని చూసుకో" అన్నాడు గంభీరంగా.

బిక్కచచ్చిపోయాడతను. గుడ్లల్లో నీళ్లుకుక్కుకుంటూ డయాస్ మీద నుంచి కిందకు వచ్చాడు. అక్కడున్న వాళ్లంతా ఆ పరిణామానికి వణికిపోయారు. "చూడబోతే, ఇక్కడికి వచ్చిన వాళ్లలో సగం మందిని ఇంటికి పంపించేటట్టున్నాడు." అనుకున్నారు మనసులో.

తన దగ్గరకు వచ్చిన వాళ్లలో లోపాలను ఆయన ఎత్తి చూపుతున్నాడు. సూటిగా మాట్లాడుతున్నాడు. అప్పుడప్పుడు వ్యంగ్యంగా విసుర్లు విసురుతున్నాడు.

మీటింగుకు వచ్చిన వాళ్లలో కొంత మందిని వెంటనే మానేయాలని సూచించాడు. మరికొంత మందికి ఆరేడు నెలలు గడువు విధించి... అప్పటికీ పనితీరు మెరుగుపడకపోతే

ఇంటికి పంపిస్తానని హెచ్చరికలు జారీ చేశాడు.

శివరాం వంతు వచ్చింది.

“…అయిపోయింది… అంతా అయిపోయింది… ఇక ఈ ఉద్యోగానికి…      తనకీ రాం… రాం… రేపట్నుంచి కొత్త ఉద్యోగం వెతుక్కోవలసిందే.” మనసులో ఆందోళన నింపుకుని…

తడబడుతున్న అడుగులతో బాస్ ని సమీపించాడు.

ఆశ్చర్యం… ఆయన ఒక్కటంటే ఒక్క విమర్శ చేయలేదు. పైగా శివరాంని ఆకాశానికెత్తేశాడు.

“నువ్వు ఒక ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నావు. ఇలా చేస్తూ పోతే విజయం దానికంతటికి అది సిద్ధిస్తుంది. నిరాశ పడకుండా ప్రయత్నించు” అన్నాడు.

శివరాం మనసు సంతోషంతో ఉప్పొంగింది. అది అతని వూహకందని విషయం.

బాస్ తిట్టకుండా ఉంటే చాలని… మనసులో వేయి దేముళ్లకు మొక్కుకున్నాడు. ఇప్పుడు ప్రోత్సాహపూర్వకంగా ఆయన మాట్లాడటం అతనిలో వేయి ఏనుగుల బలాన్నిచ్చింది.

మరుసటి నెలంతా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు.

క్యాష్ అవార్డుకు అతని పేరు సిఫార్సు చేస్తున్నట్టు బాస్ ప్రకటన చేశాడు.

ప్రమోషన్ రావటానికి మరెంతో కాలం పట్టలేదు.

యాదృచ్ఛికంగా మొదటి రెండు సార్లు అదే గదిలో దిగాడు. తర్వాత నుంచి మాత్రం అతను ఆ గదిని కోరి ఎంపిక చేసుకుంటున్నాడు.

లిఫ్ట్ పనిచేయటంలేదు. మెట్లమీదుగా పైకి వెళుతూ అనుకున్నాడు శివరాం…

“ఇక్కడికి వచ్చినప్పుడల్లా నాకు ఏదో ఒక మంచి జరుగుతోంది. రేపేం లాభం వచ్చి పడుతుందో…”

గదిలోపలకి అడుగుపెట్టి బ్రీఫ్ కేసును పక్కనున్న ర్యాక్ లో ఉంచాడు. ఆ తర్వాత స్నానం కానిచ్చి డిన్నర్ కి ఆర్డరిచ్చాడు.

ఈలోపు టీవీ ఆన్ చేశాడు.

క్రైమ్ వార్తలు వస్తున్నాయి. వాటిని ఆసక్తిగా చూడసాగాడు శివరాం.

“నాలుగేళ్ల క్రితం చోటుచేసుకున్న ఘోరం… టీవీ యాంకర్ పైన అత్యాచారం, ఆ తర్వాత హత్య.” యాంకర్ చదువుతున్నాడు. దానికి అనుబంధంగా విజువల్స్ చూపిస్తున్నారు.

దృశ్యాలు చకచకా కదులుతున్నాయి. ఒక్కో దృశ్యం కదులుతున్న కొద్దీ, శివరాంలో భయం క్రమంగా పెరగసాగింది. ఆ గది వాతావరణం అంతా అతన్ని భయపెట్టింది.

గబుక్కున గోడకు తగిలించిన షర్టు, ప్యాంటు బ్రీఫ్ కేసులో కుక్కుకుని… లుంగీమీదే రిసెప్షన్ దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు.

“ఆ గది ఖాళీ చేస్తున్నాను.” ఒకే ఒక ముక్కలో చెప్పాడు.

అర్ధగంట క్రితం వచ్చిన వ్యక్తి, హఠాత్తుగా ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడో అర్ధంకాక, అయోమయంగా చూశాడు కౌంటర్లో వ్యక్తి.

“సార్. గదులు ఖాళీ లేవు. రేపు ఉదయం దాకా వెళ్లేవారెవరూ లేరు.” అన్నాడు. ఇంకా నచ్చచెప్పాడు.

‘‘అవసరమయితే రూం మరోసారి క్లీన్ చేయించి బెడ్ షీట్లవీ మార్పిస్తా.’’

శివరాం ఆ గది కేటాయించమని ఎప్పుడు ఒత్తిడి చేసే విషయ అతనికి తెలుసు. నెలనెలా వచ్చే కస్టమర్ కనుక హోటల్ వాళ్లు అతనికి ప్రాధాన్యం ఇస్తారు. గౌరవంగా చూసుకుంటారు. అతను ఎప్పుడు వచ్చినా బిల్లులో పదిశాతం రాయితీ కూడా ఉండేది.

‘‘ఒక్క నిముషం కూడా ఇక్కడ ఉండదలుచుకోలేదు... ఖాళీ చేసి వెళ్లిపోతున్నా.’’ కొట్టినట్టుగా చెప్పాడు. చేతులో ఉన్న తాళం గుత్తిని రిసెప్షన్ టేబుల్ పైకి విసిరేసి బయటకు నడిచాడు.

శివరాం ప్రవర్తన అతనికి వింతగా అనిపించింది. హోటల్ మెట్లు దిగి వెళ్లేవరకూ అతని వైపే చూస్తుండిపోయాడు.

ఆ నిముషంలో... శివరాంకి... ‘‘ఇక్కడకు వచ్చినప్పుడల్లా ఏదో ఒక మంచి జరుగుతోంది. ఇప్పుడు ఖాళీ చేసి వెళ్లిపోతే, ఆ అదృష్టం చేజారిపోతుంది... ’’ అన్న ఆలోచన రాలేదు.

అలా అనుకుని ఉంటే గది ఖాళీ చేసే వాడే కాదు.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే... అసలు అతని మనసులో రేపటి సేల్స్ మీటింగులేదు. అది తన జీవితంలో కలిగించబోమయే ప్రభావం గురించి ఆందోళన లేదు.

ఇంతకు ముందు టీవీలో దృశ్యాలే శివరాం కళ్లముందు కదలాడుతున్నాయి.

యాంకర్ హత్య జరిగింది ఆ హోటల్లోనే...

అదీ తను ఏరి కోరి తీసుకునే గదిలోనే...

అతనికి గుండెదడ ఇంకా తగ్గలేదు.

ఒకప్పుడు 'కలిసొచ్చిన గది'ని విపరీతంగా ప్రేమించిన శివరాం... ఇప్పుడు దానికందనంత దూరంగా పోతున్నాడు. అతను ఎక్కిన ఆటో సిటీ దూరంగా ఉన్న మరో హోటల్ దిశగా సాగిపోతోంది.




ఉదయం నిద్రలేవగానే అద్దంలో ముఖం చూసుకోవడం అలవాటు నాకు. అది ఇప్పటి అలవాటు కాదు. చిన్నప్పట్నుంచి వస్తూన్నది. నాతోపాటే      పెరిగి పెద్దదయినది.

ఆ రోజు నిద్రలేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ అద్దం వద్దకు నడిచాను. అద్దంలోకి యథాలాపంగా చూపులు సారించిన నేను పక్కలో బాంబు ప్రేలినట్టు అదిరిపడ్డాను.

ఓ వికృతాకారం!... అద్దంలో!!

భయంతో కెవ్వున అరచి వెనక్కి గెంతాను.

అదురుతూన్న గుండెను చిక్కబట్టుకుని బెదురుతూనే మళ్ళీ అద్దంలోకి వీక్షించాను.

ఆ వికృతాకారం నా వంకే చూస్తోంది! తీక్ష్ణంగా.

చటుక్కున వెనక్కి చూసాను. నా వెనుక ఎవరూ లేరు!

మళ్ళీ అద్దం వైపు భయం భయంగా చూసాను. ఆ ఆకారం నన్ను చూసి వికృతంగా నవ్వుతున్నట్లనిపించింది. ధైర్యం కూడగట్టుకుంటూ పరీక్షగా చూసాను...

అష్ట వంకర్లు తిరిగిన వదనం... కనురెప్పలు లేవు... కళ్ళు లోతుకు పోయి కనుగ్రుడ్లు బయటకు పొడుచుకు వచ్చాయి... ముక్కు డొల్లగా ఉంది.... చెవులు గ్రహణపు మొర్రుల్లా, ఎలుకలు కొరికేసినట్లున్నాయి... పెదవులు చెదలు తినేసినట్టు బొల్లి బొల్లిగా ఉన్నాయి... పళ్ళు ఉన్నాయో లేవో తెలియడంలేదు... చెంపలు తెల్లగా పాలిపోయి చప్పిదవడలు పడ్డాయి... నెత్తి మీది జుత్తంతా ఊడిపోయి, తలపైన గతుకుల బాటలా ఉంది... శుష్కించిన దేహంతో ఆపాదమస్తకం కృత్రిమంగా తోచింది ఆ ఆకారం...

సందేహం లేదు. అది...అది...దయ్యం!!

ఆ తలంపు నన్ను ఉలికిపాటుకు గురిచేసింది. భయంతో నా శరీరం మంచుగడ్డలా చల్లబడిపోయింది. ఒక్కో అడుగే వెనక్కి వేసాను.

ఆశ్చర్యం! ఆ ఆకారం కూడా వెనక్కి వెనక్కి నడిచింది, నాతో లయగా. నేను ఏం చేస్తే తానూ అదే చేస్తోంది, నన్ను

వెక్కిరిస్తున్నట్టుగా.

అదిగో, అప్పుడే హఠాత్తుగా స్ఫురించింది నాకు - అది...అది...నా ప్రతిబింబమేనన్న నిజం!

వాస్తవం వెన్నుదట్టడంతో నా గుండె ఝుళ్ళుమంది.

పాతికేళ్ళ యువకుణ్ణి నేను. 'నెక్స్ట్ ఎక్స్' తరానికి వారసుణ్ణి. తెల్లగా, హ్యాండ్సమ్ గా ఉంటాను. ముఖ్యంగా, నా వదనం - నా ఎసెట్. అది నేను అనుకుంటూన్న మాట కాదు. నన్ను చూసినవారెవరైనా సరే ఒప్పుకుని తీరవలసిన సత్యం. 'సోగ్గాడు' శోభన్ బాబు ముఖ వర్చస్సు, ఎ. ఎన్నార్. గ్రేసూ నా సొంతమంటూరు నా మిత్రులు... అందుకే నా సుందర వదనమంటే మిక్కిలి మక్కువ, కించిత్తు గర్వమూను నాకు. ఆడవాళ్ళలా తరచు నా రూపం అద్దంలో చూసుకోవడం హాబీ అయిపోయింది.

ఇంజనీరింగ్ పాసయ్యి క్యాంపస్ సెలెక్షన్ ద్వారా ఓ ఎమ్మెన్సీలో చక్కటి ఉద్యోగం సంపాదించుకున్నాను. జీతం నెలకు యాభై వేల పైచిలుకే. చింతలేని జీవితం. త్వరలో ఓ ఇంతి చేతిని పట్టుకుని ఓ ఇంటివాణ్ణి కావాలన్న ఆలోచన కూడా.

అటువంటిది, ఆ రోజు నిద్ర లేచేసరికి నా రూపం హఠాత్తుగా అలా వికృతంగా మారిపోవడం...!?

అంతా అయోమయంగా ఉంది నాకు. ఓవర్ నైట్ నాకు ఏం జరిగిందో బోధపడలేదు.

ఇప్పుడు నా వికృత రూపాన్ని బయటి ప్రపంచానికి ఎలా చూపించేది? జుగుప్సాకరంగా ఉన్న నా వదనం నన్నే భయపెడుతూంటే, ఇక ఒరుల మాటేమిటి!?

డోర్ బెల్ మ్రోగడంతో అనాలోచితంగానే వెళ్ళి తలుపు తెరిచాను.

వచ్చింది పనిమనిషి రత్తాలు. నా ముఖంలోకి చూడగానే భయంతో 'కెవ్వు'న అరచి స్పృహతప్పి పడిపోయింది.

ఆ తరువాత న్యూస్ పేపర్ బాయ్... పాలవాడు... అందరిదీ అదే గతి!

ఈ మధ్య అమ్మాయిలు కొందరు వాతావరణ కాలుష్యానికి భయపడి కాబోలు, టెర్రరిస్టుల్లా ముఖమంతా 'బ్యాండేజ్' కట్టుకున్నట్టు, ముసుగుతో టైట్ గా బిగించుకోవడం కద్దు. కన్నులు, నాసికా రంధ్రాలు(?) తప్ప మరే భాగమూ కనిపించదు. అది గుర్తుకు వచ్చింది నాకు. అదే పద్ధతిలో ముఖానికి పట్టీ కట్టుకుని, అర్జెంటుగా డాక్టర్ వద్దకు పరుగెత్తాను.

అలాంటి వికృత రూపాలను రోజూ చూస్తూ ఉంటాడో ఏమో, డాక్టర్ జడుసుకోలేదు. నన్ను పరీక్షించి పెదవి విరిచేసాడు.

"అలవికాని ఆనందం కోసం అర్రులు చాస్తే కలిగే పర్యవసానమే ఇది. మత్తులో జోగినంతసేపూ అది తెచ్చే విపత్తు ఆకళింపుకాదు. మాదక ద్రవ్యాల వల్ల పొందే ఆనందానికీ ఆవలి అంచున పొంచియున్న ఆపదను పసిగట్టలేకపోవడం మిక్కిలి దురదృష్టకరం... నౌ ఇటీజ్ టూ లేట్" అన్నాడు డాక్టర్.

కొయ్యబారిపోయాను నేను.

"ఇప్పుడు నువ్వు ఉన్నది మిడ్డిల్ స్టేజ్. ఫిజికల్ ఇరోజన్. మరి కొన్నాళ్ళలో నీ మెదడు అఫెక్ట్ అవుతుంది. పిచ్చివాడివయిపోతావు. ఓసారి పాయింటాఫ్ నో రిటర్న్ కి చేరుకుంటే... నేరాలు, ఘోరాలకు పాల్పడడానికి కూడా వెనుదీయవు," మళ్ళీ అన్నాడు డాక్టర్, మేటరాఫ్ ఫ్యాక్ట్ గా.

విషయం బుర్రలో సింక్ అవడంతో, "నో...!" అంటూ పెద్దగా అరచాను...

"బాబుగారూ...బాబుగారూ...!" అన్న పిలుపుతో, చటుక్కున కళ్ళు తెరచాను.

ఎదురుగా డాక్టర్ - కాదు, రత్తాలు. రోజూ ఉదయమే వచ్చి ఇల్లు ఊడ్చి శుభ్రం చేసి వెళ్ళే పనిమనిషి. నలభై ఏళ్ళుంటాయి.

"అలా అరిచేవేంటి బాబూ? నా గుండె అవిసిపోయినాదనుకో. ఏమయినాదేంటి?" సాశ్చర్యంగా అడిగింది రత్తాలు. "మాయదారి పీడకలేదైనా ఒచ్చిందేటీ?"

'పీడకలా!?' విస్తుపోతూ చుట్టూ పరికించాను. గదిలో బెడ్ మీద ఉన్నాను.

నేను సమాధానం ఇవ్వకపోవడంతో, "ముదనష్టపు పీడకలేదో ఒచ్చేసుంటాది బాబుకు. అందుకే అంత పెద్దగా అరిసేసినాడు" అనుకుంటూ గదిలోంచి వెళ్ళిపోయింది రత్తాలు.

ఛంగున బెడ్ మీంచి క్రిందకు ఉరికి డ్రెస్సింగ్ మిర్రర్ వద్దకు పరుగెత్తాను.

అద్దంలో నన్ను గ్రీట్ చేసింది వికృత వదనం కాదు - నాసుందర వదనం!

తేలికగా ఊపిరి పీల్చుకుని, హుషారుగా ఈల వేసాను.

తెల్లవారు ఝామున వచ్చిన ఆ కలనే నెమరువేసుకుంటూ... అంత పెద్ద కల్ల, కల రూపంలో నన్ను కలతపెట్టాడానికి హేతువేమిటా అనుకుని ఆలోచనలో పడిపోయాను. అప్పుడు మెరిసింది నా బుర్రలో ఫ్లాష్...

ఆ రోజు విక్రమ్ బర్త్ డే. సంపన్నుల ఏకైక పుత్ర రత్నం అతను. మోడర్న్ గై. బాగా ఖర్చుపెడతాడు. అందుకే, బెల్లం చుట్టూ చీమల్లా, ఎప్పుడూ పదిమంది స్నేహితులు అతని వెంట ఉంటారు. పార్టీలకు, పబ్ లకూ తిరుగుతూంటారు.

మందు పార్టీలు, పబ్ లకు నాకు చుక్కెదురు. గొంతు తడిపే 'చుక్కే' కాదు, మదిని కుదిపే 'చుక్క' లన్నా ఆమడ దూరంలో ఉంటాను. బీరకాయలు తప్ప 'బీర్' కాయల్ని ఎరుగని వాణ్ణి. మోడర్నిజం పేరిట సాగే మాడ్ నెస్సూ, మ్యాడ్ నెస్సూ నాకు కిట్టవు. అటువంటి వాటికి ఆమడ దూరంలో ఉంటాను. స్నేహితులు, కొలీగ్సూ హేళన చేస్తున్నా సరే.

విక్రమ్ కి ఊరి బయట ద్రాక్ష తోటల దగ్గర గెస్ట్ హౌస్ ఒకటి ఉంది. పుట్టినరోజు సందర్భంగా కొలీగ్స్ కీ, క్లోజ్ ఫ్రెండ్స్ కీ ఆ రోజు

రాత్రి అక్కడ స్పెషల్ పార్టీ ఏర్పాటుచేసాడు అతను. దాన్ని తలచుకుని అంతా హుషారుగా ఉంటే, నేను మాత్రం ఆ పార్టీకి రావడంలేదని చెప్పేసాను.

"నథింగ్ డూయింగ్. ఇది రొటీన్ బీర్ పార్టీ, ఛీర్ పార్టీ కాదు. అమరలోకాలలో తేలియాడించే అద్భుతమైన రేవ్ పార్టీ. ఎ రేర్ పార్టీ. ఎప్పుడో ఒకసారి చవిచూసినంతలో చెడిపోరు ఎవరూను. రేవ్ పార్టీలకు రెగ్యులర్ని నేను. అడిక్ట్ నయిపోయానా? లైఫ్ లో ఇటువంటి చిన్న చిన్న ఎంజాయ్ మెంట్సు కూడా మిస్ ఐతే...ఈ బ్రతుకెందుకు? ఈ సంపాదన ఎందుకు? కాలంతోపాటు మారాలి భాయ్... రాత్రి పార్టీకి అమ్మాయిలు కూడా వస్తున్నారు. నువ్వూ వస్తున్నావు!" అంటూ బలవంతం చేసాడు విక్రమ్.

మరీ మూర్ఖంగా కాదనలేని పరిస్థితి నాది. కారణం, విక్రమ్ నా ప్రాజెక్ట్ మేనేజర్ కూడాను. అతన్ని ఎంటాగనైజ్ చేయడం కేరీర్ దృష్ట్యా తెలివైనపని కాదు మరి...

గత రాత్రి దాని గురించే తీవ్రంగా ఆలోచిస్తూ పడుకున్నందువల్ల కాబోలు, ఆ కల వచ్చుంటుంది నాకు.

ఆధునికత పేరిట పాశ్చాత్యుల్ని చూసి వాతలు పెట్టుకునే సంస్కారాన్ని సంతరించుకున్న ద సో కాల్డ్ మోడర్న్ సొసైటీ - కమ్యూనిటీ గేదరింగ్స్ నుండి పబ్ కల్చర్ కి ఎదిగి... టీ పార్టీల స్థానంలో 'మందు' పార్టీలను ఫ్యాషన్ గా చేసుకుంటే... ఇంకా ఏదో కావాలని అర్రులు చాచుతూ 'రేవ్' పార్టీలకు తెర ఎత్తి మత్తులో జోగుతూ ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకుంటూ... చదివిన చదువును, బంగారు భవిష్యత్తును, విలువైన జీవితాన్ని బండలు చేసుకుంటోంది నేటి యువత. 'రేవ్' పార్టీలు తమ 'గ్రేవ్' కి మార్గాలని గుర్తించలేకపోతోంది. అదే గొప్ప కల్చర్ అని భ్రమపడుతోంది. అదే జీవిత పరమావధిగా భ్రాంతి చెందుతోంది.

సమాజంలో నానాటికీ పేరుకుపోతూన్న స్వార్థం... ప్రపంచీకరణ పేరిట కుదించుకుపోతూన్న ప్రపంచం... మెరుగైన ఆర్థిక పరిస్థితి... శృంఖలాలు త్రెంచుకున్న వ్యక్తి స్వాతంత్ర్యం... వెరసి సంస్కృతి సంకరానికి, జాతి పతనానికి దారి తీస్తున్నాయి. ఈ పోకడ ముమ్ముందు ఎటువంటి విపత్కర పరిణామాలకు దారి తీస్తుందోనన్న తలంపే భయం గొలుపుతోంది.

అమాయకపు కళాశాల విద్యార్థులే కాక పలు రంగాలకు చెందిన ప్రముఖులు, విద్యాధికులు సైతం బలహీనతకు లోనై మాదకద్రవ్యాలు అందించే తాత్కాలికపు ఉపశమనానికి, ఆనందానికి దీపపు పురుగుల్లా ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోవడం మిక్కిలి దురదృష్టకరమైన పరిణామం...

ఇలాంటి ఊహలెన్నో నా మదిని ఒక్కుమ్మడిగా ముసురుకున్నాయి. మొహమాటానికి పోతే ఏదో అయినట్లు, ఆ పార్టీలో పాలు పంచుకోవడం వల్ల వాటిల్లే ప్రమాదం ఏమిటో భగవంతుడు ఆ కల రూపంలో నన్ను హెచ్చరించాడనిపించింది. వ్యసనాలన్నీ 'జస్ట్ ఫర్ కంపెనీ' కి గానో, కుతూహలంతోనో ఆరంభం కావడం కద్దు, సాధారణంగా. విక్రమ్ కోసం నేను ఆ రేవ్ పార్టీలో పాల్గొంటే, రేపు దాని టెమ్టేషన్ కి నేను లొంగిపోనన్న హామీ ఏమిటి? అందమైన నా రూపం కలలోలా జుగుప్సాకరంగా, వికృతంగా మారడం నాకు ఇష్టం లేదు. పిచ్చాసుపత్రి పాలు అవ్వాలనీ లేదు. క్షణికపు ఆనందం కోసం జీవితాన్ని బలి చేసుకోవడం అవివేకమే అవుతుంది...

హఠాత్తుగా నా సెల్ ఫోన్ మ్రోగింది. లైన్లో విక్రమ్.

"సత్తీ! రాత్రి పార్టీకి నువ్వు తప్పక రావాలి సుమా! నువ్వు ఫెన్స్ సిట్టర్ వని తెలిసే మళ్ళీ ఫోన్ చేస్తున్నాను నీకు" అన్నాడు.

అప్పటికే ఓ దృఢ నిశ్చయానికి వచ్చిన నేను, "సారీ, విక్రమ్! రాత్రి నుండీ హై టెంపరేచర్ నాకు. పార్టీకి రావడంలేదు," అనేసి, మారు మాటకు తావివ్వకుండా ఫోన్ కట్ చేసేసాను.

ఇప్పుడు నా మనసు తేలికపడింది.




రాంబాబు పార్కులో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ప్రముఖ వార పత్రిక లవ్ కపుల్స్, "ప్రేమ ఊసులు" అనే పోటీ పెట్టింది. దానిలో పాల్గొని ఫస్ట్ ప్రైజ్ పదివేలు కొట్టేయాలని రాంబాబు ప్లాన్. అందుకే అంత తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అంతేకాదు తన ప్రియురాలు రమణిని కూడా రమ్మన్నాడు.

కాస్సేపటికి రమణి రుస రుస లాడుతూ వచ్చి "రాన్రాను నీకు బుద్ధి లేకుండా పోతోంది రాంబాబూ. నీకెన్నో సార్లు చెప్పాను మా ఆఫీసుకొచ్చి నన్ను పికప్ చేసుకుని పార్కుకు తీసుకురమ్మని. కానీ నాకు ఫోన్ లో మెసేజ్ పాస్ చేసి నీపాటికి నువ్వు వచ్చేస్తావు. అదే నాకు చిరాకు" అంది.

"అలా అనకు రమణీ... మా ఆఫీసేమో ఈ పార్కుకి దగ్గర... మూడు కిలోమీటర్ల దూరంలో వుండే మీ ఆఫీసుకి వచ్చి నిన్ను పికప్

చేసుకుని మళ్ళీ ఇక్కడికే తీసుకురావడం... అసలేమన్నా బాగుంటుందా చెప్పు?" అన్నాడు అనునయంగా.

"అదే నాకు చిరాకు. అందరూ తాము ప్రేమించిన అమ్మాయిల కోసం సప్త సముద్రాలు దాటమన్నా దాటతారే... చెట్లు... పుట్టలు ఎక్కమన్నా ఎక్కుతారు. నేనేమో బస్సులో కష్టపడి నీకోసం రావాలి. ఛ"

"నేను ఇలా పొదుపు చేస్తున్నది ఎవరికోసం చెప్పు? మన కోసమే కదా! రేపు పెళ్ళయ్యాక హ్యాపీగా వుండడానికేగా..."

"సర్లే... సొల్లాపి అర్జంటుగా రమ్మన్న విషయం ఏంటో చెప్పు?"

"అదీ... అదీ... అది..."

"చెప్పానుగా నా కసలే చిరాగ్గా వుందనీ... నాన్చకుండా త్వరగా చెప్పి తగలడు... అసలే ఆఫీసులో చేసిన హెవీ వర్క్ వల్ల టైర్డ్ అయిపోయాను"

"స్త్రీ అన్న తర్వాత కాస్త ఓపిక... సహనం వుండాలి... రమణి డాలింగ్"

"వుంటే కాళ్ళక్రింద వేసి తొక్కేద్దామనా?... నోరుమూసుకుని విషయమేంటో చెప్పు" అంది అక్కడున్న పెద్ద చెట్టు మొదట్లో కూలబడుతూ...

"మరేమో... లవ్ కపుల్స్ పత్రిక వాళ్ళు ప్రేమ ఊసుల పోటీ పెట్టారు. నువ్వు కాస్సేపు సిగ్గులమొగ్గై కాసిన్ని కులాశా కబుర్లు... కళ్ళతో ప్రేమని వడ్డిస్తూ చెబితే నేను ఇన్ స్పైయిర్ అయ్యి ప్రేమ ఊసుల్ని అక్షరాల్లో పెట్టేస్తా..."

"అసలు పదివేలొచ్చే ముఖమేనా నీది? ఏదో ఒకటి చెప్పి నన్ను ముగ్గులోకి దించుదామనుకుంటున్నావేమో? అలాంటి పప్పులేం ఉడకవు నా దగ్గర"

"అబ్బా ఎప్పుడూ నీ గోల నీదే కానీ... నా మాట వినిపించుకోవు. ఇదిగో ఈ పత్రిక చూడు" అని ప్రకటన చూపించాడు.

ఆమె కాస్త శాంతించి..."అసలు నీకు రాయడం వచ్చా?" అంది.

"రాయడం వచ్చానా? మా కాలేజ్ మ్యాగజైన్ లో రెండు మూడు కవితలు రాశాను... దినపత్రికలకి కొన్ని సమస్యల మీద ఉత్తరాలు కూడా రాసాను తెలుసా?"

"అబ్బో... చాలానే రాసావు..." వెటకారంగా అని "ఒకవేళ ఖర్మ కాలి నీ ప్రేమ ఊసులకే బహుమతి వచ్చిందే అనుకో... అది నాకే ఇస్తావా... మరి" అంది ఆశగా.

"ఇస్తావా ఏంటి? నీకో లవ్ సింబల్ వున్న బంగారపు ఉంగరం కానుకగా ఇస్తా" అన్నాడు.

"అయితే నేనేం చేయాలి?"

"అద్గదీ... ఏమీ చేయనక్కర్లేదు. ఎప్పటిలా సణుక్కుంటూ... విసుక్కుంటూ... ముఖం ముడుచుకుని చిరాగ్గా వుండకుండా... కాస్త నవ్వుతూ... సిగ్గులొలకబోస్తూ... నాలుగు కమ్మటి మాటలు చెబితే చాలు"

"అంటే... నేను సణుగుతూ... గొణుగుతూ... విసుగు తెప్పిస్తాను... నువ్వేమో ప్రశాంతంగా శ్రీరామ చంద్రమూర్తిలా వుంటావు... అంతేగా... అలాంటప్పుడు నాతో నీకేంటి? వెళ్ళి మరొకత్తెని చూసుకో" అని విసురుగా లేవబోయింది.

"అరే... మళ్ళీ ముక్కు మీద కోపం. మనమేమనుకున్నాం... ప్రేమ ఊసులు రాసి బహుమతి తెచ్చుకోవాలని కదా! అంతలోనే అలా చిచ్చుబుడ్డి వైతే ఎలా?"

"అవును ఆ ఊసుల వంకతో నన్ను చిరాకుదీ... చిచ్చుబుడ్డీ అని నాలుగు మాటలు అనాలనీ... నాకు తెలుసులే..." అంది బాధగా ముక్కు చీదుతూ..

"అది కాదు రమణీ... నేను నిన్నెందుకంటాను చెప్పు? అసలు నువ్వు వచ్చినప్పటినుండీ నన్నెన్నేసి మాటలు అన్నావు... చెప్పు నేనేమన్నా ఉడుక్కున్నానా నీలాగా?"

"అంటే పెళ్ళికాకుండానే నేను నిన్ను సాధిస్తున్నాను. నువ్వు మాత్రం సహనంతో నన్ను భరిస్తున్నావు అంతేగా"

"అబ్బా అలా కాదు రమణీ... కాస్త నేను చెప్పేది విను. రెండు మాటలు నవ్వుతూ మాట్లాడు చాలు... నేను కాగితం మీద కలంతో రెచ్చిపోతా... బహుమతి తెచ్చి తీరతా"

"...అంటే నేను మీ దృష్టిలో మొండిదాన్ని... పెంకి ఘటాన్ని... రెండు మంచి మాటలు అతి కష్టం మీద మాట్లాడాలి అంతేగా... బాయ్ ఫ్రెండ్ వున్నాడన్న ఆనందం లేదు నా ముఖాన. నా అంతట నేనే నీ దగ్గరకి రావాలి... పైనుండి మాటలు పడాలి. ఛీ దరిద్ర బ్రతుకు"

"అలా బాధ పడకు రమణీ... నాకూ బాధగా వుంది."

"వుండదూ మరి? మనసిచ్చిన ఆడపిల్లని ఎవరన్నా ఏడిపిస్తారా? నువ్వుతప్ప"

"నేనేడిపించానా?"

"లేదు నేనే మూడు కిలోమీటర్లు బస్ లో ఉబుసుపోక ఇక్కడికి వచ్చి ఏడుస్తున్నాను"

"అది కాదు... ప్రేమ ఊసుల పోటీ..."

"సరే... నా ఖర్మ... చెప్పు ఏం చేయాలో"

'హమ్మయ్య... దారిలోకొచ్చింది' అనుకుని "ఏవైనా ప్రేమగా నాలుగు మాటలు మాట్లడవా?"అన్నాడు.

"మా నాన్నకి ఈ నెల జీతం రాలేదు. సమయానికి మా బాస్ బిజినెస్ పనిమీద బెంగళూరు వెళ్ళాడు. ఎప్పుడొస్తాడో తెలీదు. మాకూ జీతాల్లేవు. ఇంట్లో చాలా కష్టంగా వుంది. మనమేమన్నా సినిమా ప్రేమికులమా? పార్కుల్లో ఒకరి కళ్ళల్లోకి ఒకళ్ళు చూసుకుంటూ కూర్చోడానికీ... డ్యూయట్లు పాడుకోడానికీ" రాంబాబు మనసు మూగదయిపోయింది.

"సర్లే... ఆ మాట ముందు చెప్పొచ్చుగా. ఇదిగో" అని పర్సులోంచి డబ్బు తీసి ఆమె చేతిలో పెట్టి "ఇహ వెళదామా?"అన్నాడు లేస్తూ.

"మరి ప్రేమ ఊసులు?"అంది.

"అవి అందరికీ వుండవని అర్ధమైంది. కలల్లో తేలిపోతూ రాయడానికి... వాస్తవానికీ తేడా వుంటుందని జ్ఞానోదయమైంది. పద నిన్ను బస్ స్టాప్ దగ్గర డ్రాప్ చేస్తాను" అని అక్కడే పక్కగా వున్న పల్లీల వాడికి ఆ పుస్తక మిచ్చి ముందుకు కదిలాడు.




చల్లగా మృదువుగా బుగ్గలను ఏదో తాకటంతో ఉలిక్కిపడి మెల్లిగా కళ్ళు తెరిచింది సావేరి. ఎదురుగా భర్త "పుట్టినరోజు శుభాకాంక్షలు నా దేవేరికి" అంటూ నవ్వుతూ వంగి అందంగా అధరాల మీద, లలాటం మీద మృదువుగా చుంబించాడు. "లే లేచి బ్రష్ చేసుకో" అన్నాడు.

"అరె మీరు ఇవ్వాళ ఇంత పెందరాలే లేచారేంటి?" అంది.

"ఏం నీ కన్నా ముందు లేవకూడదా! ఈ రోజు నీకు, నాకు స్పెషల్ డే. అందుకే అందంగా విభిన్నంగా ఈ రోజు జరుపుకుందాము". అన్నాడు.

సావేరి బ్రష్ చేసుకుని వచ్చేసరికి డైనింగ్ టేబుల్ మీద వేడి కాఫీ రెడీగా ఉంది.

"ఇవ్వాళ కాఫీ మీరు పెట్టారేమిటి" అంది సావేరి.

"ఇవ్వాళ ఇంకా చాలా విచిత్రాలు చూస్తావు" అన్నాడు.

"ఏమిటో ఆ గొప్ప విచిత్రాలు" అంటూ అలవోకగా నవ్వింది.

"అలా నవ్వకు, ఆ నవ్వు చూస్తే ఏం చేస్తానో నాకే తెలియదు" అన్నాడు.

"చెయ్యండి నేను వద్దన్నానా?"

"ఏయ్ చిలిపి ఏమిటదీ? సరే కానీ స్నానాలగదిలో నీ అభ్యంగనానికీ అన్నీ అమర్చాను. స్నానం చేసిరా" అన్నాడు.

కాఫీ తాగి స్నానాలగదిలోకి వెళ్ళిన సావేరి అక్కడ ఉన్న నూనె, నలుగుపిండి, కుంకుడురసం అన్నీ చూసి ఆశ్చర్యపోయింది. కూర్చుని పోసుకోవడానికి వీలుగా ముక్కాలిపీట.

స్నానం చేయడానికి నలుగుపిండి చేతికి తీసుకున్న కావేరి దాన్నించి వచ్చే సుగంధపరిమళాలు ఆశ్వాదిస్తూ నలుగు పెట్టుకుంది. తల స్నానం చేసి బట్ట చుట్టబెట్టుకుని వచ్చిన ఆమెకు మంచం మీద కొత్తబట్టలు సిద్ధంగా ఉన్నాయి. గంధం రంగు జరీ చీర, దానికి తగ్గ రవిక, లోపలి లంగా, అన్నీ అమర్చిన విధానాన్ని మైమరచి చూస్తోంది.

ఇంతలో సాంబ్రాణి పొగతో లోపలికి వచ్చిన సాగర్ ఆమెను అప్పుడే కొత్తగా చూస్తున్నట్లుగా చూసాడు. ప్రబంధ కవులు వర్ణించేటంత సొగసు కావేరిది. చేతిలో ఉన్న వస్తువులు కింద పెట్టి ఆమె వైపు అడుగులు వేసాడు.

నున్నటి ఆమె భుజాల మీద చెయ్యివేసి తనవైపు తిప్పుకున్నాడు. కొత్త పెళ్ళికూతురిలా అతని కౌగిలిలో ఒదిగిపోయింది సావేరి. కొన్ని క్షణాలు ఇద్దరిలో ఏదో తెలియని తమకం.

చుట్టుముడుతున్న మధురోహాలను పక్కకు పెట్టి అతని కౌగిలినించి విడివడి, "శ్రీవారు బైటికి వెడితే నేను బట్టలు వేసుకుంటాను" అంది.

మళ్ళీ ఏమనుకుందో స్నానాలగదిలోకి వెళ్లి లోపలి రంగా, రవిక వేసుకుని వచ్చింది. అద్దంముందు నుంచుని అందంగా చీర కుచ్చిళ్ళు పెడుతున్న భార్య వైపు, చీర కట్టులో ఆమె నైపుణ్యాన్ని చూస్తూ కూర్చున్నాడు. తలకు చుట్టుకున్న తువ్వాలు తీసి జుట్టు విదిలించింది. ఉంగరాలు తిరిగి భుజం దాటని జుట్టు అక్కడక్కడ వెండి తీగలు.

"వేణీ భరంబు విదిలించినంతనే వెదజల్లినవి పరిమళాలు, వెదజల్లినవి పరిమళాలు" అంటూ పాట అందుకున్నాడు. అతను మంచి సంగీతజ్ఞుడు, శృంగార పురుషుడు. అతని రసమయ సంగీతంలో మునిగి పోవడం ఆమెకు ఇష్టమైన చర్యల్లో ఒకటి. అతని నోట పలికే శృంగార గీతాలకు ఒళ్ళు పులకరిస్తుంది.

ఆమెను మంచంమీద కూర్చోబెట్టి ఆమె జుట్టు పాయలుగా విడదీసి సాంబ్రాణి పొగ వేసాడు. వద్దు వద్దంటూనే అతని చర్యలకు పరవశించిపోతోంది. పొగ వెయ్యడం అయ్యాక "జుట్టు చిక్కు తియ్యనా!" అన్నాడు. "చాల్లెండి నేను తీసుకుంటాను" అంది.

"ఐతే జడవేసుకుని ఈ పువ్వులు పెట్టుకో, అంటూ మల్లెల మాల డ్రెస్సింగ్ టేబుల్ మీద పెట్టాడు. జడ అల్లుకుని తలలో పువ్వులు పెట్టుకున్న సావేరి ని చూసి మళ్ళీ పాట మొదలుపెట్టాడు.

'తలనిండ పూదండ దాల్చిన రాణి మొలక నవ్వులతో మురిపించబోకే" అంటూ.

"నేను మురిపించాలనే కదా! స్వామి వారి అభిప్రాయం. అంటూ నవ్వింది.

అతని ప్రవర్తన విచిత్రంగా వున్నా అతని ముచ్చట తీరుద్దామని ఊరుకుంది. వంటింట్లోకి వెళ్ళబోతున్న ఆమెను వారించి, "నువ్వు పూజ చేసుకుని రా" అన్నాడు.

అతని మాటను కాదనలేక పూజగదిలోకి వెళ్ళింది. అక్కడ అంతా తను రోజూ అమర్చుకునేటట్లుగా అన్నీ అమర్చి వున్నాయి. పూజకు పూలు, సెమ్మాల్లో వత్తులు, నూనె వేసి వున్నాయి. కాస్సేపు భర్త గురించిన ఆలోచనను పక్కకు పెట్టి దైవధ్యానం వైపు మనసు మళ్ళించింది. పూజ పూర్తయ్యి తులసిలో నీళ్ళు పోసి వచ్చేసరికి, డైనింగ్ టేబుల్ మీద ఫలహారం తయారుగా ఉంది.

చిరుకోపం ప్రదర్శిస్తూ "ఏంటీ ఈ రోజు నన్ను ఏ పని చెయ్యనివ్వరా!"

"నా శృంగార రసాధిదేవతకు ఈ రోజు విశ్రాంతి. పుట్టినరోజునాడు పనిచేయడమా! పాపము శమింపుగాక" అన్నాడు.

"ఏమిటి ఇవ్వాళ అయ్యగారి పైత్యం ఎక్కువైనట్లుంది. ప్రతీ ఏడాది చేస్తున్నాను కదా!" అంది.

"నువ్వు ఎలా అనుకున్నా ఫరవాలేదు. నేను ఇవ్వాళ ఇలాగే ఉంటాను. ఈ రోజు నేను చెప్పినట్లు నువ్వు చెయ్యాలి" అన్నాడు.

పకపకా నవ్వింది విరగబడి నవ్వుతుంటే ఆమె అందాలు ద్విగుణీకృతమవుతున్నాయి.

"అలా నవ్వద్దన్నానా! నవ్వితే నాకేదో ఔతాది ఏదో లోకాలకు నా మనసు ఎల్లిపోతాది" అన్నాడు సాగర్.

"నెలతపై మోహము నిలుపరాకుంటేను, సొలసి పయ్యెదలోను చొచ్చుకోరాదా!

తలకొన్న యాకె చక్కదనము నీకు చాలైతే పొలుపుమీర వర్ణించి పొగడరాదా" అంటూ అన్నమయ్య కృతిలోని చరణం పాడింది.

"అమ్మ దొంగా నీకు కూడా పాటలు బాగానే వచ్చే" అన్నాడు సాగర్.

"సహవాసదోషం మరి. ఇన్నాళ్ళూ మీ పాటలు వినీ వినీ నాక్కూడా మీ వాసన కొంచెం వచ్చింది మరి. మీ అంత బాగా పాడకపోయినా నాకూ కాస్త పాడ్డం వచ్చు మరి" అంటూ హాస్య మాడింది.

వాళ్ళిద్దరూ నవదంపతులు కాదు కానీ మానసికంగా వాళ్ళిద్దరూ నిత్య యవ్వనులు. దాంపత్యంలో ఉన్న మాధుర్యానికి నిర్వచనం ఆ జంట. ఎన్నాళ్ళయినా వసివాడకుండా మధురిమలు చిందించే అపురూప నికుంజం.

గ్రంధాల్లో చెప్పబడిన పురుషార్ధాలు నాలుగు. ధర్మం, అర్ధం, కామం, మోక్షం. ధర్మ, అర్ధ, మోక్షాల్ని త్రివర్గాలంటారు. నాలుగవది కామం. సరి అయిన రీతిలో విపరీత ధోరణికి లోను కాకుండా దీనికి కూడా సముచిత స్థానాన్ని ఇవ్వాలి.

పురుషుడ్ని స్త్రీ ప్రేమించాలంటే ఆమె కోరుకునే గుణాలు అతనిలో ఉండాలి. పెళ్లి చూపుల్లో ఎంతసేపూ అబ్బాయికి అమ్మాయి నచ్చిందా అని అడుగుతారు. కానీ అమ్మాయికి అబ్బాయి నచ్చాడా లేదా అన్నది ఈ నాటికీ ప్రాధాన్యం ఇవ్వరు. అతని ఆర్ధిక స్థితిగతుల్ని చూసి అతని యోగ్యతను నిర్ణయిస్తారు.

మానసికంగా ఏ భర్త భార్యకు దగ్గరవుతాడో అతని లో ఆమె మమేకం అవుతుంది. స్త్రీ తన పురుషుడికి దూరంగా ఉండలేనన్న భావన, అతన్ని అలలా అల్లుకుపోవాలన్న తపన కల్గించినవాడే భర్తగా అతను విజయం సాధించినట్లు.

సావేరి, సాగర్ ల దాంపత్యం అలాంటిదే. ఆమె అంటే అతనికి అనురాగం. తన ప్రణయాధిదేవత గా ఆరాధిస్తాడు. ఆమె మనసెరిగి మసలుతాడు. చీకటి పడేసరికి ఇల్లు చేరుకోవాలన్న ఆత్రుత పెళ్ళయిన నాటి మొదలు ఈ నాటికీ కొనసాగుతోంది. భార్య సమక్షం అతనికి ఒక మధురమైన అనుభూతి. అతని ముచ్చట తీర్చటమే ఆమె జీవిత పరమావధి. సావేరి అతని పైన ఎప్పుడైనా అలిగితే జయదేవుని అష్టపది లో అతనికిష్టమైన పదం అందుకుని ప్రాధేయపడుతాడు.

"క్షమ్యతామపరం కదాపి తవే దృశ్యం న కరోమి, దేహి సుందరి దర్శనం మమ మన్మధేన దునోమి కుపితేవ" ఓ సుందరీ నీ విషయమై నేనేమైనా అపరాధం చేసిఉంటే నన్ను క్షమించు. ఇక ఎప్పుడూ ఇలాంటి అపరాధం చెయ్యను. నేను మన్మధుని బాధతో విలవిల లాడుతున్నాను. నన్ను అనుగ్రహించు. అని దాని అర్ధం.

"సాయంకాలం డిన్నర్ బైట చేద్దాం" అన్నాడు.

"మరి ఇప్పుడేం చేద్దాం! అది కూడా మీరే చెప్పండి" అందంగా కొంటెగా మూతి విరుస్తూ.

"ఎంచక్కా ఇద్దరం కలిసి వంట చేసి భోజనం చేద్దాము." అన్నాడు.

"పోనీ ఇవ్వాళ్టికి మనం భోజనం మానేసి ఒకర్ని ఒకరు భోజనం చేద్దామా!" అంది వేళాకోళంగా.

"సరేలే నీ పని తరువాత చేస్తాను. ఆత్మారాముడు ఊరుకోడు కదా! అందుకని వంట మొదలుపెడదాము" అంటూ వంటింట్లోకి దారితీసాడు.

ఆమె అతన్ని అనుసరించింది. "మీరు అలా గట్టుమీద కూర్చుని మంచి పాటలు పాడుతూ ఉండండి. నేను అలవోకగా చిటికెలో వంట చేస్తాను సరేనా!" అంది.

"ఒహో అలాగే బహు బాగు" అంటూ వంటింటి గట్టు ఎక్కి కూర్చున్నాడు.

ముఖారి రాగంలో జయదేవుని అష్టపది మొదలుపెట్టాడు.

పాట పూర్తయ్యాక అడిగాడు "అర్థమయ్యిందా". అంటూ

"చతురులే భావయుక్తంగా నీవే నాకు భూషణం. నీవే నాకు జీవనం, నీవే నా సంసారమనెడి సముద్రంలోని రత్నానివి ప్రియే చారుశీలే అంటూ పొగిడారు. నన్ను మురిపించడానికి కాకపోతే ఈ పాట ఎందుకు పాడినట్టో" అంటూ నవ్వింది.

"రాత్రికి ఫైవ్ స్టార్ హోటల్ లో డిన్నర్, రూమ్ బుక్ చేసాను." అన్నాడు.

"ఇప్పుడవన్నీ ఎందుకండీ" అంటూ కోపంగా చూసింది.

"ఈ రోజు నీ పుట్టినరోజు తో బాటు పెళ్ళిరోజు కూడా. మర్చిపోయావా? నీ మనసులో ఉన్న చిన్న కోరిక నా ముందు వెలిబుచ్చావు. మీ చెల్లెలు మొదటిరాత్రి ఫైవ్ స్టార్ హోటల్ లో బుక్ చేసారని, నువ్వెప్పుడూ అది ఎలా ఉంటుందో చూడలేదని అన్నావు. మన పెళ్ళి అప్పుడు నాకు ఆ స్తోమత లేదు. కాబట్టి ఆ కోరిక నాకూ ఉన్నా తీరలేదు. ఇన్నేళ్ళ తరువాత నీ కోరిక తీర్చాలనిపించింది. అది నా బాధ్యతే కాకుండా ఆనందం కూడా" అన్నాడు.

"వద్దు వద్దు అప్పుడు తెలియక ఏదో అన్నాను. నాకు ఇప్పుడు అలాంటి కోరికలు లేవు. కావాలంటే భోజనం ఏదైనా హోటల్ కు వెళ్ళి చేసి వద్దాము. నా మాట వినండి. కాన్సిల్ చెయ్యండి వాళ్ళు ఒక వేళ డబ్బులు తిరిగి ఇవ్వకపోయినా పరవాలేదు" అంది.

ఆమె ఎందుకు అలా అంటోందో సాగర్ కు అర్ధం కాలేదు.

సావేరి కి చెల్లెలు గుర్తుకు వచ్చింది. తన కన్నా ఏడేళ్ళు చిన్నదైన చెల్లెలంటే సావేరికి అపరిమితమైన ప్రేమ. అందంగా ఉన్న చెల్లెల్ని ఏరికోరి చేసుకుంటానని ఒక బిజినెస్ ఫామిలి వచ్చింది. తల్లి తండ్రి మురిసిపోయి తాము వాళ్ళతో తూగుతామో లేదో అని ఆలోచించకుండా, వాళ్ళు కబురు పెట్టడమే మహా భాగ్యమని అనుకున్నాను.

చెల్లెలి కళ్ళల్లో కలవారింటి కోడలైనందుకు గర్వం, మెరుపు. మొగ పెళ్ళివారి కోరిక మేరకు ఫైవ్ స్టార్ హోటల్ లో మొదటి రాత్రికి రూమ్ బుక్ చేసారు.. చెల్లెల్ని దింపడానికి వెళ్ళిన సావేరి ఆ లైట్లు, ఆ ధగధగలు, ఆ అలంకరణ చూసి మురిసిపోయి కొన్ని క్షణాలకు మాత్రం అలాంటి సుఖం తమకు కూడా దొరికితే ఎంత బాగుంటుందో అని అనుకుంది. తమ పెళ్ళి లో తామేదో మిస్ అయ్యాయన్న భావన. అదే విషయం మాటల మధ్యలో సాగర్ తో చెప్పిందొకసారి.

చెల్లెలంటే ఈర్ష్య లేదు కానీ అలాంటి సుఖం తమకు దొరకలేదన్న చిన్న బాధ ఆమె మనసులో మెదిలేది. ఆ తరువాత చెల్లెలు కూడా గర్వంగా గొప్పగా దాన్ని గురించి వర్ణించడం తో ఆ అనుభూతి తాను కూడా పొందితే బాగుంటుందని భ్రమపడింది.

పెళ్ళయిన రెండేళ్ళకు అక్కగారింటికి వచ్చింది కావేరి. నాలుగురోజులు ఉన్న కావేరి, అక్కగారి దాంపత్యాన్ని చూసి ఆనందపడింది. ఈర్ష్య పడింది. అక్క కన్నా తను గొప్ప కోడలయ్యిందని గర్వపడింది. మురిసిపోయింది. తాను రాణి అనుకుంది. అసలయిన రారాణి అక్క అని తెలుసుకునేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. అనురాగం, ఆప్యాయత చిందించే భర్త ఉంటే

గుడిసెలో కూడా ఆనందం గా ఉండొచ్చు అనుకుంది.

అక్కపట్ల బావగారి ప్రవర్తన చూడకూడదనుకుంటూనే ఆమె కంట పడింది. అతని చిలిపి చేష్టలు, దానికి అక్క ప్రతిస్పందన చూసి, తన దాంపత్యం తో పోల్చుకుంటే ఆమె గుండె బరువెక్కింది.

తన బాధ అక్కగారి తో చెప్పుకుంది. కావేరి భర్తకు ఆడంబరాలంటే ఉన్న ఇష్టం, ఆప్యాయతలు, అనురాగాలపట్ల లేదు. ఇవన్నీ అతని దృష్టిలో ట్రాష్. భార్య అంటే అందంగా అలంకరించుకుని నలుగుర్లో ప్రదర్శించే బొమ్మ. భార్య ఫీలింగ్స్ తో అతనికి పనిలేదు. అతనితో కాపరంలో ఆమె మనసు బీటలు బారింది. బీడు భూమిలా తయారయ్యింది.

సావేరి చెల్లెలి కాపురం గురించి తెలుసుకుని బాధపడింది. కొద్ది క్షణాలకయినా డబ్బులో సుఖం ఉంటుందని భ్రమపడి చెల్లెలికి ఉన్నది తనకు లేదని, తనకు లేనిది చెల్లెలుకు ఉందని ఈర్ష్య పడింది. కానీ నిజం తెలిసాక తన తప్పిదనం తెలిసి వచ్చింది. అందుకే ఆ రోజే తన మనసులోంచి ఫైవ్ స్టార్ హోటల్ కోరిక తుడిచివేసింది.

ప్రొద్దున్నుంచి ఎంతో ఆనందంగా ఉన్న భార్య తన చిరకాల వాంఛ తీరుతున్నందుకు మురిసిపోయి తనను అభినందిస్తుందని అనుకున్న అతనికి, భార్య ప్రవర్తన కలవరపరిచింది. ఈ రోజు ఎంతో మధురంగా, అద్భుతమైన రోజుగా మలుద్దామని వేసిన ప్రణాళిక ఇలా అయ్యిందేమిటా! అని బాధపడ్డాడు.

హోటల్ లో భోజనం చేసి ఇంటికి వచ్చారు... ఇంటికి తిరిగి వచ్చాక వాతావరణం ఎలా ఉంటుందో అని భయపడ్డాడు సాగర్. బట్టలు మార్చుకుని మంచం మీద వాలాడు. కొద్దిసేపటిలో తెలుపు రంగు మీద చిన్న చిన్న పూలు ఉన్న చీర కట్టుకుని వచ్చింది సావేరి. తలలో జాజులు, ఆమె వంటిమీద నుంచి వచ్చే సుగంధం అతన్ని మైమరపింప చేసింది. అతని పక్కన కూర్చుని, నుదుటిమీద చుంబించి,

"శ్రీవారికి కోపమొచ్చిందా! ఇదివరలో నా చెల్లెల్ని చూసి అందులో ఏదో సుఖముందని భ్రమపడ్డాను. కావేరి కాపరం గురించి తెలిసాక నా కున్నదేమిటో దానికి లేనిదేమిటో నాకు అర్థమయ్యింది. సుఖం అన్నది ఫైవ్ స్టార్ హోటల్ లో కాదు మన మనస్సులో ఉందని గ్రహించాను. మీ లాంటి సహృదయుడ్ని భర్త గా పొందిన నేను ఎంత అదృష్టవంతురాల్నో నాకు తెలుసు." అంది.

నీ మనసు నాకు అర్థమయ్యిందన్నట్లుగా తల ఆడించి ఆమె చుట్టూ చేయివేసి దగ్గరగా తీసుకున్నాడు. వారి కలయిక లో ఆవేశం

లేదు. ఆమె చుట్టూ ఉన్న ఆ చేతులు కంచుకోటలా ఒక భద్రతాభావాన్ని ఇస్తోంది. ఆమె అతని పొందును ఎందుకు కోరుకుంటోందో తెలియడానికి ఆ చేతులే తార్కాణం.

భార్య లో ప్రియురాల్ని చూడగలిగిన భర్త కౌగిలిలో అన్ని స్వర్గాలు ఉన్నాయని సావేరి ఎప్పుడో గ్రహించింది. తానెంత అదృష్టవంతురాలో అని రోజులో కనీసం ఒక ఇరవై సార్లయినా అనుకుంటుంది. ఆ రోజుకి వాళ్ళ పెళ్ళయి పాతిక సంవత్సరాలు. సావేరికి నలభై మూడు సంవత్సరాలు. పిల్లలు గ్రాండ్ గా సెలబ్రేట్ చేస్తామన్నారు. సాగర్ నిరాకరించాడు. "మీ తోడు మీరు వెతుక్కోండి. నా తోడు తో నేను ఆనందంగా గడుపుతాను". అన్నాడు.

ఆమె చెవులో గుసగుసగా అన్నాడు "నువ్వు నాకు, నేను నీకు. ప్రియే చారుశీలే".




ఆరోజు ఎందుకో పలావ్ చెయ్యాలనిపించింది సుప్రజకి. భర్త రవికి పలావ్ అంటే ఇష్టం లేదు కానీ తనకు ఇష్టం. ఐదేళ్ళ కొడుకు ధనుష్ కి కూడా నచ్చుతుంది. అందుకే పలావ్ వండింది. రుచి చూస్తే బాగా కుదిరినట్టనిపించింది. రవి ఏమంటాడో చూడాలి అనుకుంది.

పెళ్లి అయిన కొత్తలో సుప్రజ బాగా వంటలు చేస్తుంది అని వాళ్ళమ్మ చెప్పగానే 'అదృష్టవంతుడిని' అనుకున్నాడు రవి. ఎందుకంటే రవి కాస్త భోజనప్రియుడే. రుచులు కూడా ఎక్కువే!

కొత్త కాపురంలో రోజుకో వెరైటీ టిఫెన్ చేసేది.

ఒకరోజు ఎగ్ సాండ్విచ్, వెరైటీ నూడెల్స్, మరో రోజు పాస్తా... హోటల్లో తప్ప ఇంట్లో ఇవన్నీ చేసి తినచ్చు అన్న సంగతే తెలియని రవి బాగానే ఎంజాయ్ చేసాడు.

అప్పుడప్పుడు ‘ఉప్మా చెయ్యకూడదా’ అని సుప్రజను అడిగితే వింతగా చూసేది సుప్రజ! ఇన్ని వెరైటీ వంటలను రుచి చూపిస్తూ వుంటే afterall ‘ఉప్మా చెయ్యమనటమా?

“వెజిటబుల్స్ వేసి చెయ్యనా ఉప్మా?” అంటే?

“వద్దు అల్లం, ఉల్లిగడ్డలు వేసి చెయ్యి.చాలు” అని అతనంటే ఉత్సాహం నీరుకారిపోయేది. వెజిటబుల్స్ కూడా వెయ్యకుండా ఉప్మాకు రుచి ఎలావస్తుంది? అని అంటే.

“మాకు అమ్మ రోజూ పొద్దున టిఫిన్ ఉప్మానే చేసేది.” అతని సమాధానం విని.

“రోజూనా?? ఉప్మానా??” వెగటుగా చూసేది సుప్రజ. ఆపై ఏదో కోరుకుంటున్నాడు కదా అని అలాగే చేసిపెట్టేది.

ఏంతో అపురూపంగా తినేవాడు రవి.

ఒకరోజు కన్నడ వంట ’బిసి బేలేబాత్’ చేసింది బాగా వెజిటబుల్స్ వేసి. అది పూర్తి సౌత్ ఇండియన్ వంట కాబట్టి రవికి బాగా నచ్చుతుంది అనుకుంది.

అది వడ్డించాక “మాఇంట్లో అమ్మ వెజిటబుల్స్ అయిపోతే ఈ బాత్ చేసేది. అలాగే అలవాటు నాకు"

"మరి హోటల్స్ లో వెజిటబుల్స్ వేసి చేస్తారు కదా”

“అవును. అందరు అలాగే చేస్తారేమో. మావూరిలో సంతకు వచ్చే కూరగాయలు వారం పొడుగునా సరిపోయ్యేవి కావు అందుకు కూరగాయలు అయిపోయిన రోజున ఇది చేసేది"

“ఒక మాట అడగనా...” అన్న సుప్రజ మాటలకి

“చెప్పు" అన్నాడు రవి.

“మీరు అమ్మదగ్గర ఎన్ని ఏళ్లు వున్నారు?”

“స్కూలు పూర్తి అయ్యేవరకు...”

“ఆ తరువాత హాస్టల్ లో వుండే కదా చదువుకున్నారు? ఆ వంట కంటే నా వంట బాగుండదా?” కోపంగా అంది సుప్రజ.

“సారీ సుప్రజా, నీ వంట బాగుండదు అని నేను ఎప్పుడైనా అన్నానా?”

“మరి ఏమిటి ఎప్పుడు ఏది చేసినా మీ అమ్మ వంటతో పోలుస్తారే తప్ప ‘ఇది బాగుంది’ అని చెప్పరు కదా"

“అమ్మ చేసినవి గుర్తుకు వస్తాయి అని చెబుతాను అంతే. నీ వంట ఎప్పుడూ స్పెషల్ నాకు” సుప్రజను బుజ్జగించాడు రవి. తప్పదు మరి!

********************** ********************** **********************

స్కూల్ నుండి రాగానే బ్యాగ్ పడేసి బాత్ రూం కెళుతూ “మమ్మీ ఆకలి…” అని గట్టిగా అరిచాడు ఐదేళ్ళ ధనుష్.

“రెండు నిమిషాలు" అంది సుప్రజ ad లో వచ్చే మమ్మీ లాగ.

నిజంగానే వాడు బాత్ రూం లో నుండి రాగానే వేడి వేడి Maggie noodles రెడీ చేసిపెట్టింది. రవి లాగే ధనుష్ కి కూడా రుచులెక్కువ . అందుకే సుప్రజ వంటలో ప్రత్యేకత చూపుతుంది ఎప్పుడూ. రోజుకో రకంగా వెరైటీ టిఫిన్లు చేసిపెడుతుంది. సుప్రజ చేసే వెజిటబుల్ ఉప్మా కూడా వాడికి చాలా ఇష్టం. ఇడ్లి చేసినా క్యారెట్, జీడిపప్పు వేసి కలర్ ఫుల్ గా బాగా అందంగా వుండేలా చేస్తుంది.

********************** ************************** *******************

“ హాలిడేస్ కి అమ్మమ్మ దగ్గరికి వెడదాం ధనుష్" అని ధనుష్ తో అంటే చాలా ఉత్సాహపడ్డాడు ధనుష్. అదే మాట రవితో అంటే శని, ఆది వారాలు కలిసి వచ్చేలా చూసుకుని అందరూ సుప్రజ అమ్మగారింటికి బయలుదేరారు.

“పొద్దుటే వచ్చేస్తామమ్మా” ఫోనులో అమ్మకు చెప్పింది సుప్రజ .

“వచ్చెయ్యండి .నీకు ఇష్టమైన ఇడ్లీలు చేసిపెడతా” సంతోషంగా అంది సుప్రజవాళ్ళ అమ్మ సుశీలమ్మ.

“అమ్మ ఇడ్లీలు చేస్తుందట. అమ్మ ఇడ్లీలు ఎంత మెత్తగా చేస్తుందో తెలుసా రవి” అమ్మ చేసే ఇడ్లీలు నోట్లో వేసుకుంటే ఎలా కరిగిపోతాయో అని సంతోషంగా చెప్పింది సుప్రజ .

*************** *******************
*************

గుమ్మం దగ్గరే సుప్రజను ఆప్యాయంగా వాటేసుకుంది సుశీలమ్మ. మనవడిని ఎత్తుకుని ముద్దాడింది.

“అమ్మమ్మా ఆకలి...” అని అడిగాడు ధనుష్.

“వాడికి ఆకలి ఎక్కువమ్మా” అంది సుప్రజ.

“వేడి వేడి ఇడ్లీలు రెడీ... ముఖం కడుక్కుని రండి టేబుల్ మీద పెట్టేస్తా” హడావిడి గా వంటింట్లోకి వెళ్ళింది సుశీలమ్మ.

వీళ్ళు Fresh up అయ్యేసరికి సెగలు కక్కే కాఫీ ఇస్తూ, ఇడ్లీలు పెట్టిన హాట్ కేస్ మూత తెరిచింది. ఫ్రెష్ గా వున్న ఇడ్లీలు నోరూరించాయి .

ధనుష్ కి ఒక ప్లేట్ లో ఇడ్లీలు పెట్టి సాంబారు వేసింది సుప్రజ.

“చూడు ఎంత మెత్తగా వున్నాయో ఇడ్లీలు” అని సుప్రజ అంటున్నా ధనుష్ మాట్లాడకుండా తింటూ వున్నాడు.

“ధనుష్, అమ్మమ్మ ఇడ్లీలు బాగున్నాయా? నీకు అమ్మ ఇడ్లీలు ఇష్టమా, అమ్మమ్మ చేసేవి ఇష్టమా?” అనడిగాడు రవి .

ధనుష్ వెంటనే “అమ్మ చేసేవే బాగుంటాయి కలర్ ఫుల్ గా, ఇంకా టేస్టీ గా" అన్నాడు తిరుగులేనట్టు .

సుప్రజ గర్వంగా చూసింది కొడుకు వైపు!!!

“ఐదేళ్ళ వీడికే అమ్మ వంట రుచి అంతగా తెలిస్తే ఇన్నేళ్ళ నాకు మా అమ్మ వంట బాగుంటే తప్పేంటి?”

రవి మాటలకి అవాక్కయ్యింది సుప్రజ !!!




"ఏమండోయ్!" అది మా ఆవిడ పిలుపు కాదు కెవ్వు కేక! ఏ బల్లో, బొద్దింకో, దాడి చేసే వుంటుంది లేదా ఏ స్టూలో ఎక్కుంటుంది కంటబడ్డ బూజు దులపడానికి! ఏం చేయాలి దేవుడా! కాలో చెయ్యో విరగలేదు కదా! గుండె గుబేలుమంటుంటే వసారాలో కూర్చుని నింపాదిగా చదువుతున్న పేపర్ ను గిరటేసి ఇంట్లోకి పరిగెత్తాను.

చూడ్డానుకదా కొత్తగా కొనుక్కున్న సెల్ ఫోనును పరీక్షగా చూస్తోంది. ఫోనులోని అప్లికేషన్లు, ఫీచర్లన్నీ దాదాపు ఔపోసాన పట్టేసిందే!

"ఆ...! పడేసావా? అనుకున్నాను, సుతారంగా పట్టుకుని ఫోను మీద ఫోను చేస్తుంటే! అయినా నా ఫోనుంది, ల్యాండ్ లైనుందిగా అంటే అక్కతో, కొడుకుతో మాట్లాడుకోవాలి, పచారీ కొట్టునుంచి సూపర్ బజారు వరకు ఫోనుమీదే జరిగిపోతుంది పైగా కిట్టీ పార్టీ సభ్యులంతా రకరకాల ఫోన్లు తెస్తారని, వారందరికి ఎసెమ్మెస్సులు, ఎమ్మెమెస్సులు ఇచ్చుకోవాలని నీ చెవిని సెల్లుకోసం నా చెవినిల్లు కట్టుకుని పోరావు."

"నేచెప్పేదేదైనా వినేదుందా, మీ దండకమిలాగే పొడిగిస్తారా?" హుంకరించింది మా ఆవిడ.

"ఊ... సరేలే చెప్పు వింటానుకాని, ఏమైందేమిటి అలా బిగుసుకు పోయావు?" అన్నాను నవ్వుతూ చేతిలో వున్న సెల్ ఫోను నా ముఖం ముందు పెట్టింది.

అందులో కనపడిన మెసేజ్ చదివాను.

"ఓహో! మీ అక్క మేసేజిచ్చిందా? నీకొచ్చిన మొదటి మెసేజ్ ఇచ్చిన థ్రిల్లా ఇది! ఏమోనని హడలిపోయాను. మీ అక్కగారు బావగారితో కలిసి నడక యోగంలో ఉన్నారేమోలే!"

"అబ్బ! అర్థం కాదేమిటి మీకూ..." మా ఆవిడలో కనబడ్డ విసుగు ఆమె ముఖమంతా పరచుకుంది.

ఆ విసుగెందుకో నాకు నిజంగానే అర్థం కావడంలేదు.

ప్రేమ పెరిగి చెల్లాయి గుర్తొచ్చినప్పుడల్లా, ఫోను చేసి "బుజ్జి లేచిందా?" అని ఒకసారి, "బుజ్జి ఏం చేస్తోంది?" అని మరొకసారి నాకు ఫోన్ చేసి అడిగేది.

'బుజ్జీ! నీకు మీ అక్క ఫోను!' అంటూ నేను సరదాగా ఆటపట్టించేవాడిని.

"సరేలే మీకిదొక ఆటయిపోయింది, అందుకే నాకంటూ ఒక ఫోనుండాలి." అని ఫోనందుకుని వాళ్లక్కతో కబుర్లలో మునిగేది.

'మరి కొత్తఫోనులో మెసేజ్ నాకు చూపడంలో... అర్ధమయింది.'

"ఓ... గోంగూర పచ్చడి చేస్తున్నావనా? సరే, రమ్మని రిప్లయి కొట్టు! ఎక్కడ పని అక్కడ వదిలేసి వచ్చెయ్యదూ!" నవ్వాను.

"మా అక్కపై మీ జోకులాపి ఈ మెసేజ్ ఎవరిచ్చారో ముందు చూస్తారా?"

'ఇంకెవరు?' అప్పుడు చూసాను పంపినవారి పేరు! ఎవరో కాదు రాము! ఎదురింటి కుర్రాడు రాము!

'కుర్రాడు బుద్ధిమంతుడు, మంచి, మర్యాద తెలిసినవాడు. పెద్దలంటే గౌరవమున్న వాడు. ఇటునించి పిలిస్తే చాలు, అటునుంచి ఓ అని పలుకుతాడు. మా ఇరువురి ఫోన్ల లోనూ అతడి నంబరుకే ఎక్కువ సార్లు చేస్తున్నట్టు ఫోన్లు రికార్డు చేసి మరీ చూపిస్తుంటాయి.'

'మరి మా ఆవిడకు ఇలా మెసేజ్ ఎందుకిచ్చుంటాడబ్బా! బహుశా నేను మా ఆవిడను బుజ్జి అని పిలవడం విని ఉంటాడు. అయినా ఇలా చిన్న పిల్లనడిగినట్టు అడిగాడంటే ఏదో జోక్ చేద్దామనే ఉంటుంది. నెల ఏప్రిల్ సరే, కాని ఒకటో తారీకు కాదే!'

'సరేలే, చిన్న కుర్రాడు, ఏదో సరదాకు మెసేజ్ చేసుంటాడులే అని మా ఆవిడకు నచ్చ చెప్పినా, నా మనసు మాత్రం ఎందుకిలా ఇచ్చాడు అని ఆలోచిస్తూనే ఉంది. రామును పిలుద్దామంటే వేసిన గుమ్మం వేసినట్లే ఉంది. ఫోను చేద్దామని ఫోనందుకున్నాను. కాని ఫోనులో ఏం మాట్లాడుతాము? పైగా నొచ్చుకుంటాడేమో అపార్ధం చేసుకున్నామని. అందుకే రాము వచ్చేదాక ఆగితే ఏం పోయిందనుకున్నాను.'

నింపాదిగా పేపర్ చదువుతుంటే రాము ఇంటి గుమ్మం చప్పుడయింది. చేతిలో సంచితో ఇటే వస్తున్నాడు.

"అంటీ లేరా?" లోపలికి చూస్తూ అడిగాడు, సంచి నుండి తీసిన వెడ్డింగ్ కార్డ్ నా చేతిలో పెడుతూ.

రాము వెడ్స్ దీప(బుజ్జి).

ఓ! నీ కాబోయే శ్రీమతి కూడా బుజ్జేనా! మీ ఆంటీ కూడా ఇంట్లో వాళ్లకు ఇప్పటికీ బుజ్జే!

రాము గొంతు విన్న మా ఆవిడ టీ, టీతో పాటు బిస్కట్లు పట్టుకొచ్చింది. నేనందించిన పెళ్లిపత్రిక ను ఆసక్తిగా చూస్తోంది.

"ఆంటీ! మీరు ఏం అనుకోనంటే ఒకమాట... ఆగాడు."

'ఏం చెప్తాడా?' అని కుతూహలంగా చూసా.

"ఆంటీ మీ నంబరు, రమ నంబరు చివరి నాలుగు సంఖ్యలు ఒకటే... అందుకే పొరపాటున తనకు వెళ్ళాల్సిన మెసేజ్ మీకు వచ్చేసింది. సారీ ఆంటీ!"

నాకు నవ్వాగలేదు. మా ఆవిడా మూతి బిగించి నవ్వుకుంటూనే ఏదో పనున్నట్టు హడావిడిగా ఇంట్లోకి వెళ్లడం బహుశా తనివిదీరా నవ్వుకోవాలనేమో!

మా నవ్వులు రాము ముఖంలో దిగులును తుంచి కాంతిని పెంచాయి.

"అంకుల్ మాపెళ్ళికి తప్పకుండా రావాలి. ఇంకా ఎందరికో ఇవ్వాలి పత్రికలు, తప్పకుండా రండి. మరి వెళ్ళొస్తానండి. ఆంటీకి కూడా చెప్పండి."

రాము అటువెళ్ళగానే, నేనింట్లో కడుగేసా,

'ఏం చేస్తున్నావు బుజ్జి?' అంటూ!




సుబ్బయ్యశెట్టి మధ్యాహ్నం దుకాణం నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ వీధి లోంచి వెలుతూ సందు తిరిగాడు.ఆ వీధి లో వుంటున్న రంగనాథం అరుగు బయట కూర్చున్నాడు. అతను సుబ్బయ్యశెట్టి ని చూసి "ఏంటండి... సుబ్బయ్యశెట్టి గారు, ఈ నెల సరుకులు ఇంకా పంపించలేదు." అని అడిగాడు. సుబ్బయ్య శెట్టి ఏదో సమాధానం చెప్పేలోగానే లోపలినుంచి రంగనాథం కొడుకు చెబుతూ

"నేనే పంపించొద్దన్నాను,నాన్నా" అన్నాడు.

"ఏరా..ఎందుకు?" అడిగాడు రంగనాథం.

"ఏమీ లేదు నాన్నా, నాకు ప్రతీ నెలా మా కంపెనీ లో సొడెక్సో కూపన్లు ఇస్తారు, వాటిని ఉపయోగించి మన ఇంటికి సరిపడా కిరాణా సామాన్లు తెచ్చుకోవచ్చు. ఆ కూపన్లు మన సుబ్బయ్యశెట్టి గారి దుకాణంలో చెల్లవు. అందుకనే ఇక నుంచి సరుకులు పంపించొద్దాన్నాను." చెప్పాడు.

" అలా ఎలాగరా, శెట్టి గారు మనకి ముప్పయి సంవత్సరాల నుంచి సరుకులు ఇస్తున్నారు. ఇప్పుడు సడన్ గా మనం మానేస్తే ఆయనకి ఇబ్బంది కదా". అన్నాడు.

"నాన్నా రోజులు మారాయి, వాటితో పాటే మనం కూడా మారాలి. మొహమాటాల కోసం అనవసరంగా డబ్బులు వృధా చేయలేం కదా." అన్నాడు.

ఈ తంతంతా గమనిస్తున్న సుబ్బయ్యశెట్టి మాట్లాడుతూ "సరే లెండి, రంగనాథం గారు, మీ లాంటి ఖాతాలు వదులుకోవడం మాకు కూడా ఇష్టం వుండదు. కాని ఏం చేస్తాం చెప్పండి, కాలంతో ప్రయాణం చేయవలసిన వాళ్ళమే కదా అందరం." అని చెప్పి అక్కడ నుంచి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

మరికొంత దూరం అలా నడుచుకుంటూ వెళ్ళి జోసఫ్ గారింటికి వెళ్ళాడు. గుమ్మం లో నిలబడ్డ శెట్టి గారిని చూసి లోపలికి రమ్మని కూర్చోమన్నాడు జోసఫ్. అతనితో మాట్లాడుతూ

"ఏంటి శెట్టి గారు, ఇలా వచ్చారు...?" అని అడిగాడు.

"ఏం లేదండి, ఈ నెల సరుకులు లిస్టు ఇస్తే, మా కుర్రాడి చేత సామాన్లు పంపిస్తాను." అడిగాడు సుబ్బయ్య శెట్టి.

"ఏమీ అనుకోకండి శెట్టి గారు, మొన్ననే బిగ్ బజార్ లో ఏవో ఆఫర్లు ఇస్తున్నారని మా ఆవిడ వెళ్ళి చాలా సామాన్లు

తీసుకువచ్చేసింది. అయినా నాకు కొంచెం అగ్గిపెట్టెలు, బ్లేడ్లు కావాలి. నేను సాయంకాలం అటుగా వచ్చినప్పుడు వచ్చి తీసుకుంటాను." చెప్పాడు.

సుబ్బయ్యశెట్టి కి పచ్చి వెలక్కాయ తిన్నట్టుంది. ఏమీ మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో వున్నాడు.

"సరే... సార్... వస్తాను..." అంటూ దిగాలుగా నడుచుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

నెమ్మదిగా ఇంటికి చేరుకున్నాడు సుబ్బయ్యశెట్టి. ఇంట్లో కి వెళ్లి కాళ్ళు, చేతులు కడుక్కొని భోజనం చేసి అలా మంచం మీద నడుం వాల్చాడు. కాస్త మగతగా వుండడంతో నిద్ర లోకి జారుకున్నాడు. కొంతసేపటికి షాపు లో పని చేసే గోవిందు వచ్చాడు. షాప్ తాళాలు తీసుకు వెళదామని వచ్చానని చెప్పాడు. అతన్ని కూర్చోమన్నాడు శెట్టి.

బీరువా లోంచి కొత్త బట్టలు తీసాడు. దాంతో పాటు కొంత డబ్బుని కూడా జతచేసి గోవిందుకి ఇచ్చాడు. గోవిందుకి ఇదంతా ఆశ్చర్యంగా వుంది.

"ఏంటి శెట్టి గారు ఇదంతా..." అన్నాడు అనుమానం తో కూడిన ఆశ్చర్యంతో.

"ఏమీ లేదు, గోవిందు, ఇంతకాలం షాపులో నమ్మకం గా పనిచేసావు. నీలాంటి వాడికి ఏమి ఇచ్చినా తక్కువే." అన్నాడు.

"ఏదో శెట్టి గారు, అది మీ అభిమానం." అన్నాడు గోవిందు.

"అదే గోవిందు, ప్రస్తుతం వ్యాపారం ఇది వరకటి లా లేదు. నగరం లో అనేక చోట్ల అనేక షాపింగ్ మాల్స్ వచ్చేస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడే పెద్ద, పెద్ద సంస్థలు సూది నుంచి సూదంటు రాయి వరకు అమ్మేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మన లాంటి దుకాణాల్లో కొనేదెవ్వరు చెప్పు. అందుకనే ఇకనుంచి నువ్వు పనిలోకి రానక్కరలేదు." అన్నాడు బాధతో నిండిన స్వరంతో.

"అదేటి శెట్టి గారు అలా అంటారు. నేను ఏం తప్పు చేసాను. ఇరవై ఏళ్ళ నించి మీ దగ్గరే పని చేస్తున్నాను. మీ షాపుని నా సొంత

ఇంటిలా కాపాడుకుంటూ వచ్చాను. ఏ రోజైనా ఒక పూతిక పుల్ల అయినా పోయిందా. ఇప్పుడు మీరు ఇలా హటాత్తుగా బయటికి పొమ్మంటే ఎక్కడికి పోతాను బాబు. ఏం చెయ్యడానికి నాకు పెద్దగా సదువు కూడా లేదని మీకు తెలుసు కదా." అన్నాడు బాదగా.

"గోవిందు, నేను చెప్పింది నీ మంచికే. ఉంటుందో, ఊడుతుందో తెలియని నా దుకాణం లో పని చేయడం వల్ల ఏంటి లాభం? ఇప్పుడనేక బహుళ అంతస్తుల దుకాణాలు వచ్చాయి. నీకు ఎక్కడో దగ్గర పని దొరకకపోదు. నేను కూడా నాకు తెలిసిన వాళ్లకు చెబుతాను. అర్థం చేసుకో." అన్నాడు అభ్యర్థనగా.

ఇక చేసేది ఏమీ లేక, నిస్సహాయంగా వెళిపోయాడు గోవిందు.

భారంగా అడుగులు వేసుకుంటూ షాపు కు వెళ్లాడు సుబ్బయ్య శెట్టి. ఇంతలో ఎనిమిది సంవత్సరాల పాప వచ్చి" అంకుల్ డెయిరీ మిల్క్ వుందా" అని అడిగింది.

"లేదమ్మా, ఇది బాగుంటుంది. తీసుకో." అని మరో రకం చాక్లెట్ తీసి ఇచ్చాడు.

"వద్దు... అంకుల్. ఇలాంటి రేపర్ లేనివి తినకూడదని చెప్పింది మా అమ్మ." అంది.

సుబ్బయ్య నోటి వెంట మాట రాలేదు. ఈ లోగా అక్కడికి సుబ్బయ్య కి తెలిసిన డీలర్ ఒకాయన వచ్చాడు.

"ఏంటి సార్... దుకాణం అంతా ఖాళీ గా కనిపిస్తోంది." అన్నాడు.

"ఏం చెప్పమంటావు... రంజన్ జీ నీకు తెలియనిదా ఇదంతా. ఎఫ్.డి.ఐ దెబ్బకి మా దుకాణాలు మూతపడ్డం తప్ప ఇంక వేరే దిక్కు కనబడ్డం లేదు. ఈ రోజుల్లో అందరూ పెద్ద, పెద్ద సూపర్ మార్కెట్ లలో కొనుక్కోవడానికి అలవాటు పడ్డారు. అలాంటప్పుడు నా లాంటి చిన్న, చిన్న కిరాణా దుకాణాల్లో కొనేవాళ్ళు తగ్గిపోతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇదే వృత్తిని నమ్ముకొని బతుకుతున్న నాలాంటి వాళ్ళ నోట్లో మట్టి కొట్టినట్టయింది. అయినా చేయగలిగింది ఏమీ లేదు. ఏ రోజైనా చిన్న చేప పెద్ద చేప నోట్లో పడవలసిందే." అన్నాడు భారంగా.

"అందరి పరిస్థితి అలాగే వుంది శెట్టి గారు. పెద్ద చేపల దెబ్బకి చిన్న చేపలు విలవిల్లాడడం తప్పించి మరో మార్గం కనిపించడం లేదు. ఇంతకు ముందు మాకు ఎంతో భారీగా ఆర్డర్లిచ్చిన వాల్లు కూడా ఇప్పుడు కనీసం మినిమం ఆర్డర్లు కూడా ఇవ్వడం మానేసారు. అందుకనే నేను కూడా ఈ డీలర్ షిప్ మానేద్దామనుకుంటున్నాను." అన్నాడు.

ఈ లోగా అక్కడికి జానకమ్మ గారు వచ్చారు.

ఆవిడ ని చూసి నవ్వుతూ "ఏంటమ్మా , ఈ మధ్య బొత్తిగా కొట్టు కి రావడం మానేసారు. వూరికి గాని వెళ్ళారా ఏమిటి?" అని అడిగాడు సుబ్బయ్య.

"లేదండి. ఈ మధ్య మా అమ్మాయికి పెళ్ళయింది కదా! మా అల్లుడు డిఫెన్స్ లో పని చేస్తాడు. వాళ్ళకి కేంటీన్ లో అన్ని సామాన్ల మీద మంచి రాయితీ లభిస్తుంది. అందుకని అక్కడ నించే తెచ్చుకొంటున్నాం." అంది.

మరో సారి నెత్తిమీద పిడుగు పడినట్టయింది సుబ్బయ్య శెట్టికి. ఉన్న నెలవారీ ఖాతాలన్నీ ఏదో కారణంతో ఇలా తప్పిపోతే ఇక దీని మీద బతకడం కష్టం అనిపించింది.

జానకమ్మ ఏదో ముక్తసరిగా రెండు చిన్న వస్తువులు తీసుకొని అక్కడ నించి వెళ్ళిపోయింది.

ఇంతలో డీలర్ కల్పించుకొని "మీరు ఏమి అనుకోకపోతే ఒకమాట చెబుదామనుకుంటున్నాను. నేను ఎలాగూ ఈ డీలర్ షిప్ మానేసి, ఓ సాఫ్ట్వేర్ కంపెనీలో కేంటీన్ కాంట్రాక్ట్ తీసుకుందామనుకుంటున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే మీరు అక్కడ లెక్కలు చూడ్డానికి రండి. మిమ్మల్ని గౌరవంగా చూస్తాను." అన్నాడు.

"నువ్వు చెప్పినదాంట్లో తప్పులేదు రంజిత్ భాయ్. ఇప్పుడు పరిస్థితులు అలా వున్నాయి. ఒకప్పుడు దుకాణం యజమానులు గా వున్నవాళ్ళు, ఇప్పుడు వేరే దుకాణాల్లో కూలీలు గా బతుకుతున్నారు. నా చేత్తో ఎంతోమందికి పని ఇచ్చిన నేను, నాకే ఏ పనీ లేని స్థితికి చేరాను. ఇది పురోభివృధ్ధో, తిరోభివృధ్ధో అర్థం కావడం లేదు. పాత ఒక రోత, కొత్త ఒక వింత. ఇది ఈనాటి విషయం కాదు కదా. సర్లే పనిలో పనిగా దుకాణం కూడా అమ్మకం పెడతాను. ఎవరైనా దొరుకుతారేమే చూడు..." అన్నాడు కళ్ళ నించి

కారుతున్న నీటిని తుడుచుకుంటూ... ఈ పయనం ఎందాకో అర్థకావడం లేదు... అంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు.




మనస్విని మౌనంగా నిట్టూర్చింది. ఒంటరితనం ఎంత భయంకరమో ఇప్పుడు అర్ధమౌతోంది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే తాను ఏం సాధించింది? ఎవరికోసం సాధించాలని ఆశపడింది? తలచుకుంటే వేదనే తప్ప ఏం మిగిలింది? తనకంటూ ఎవర్నీ మిగుల్చుకోలేకపోయింది. అసలు? జీవితమంతా తన చుట్టూ గిరిగీసుకొనే బ్రతికింది. రకరకాల అనుమానాలతో అందర్నీ శత్రువులుగానే పరిగణిస్తూ మూడొంతుల జీవితాన్ని చేతులారా నరకం చేసుకుంది. ఒక్కసారిగా ఆమె మనసు గతంలోకి జారింది.

****     ****     ****     ****

చిన్నప్పటినుంచి తల్లితండ్రులు, అన్నగారు మనస్వినిని “నీకంటే అందగత్తె మరొకరులేరు, ఉండబోరు” అని విపరీతంగా

ఆకాశానికి ఎత్తేయటం ఆమెలో అహం పెరగడానికి కారణమైంది. సహజంగానే తను చాలా అందగత్తె మంచి రంగు, రూపం. తల్లికి కూతురి అందం పట్ల ఎనలేని గర్వం. తాను సాధారణంగా ఉండటంతో కూతురు అందంగా ఉండేసరికి ఆమెకు చెప్పలేనంత గొప్పగా ఉండేది. అలాగే తండ్రి, అన్న ఆమె స్నేహితురాళ్లతో పోలిస్తూ వారిని కించపరచటం, మనస్వినిని ఆకాశానికి ఎత్తేయటం చేసేసరికి తానొక 'విశ్వసుందరి' అన్న భావం ఆమె మనసులో బలంగా నాటుకుపోయింది. చదువులో ఏకాగ్రత అంతంత మాత్రమే! ఏకాగ్రత అంతా అందం మీద, షోకుల మీద ఉంటే చదువు మీద మనసేలా పెడుతుంది? క్లాస్ లో కూడా ఎవరితో స్నేహంగా ఉండేది కాదు. తన అందానికి సరిజోడి కాని, వాళ్ళతో మాట్లాడటం వేస్ట్ అని తన భావన. పెద్దయ్యేకొద్దీ ఈ భావం మరింత బలపడిందే తప్ప తరగలేదు. దాంతోఅందం కూడా మరింతగా పెరిగింది మనస్వినికి. "ఎవరైనా మీఅన్నకి చదువులో ఎప్పుడూ ఫస్ట్ వస్తుంది నువ్వేమిటమ్మా ఇలా? అంటే "నాలా తనేం అందంగా ఉన్నాడేంటి?" అనేది పెంకిగా. తన మన లేకుండా ఎవర్నైనా సరే అందంగా లేకపోతే చాలా తిరస్కారంగా, హేళనగా మాట్లాడేది.

పెళ్లి కూడా తన కంటే కాస్త తక్కువ స్థాయి అందగాణ్ణే ఏరికోరి చేసుకుంది. వినయ్ సంస్కార వంతుడు, నెమ్మదస్తుడు, బాగా చదువుకున్నవాడు. మనస్విని అందాన్ని ఆరాధించి వెంటపడి ప్రేమించి మరీ పెళ్లిచేసుకున్న ధైర్యవంతుడు. అతని తల్లితండ్రులు అందంగా లేకపోవటం వాళ్ళదురదృష్టం. కోడలి అందాన్ని ప్రతి రోజు పొగుడుతూ ఉండాలని వారికి తెలియక పోవడం మరీ దురదృష్టం. అంతే అదే వేరు కాపురానికి దారితీసింది. పుట్టింట్లో వదిన, అత్తింట్లో తోడికోడళ్ళు, ఆడబడుచులు, అత్తగారు ఎవరూ తన కాలిగోటికి పోలరని చాలా మిడిసిపడ్తూ ఉండేది. వేరింట కాపురంలో కూడా కనీసం ఇరుగుపొరుగు వారితో కాని, ఇంటిలో పని మనుషులతో గాని సయోధ్యగా ఉండేది కాదు. దీనికి తోడు పెళ్లై 5 సంవత్సరాలు అయినా కడుపు పండక పోవటం. అయిన వాళ్ళెవరూ తొంగి చూడకపోవటమే కాదు హాయిగా పిల్లాపాపలతో కాపురం చేస్కోవడం మరింత కడుపు మంటని రగిల్చాయి. అభద్రత, సుపీరియార్టీ భావాలతో ఎవరితోనూ కలవలేక, మనసువిప్పి మాట్లాడలేక, అందరూ తనని చూసి ఈర్ష్య పడుతున్నారని, దిష్టి పెడుతున్నారని ఒకటే మధన పడిపోతూ భర్తకి తీవ్రమైన అసహనాన్ని, ఒత్తిడిని కల్గచేసేది. అత్తగారింటికి భర్తని కూడా వెళ్లనిచ్చేది కాదు వాళ్ళు వచ్చినా హద్దు ఆపు లేకుండా మాట్లాడుతూ ఊదరగొట్టి వెళ్లగొట్టేసేది.

అందం పిచ్చితో అస్తమానం అందాల పోటీలని, ఫాషన్ షో లని తిరుగుతూ ఉండేది. వివిధ సంస్థల నుంచి ఎన్నోసార్లు అందాలరాణి బిరుదులు, అవార్డులు, ఆమెని వరించాయి, పొగడ్తలు, సన్మానాలు ఈవిడకి ప్రాధాన్యాలుగా మారాయి. కాలం గడుస్తున్నకొద్దీ 'పిల్లలు'లేరన్న బాధ తనని కలచి వేయసాగింది. తనకి లేరన్న బాధ కంటే బంధువులందరికీ ఉన్నారన్న బాధ ఎక్కువగా ఉండేది. ఆ విషయంలో వెనకపడి పోయానన్న దుఃఖం లావాలా పొంగేది మనస్వినిలో. ఒక శుభ ముహూర్తాన ట్రీట్మెంట్స్ ఫలించి లక్షణమైన కొడుకుని విలక్షణంగా ప్రసవించింది మనస్విని. తన ప్రతిరూపంగా అందంగా పుట్టిన అభిరాంని చూసుకొని తెగ మురిసిపోయింది. వినయ్ ఆడపని, మగపని అంతా తల్లిలా తానే స్వయంగా చూసుకున్నాడు. మనస్విని ఇంక సగటు ఆడదానిలా, తల్లిలా రూపాంతరం చెందుతుందని అందరూ ఆశపడ్డారు.

ఏదైనా పొందలేనపుడు దాని మీద ఉన్న ఆశ, ఆసక్తి అది పొందాక ఉండదు. మనస్విని విషయం లో అలానే జరిగింది. పిల్లవాడ్ని కనడం అయితే కనింది కాని, వాడు ఏడ్చినా, అల్లరి చేసినా చాలా విసుగుపడేది. కాస్త లేట్ వయసులో పుట్టాడని ఒక పక్క,

మిగిలిన వారిపిల్లలు అప్పుడే పెద్దవాళ్లై పోయారని మరో పక్క ఉక్రోషంగా ఉండేది. అన్నింట్లో అందరికంటే తాను వేరుగా, ప్రత్యేకంగా ఉండాలని మొదట్నుంచి తపన ఎక్కువగా ఉండేది మనస్వినికి. అన్న వదిన పెద్ద చదువులు చదివి మంచి వుద్యోగాల్లో స్థిరపడ్డం, వాళ్ళ పిల్లలు బాగా చదువుకొని అందిరావటం ఇంకా మధనానికి కారణమయ్యాయి.

ఫలితంగా పసివాడు రెండేళ్లకే కేర్ సెంటర్ పాలయ్యాడు. అందంలోనే కాదు చదువులోకూడ తాను ఎవరికీ తీసిపోనని నిరూపించుకోవాలని ఎమ్.ఏ డిగ్రీ కూడా కష్ట నష్టాల కోర్చి సాధించింది. ఒకసారి అందాల పోటీలో విజేతగా నిలిచినపుడు ప్రెస్ వాళ్ళ ఇంటర్వ్యూ లో "ఒక స్త్రీగా, మాతృమూర్తిగా మీ ఆశయాలేమిటి"? అని అడిగిన ప్రశ్నకి సమాధాన మిచ్చింది ఇలా... "ఒక స్త్రీ గా అందంలో, కీర్తి ప్రతిష్ఠల్లో, చదువులో, ఎవరికీ తీసిపోనని నిరూపించుకున్నా. ఇది మీ అందరికీ తెలిసిన విషయమే. ఇక మాతృ మూర్తిగా అంటారా? అందరి తల్లుల్లా నేను మామూలు సగటు తల్లిని కాదు. "ఏ తల్లి తన పిల్లలకి ఇవ్వలేని బహుమతి నా కొడుక్కి ఇస్తున్నా"... అంటూ ఒక క్షణం ఆగింది. "ఏంటి? కోట్ల రూపాయల ఆస్తి ఇవ్వబోతున్నారా? లేక మీకంటే బాగా చదివించాలని ఆశ పడుతున్నారా? లేక అన్నిట్లో మీకు ధీటుగా బాబు ని తయారు చేస్తారా? అన్న ప్రశ్నలకు నవ్వుతూ కాదు కాదంటూ తల తిప్పేసింది. "పోనీ మీరే చెప్పండి" అన్నారంతా. గొంతు సవరించుకుంటూ ఠీవిగా అందరి వైపూ చూస్తూ గర్వంగా చెప్పింది మనస్విని. "మా అబ్బాయి పెద్దవాడయ్యాక తన తల్లి ఎంత గొప్పదో, ఎంత ఘనచరిత్ర కల్గినదో తెలుసుకునేలా నేను సాధించిన పలు టైటిల్స్ అవార్డులు సన్మాన పత్రాలు ,మొదలైన వాటితో... నా ప్రొఫైల్ తయారు చేస్తున్నా. అందరి తల్లుల్లా సామాన్యమైన తల్లి కాదు,"... మా అమ్మ చాలా అసాధారణమైనది అని వాడు గర్వపడేలా ఇప్పట్నుంచి అన్నీ సమకూర్చుకుంటున్నాను. ఇదే వాడికి నేనిచ్చే అద్భుతమైన బహుమతి."

అప్పుడే భర్త ఆఫీసు నుంచి వస్తూ దార్లో కేర్ సెంటర్ నుంచి జ్వరంతో వేలాడిపోతున్న కొడుకుని భుజాన వేసుకుని నీరసంగా ఇంటికి వచ్చాడు. ప్రెస్ వాళ్ళు బుగ్గలు నొక్కుకున్నంత పని చేశారు. ఎవరైనా పిల్లలకి ఏమిద్దామా, ఎంత బాగా చదివించుకుందామా అని ఆలోచిస్తారు. కాని లేక లేక లేటు వయసులో పుట్టిన కొడుకు 20 సంవత్సరాల తర్వాత తన తల్లి గొప్పతనాన్ని గుర్తించాలని ఆరాటపడుతున్న ఈ తల్లిని చూసి వాళ్ళు నివ్వెరపోక ఏం చేస్తారు?

****　　****　　****　　****

కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే మనస్విని కొడుకు అభిరామ్ చిన్ననాటి స్నేహితురాలు, సహాధ్యాయి అయిన మైథిలిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. తను మంచి సంస్కారవంతురాలు, సహనశీలి. దానికి తోడు వినయ్, అభిరామ్ లు అత్తగారి మనస్తత్వం చెప్పి ఉండడంతో మనస్వినిని అర్థం చేసుకోవడం కష్టమనిపించలేదు మైథిలికి. పెళ్ళైన కొన్ని రోజులకే అభిరామ్ కి కెనడా లో పెద్ద ఉద్యోగం రావటంతో భార్యా సమేతంగా వెళ్లిపోయాడు.

మూడేళ్ళకే వినయ్ హార్ట్ ఎటాక్ తో మరణించాడన్న విషయం తెలిసి హుటాహుటిన అభిరామ్ భార్యతో ఇండియా వచ్చాడు. అభిరామ్ ని వినయ్ తల్లిగా, తండ్రిగా, సంరక్షకుడిగా కళ్ళల్లో పెట్టుకొని పెంచాడు. వృద్ధాప్యం, ఒంటరితనం, అణగారిన అహం... మనస్వినికి ఇప్పుడు వదల్లేని కవచాలు. భర్త ఎడబాటు బాధిస్తున్నా పైకి గంభీరంగా కనిపించే ప్రయత్నం చేస్తోంది. మళ్ళీ వారం రోజుల్లో కొడుకు కెనడా ప్రయాణం. ఒక రోజు సాయంత్రం అభిరామ్ ఎవర్నో ఇంటికి తీసుకువచ్చి కొలతలు ,లెక్కలు వేయించడంచూసి ఆసక్తిగా అడిగింది. "అమ్మా, కెనడా వెళ్ళే లోపే ఇంటి విషయం సెటిల్ చేసేద్దామనుకుంటున్నా!! సాయంత్రం బయటకి వెళ్ళాలి రెడీగా వుండు" అన్నాడు ముక్తసరిగా. తన కెనడా ప్రయాణానికి, ఇంటిని సెటిల్ చేయాల్సిన పనేంటో? మనసులో గొణుక్కుంది మనస్విని.

సాయంత్రం కొడుకు తీసుకువెళ్ళిన ఆ ప్రదేశం చూసి కంగారు పడింది. అది చిన్నపిల్లల దగ్గరనుంచి, వృద్ధుల వరకు, బీద, గొప్ప, ఆడ, మగ తారతమ్యం లేకుండా అనాధలను అక్కున చేర్చుకునే సేవానిలయం. సెక్రటరీ తో ఏదో మాట్లాడిన అభిరామ్ వెనక్కి కారు దగ్గిరకి వచ్చి "అమ్మా ఒకసారి రా" అంటూ మనస్విని జవాబుకు ఎదురు చూడకుండా వేగంగా ముందుకు నడిచాడు. సెక్రెటరీ హోంలో అన్ని రూములు చూపిస్తూ వాటిలో ఉంటున్న వారిని పరిచయం చేస్తూ ఏవో చెప్పుకుపోతున్నాడు. తల్లి తండ్రులు ఎవరో తెలియని పిల్లలు, చీకటి తప్పులకు జన్మించి అనాధలైన పిల్లలు, వికలాంగులు, జబ్బువాతపడి నిరాదరణకు లోనైన పిల్లలు, సంతానముండి కూడా వారి ప్రేమాప్యాయతలకు నోచుకోని తల్లిదండ్రులు... సంపాదనలేని, పోషణ కరువైన తల్లితండ్రులు, నా అన్న వాళ్ళులేని వృద్ధులు, మమతానురాగాలకి తపించే పెద్దవాళ్ళు, రోగిష్టి వాళ్ళు ఇలా ఎంత మందికో ఆశ్రయమిస్తున్న ఆ సేవానిలయాన్ని చూస్తే ఎవరికైనా కళ్ళు చెమర్చక మానవు. కాసేపట్లోనే మనస్వినికి అర్ధమైంది కొడుకు ఎందుకు తీసుకువచ్చి ఉంటాడో ఇక్కడికి.

'మీలాంటి గొప్పవాళ్లు ఇచ్చే డొనేషన్స్ తో ఇలా హోమ్ ని నడుపుతున్నాము సార్! ఇక్కడ ప్రత్యేక వసతి సౌలభ్యం కూడా ఉంటుంది ఎవరైనా నెలనెలా డబ్బులు పంపిస్తే వారి బంధువులకి ప్రత్యేకమైన సేవలు ఇవ్వబడతాయి. అలాంటి వాళ్ళూ ఉంటారు. అటు చూడండి. విదేశాల్లో ఉన్న పిల్లలు తమ తల్లితండ్రులని ఇక్కడ వదిలి వెళతారు. ప్రతి నెలా పెద్ద మొత్తంలో డబ్బులు పంపుతారు. పిల్లల దగ్గర లేమన్న బాధ తెలియకుండా మేం జాగ్రత్తగా చూస్కుంటాము" అని హోమ్ సెక్రెటరీ అభిరామ్ కి చెబుతున్నాడు. "అమ్మా ఒకసారి ఇలారా!" అని కొడుకు పిలుస్తున్నా మనస్వినికి ఏమీ వినిపించడం లేదు. గబగబా కార్ దగ్గరకి వచ్చేసింది. వెనక్కి తిరిగి చూస్తోంటే అభిరామ్ సెక్రెటరీ చేతిలో పెద్ద నోట్ల కట్ట ఉంచుతూ ఏదో చెప్పడం కనిపించి నిలువెల్లా వణికి పోయింది. అంటే తనని ఇక్కడ పడేసి వాడు తన దారిన తాను కెనడా వెళ్లిపోతాడా!? ఆమె చెవుల్లో హోరు మొదలైంది.

ఇంటికి ఎలా వచ్చిందో తెలియదు ఎవరితో మాట్లాడాలన్పించడం లేదు. ఎవరికోసం తాను ప్రాకులాడిందో వాడికే తను అక్కరలేదు ఇప్పుడు. తన తల్లి గొప్పతనాన్ని నల్గురికి చెప్పుకొని, వాడు ఎంతో గర్వపడతాడని తనని ఎంతో మెచ్చుకుంటాడని ఎన్ని కలలుకందో? ఇంటిని కూడా అమ్మకం పెట్టేశాడు ఒకపక్క. వినయ్ ఉంటే ఇలా జరిగేదా అసలు? భర్త తనని ఎంత అపురూపంగా చూసుకున్నాడు? ఆ హోమ్ లో ఒంటరిగా బతుకు వెళ్ళదీయాల్సిందేనా? అన్నగారు, ఆడబడుచులు, బావగార్లు తమ పిల్లల దగ్గర హాయిగా కాలం వెళ్ళబుచ్చుతుంటే తాను మాత్రం...?

“నేను వెళ్లనురా హోంకి” అంటే వాడేమంటాడు?? “నీతో కెనడా వస్తానురా అభి” అంటే రానిస్తాడా? చిన్నప్పుడు వాడి ఆలన పాలన తాను ఏం సరిగ్గా చూసిందని? ఎప్పుడూ తన అందాల పోటీలు, సన్మానాలు, చదువుల పందాలు, అందరికంటే పైన ఉండాలనే తాపత్రయాలు… వీటితో కన్నబిడ్డని ఎంత నిర్లక్ష్యం చేసింది తలుచుకుంటే ఆమె గుండెల్లోంచి దుఃఖం లావాలా తన్నుకు వచ్చింది. చిన్నతనంలో వాడ్ని కేర్ సెంటర్ పాలు చేసా, తల్లిగా నేను వాడికేమీ న్యాయం చేయలేదు. పెద్దయ్యాక హాస్టల్ వాణ్ణి అక్కున చేర్చుకుంది. నేను తల్లిగా ఓడిపోయాను. నాకిదే సరైన శిక్ష. ఇలాగే అవ్వాలి… నన్ను క్షమించరా బాబూ! అహంకారంతో నీ బాల్యాన్ని నిన్ను ఎంజాయ్ చెయ్యనివ్వలేదు. నిన్ను నాలాగే బంధనాల్లో బంధించేసాను. నా పాపానికి నిష్కృతి లేదు”. కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారిపోతుంటే మూగగా రోదించసాగింది.

“అమ్మా, అమ్మా, ఎక్కడున్నావ్? ఇదిగో ఇటు చూడు నీకేం తెచ్చానో!” అభిరామ్ మాటలతో వులిక్కిపడి గతంలోంచి వర్తమానంలోకి వచ్చింది మనస్విని. కన్నీరు కొడుకు కంట పడకుండా లేని నవ్వు తెచ్చుకుంటూ లేచి నుంచుంది. అభిరామ్ చేతిలో చక్కని ఫోటో ఫ్రేమ్. వినయ్, తాను, అభిరామ్ ముగ్గురు కలిసి తమ స్వీట్ హోమ్ బ్యాక్ డ్రాప్ తో తీయించుకున్న ఫోటో. ‘ఓహో! హోమ్ కి వెళ్లిపోతున్నానుగా, వీడ్కోలు కానుక అన్నమాట’ అనుకుంది మనసులో! “అమ్మా రేపే బయలుదేరాలి మంచి రోజు కూడా! నీ సామాన్లు అవి సర్దడం మొదలు పెట్టాలి”. అభిరామ్ మాట పూర్తి అయిందో లేదో మనస్విని బావురుమంది. అభిరామ్ నిశ్చేష్టుడై చూడ సాగాడు.'' ఏంటమ్మా ఏమైంది??

“నాకు తెల్సు నేను తల్లి గా నీ పట్ల ఏమీ బాధ్యత గా ప్రవర్తించలేదు. కాని నాకళ్ళు తెరుచుకునేసరికి జరగాల్సిందంతా జరిగిపోయింది. ఇప్పుడు నేను ఏ ముఖం పెట్టుకొని నీతో వస్తానని అడగగలను?? నేను నీ కోసం ఏం చేశానసలు?' అయినా సరే నాకు హోమ్ లో చేరాలని లేదురా, నీతో వచ్చేస్తాను'' 'వెక్కుతూ అంది మనస్విని?”

“హోమ్ ఏంటమ్మా? నువ్వు మాతో కెనడా వస్తోంటే?” ఆశ్చర్యంగా అడిగాడు అభిరామ్. సంభ్రమంగా చూసింది మనస్విని “నిజమా! నా మీద నీకు కోపం లేదా? నిజంగా నన్ను నీతో తీసుకువెళతావా కెనడా? మరి ఇంటి విషయం సెటిల్ చేయాలన్నావు… దేనికి? ఆ హోం కి ఎందుకెళ్ళాం? వాళ్ళకి డబ్బుకూడా ఇచ్చావు! నేను చూశాలే!”

చిన్న పిల్లలా అడుగుతున్న తల్లిని మురిపెంగా చూస్తూ “ఓ అదా? మన ఇంటిని నాన్నగారి కోర్కె మేరకు ''మనస్విని మహల్'' పేరుతో వృద్ధుల సంరక్షణాలయంగా తీర్చి దిద్దాలని…! ఆ విషయంలో హోమ్ వాళ్ళని ఒకసారి సంప్రదిద్దామని అక్కడికి వెళ్ళాను. అంతే కాదు అక్కడి పిల్లల చదువు నిమిత్తం మూడు లక్షల రూపాయలు డొనేట్ చేశాను అదే నువ్వు చూసింది”. నిరుత్తురాలై చూస్తూ ఉండిపోయింది మనస్విని. ఆమె కంటి వెంట దుఃఖాశ్రువులు!…

“నిజంగా నన్ను హోమ్ లో పెట్టవు కదా?” అమాయకంగా అడుగుతున్న తల్లిని నవ్వుతూ ప్రేమగా దగ్గరకి తీసుకుంటూ “నీకలాంటి ఆలోచన ఎందుకొచ్చిందమ్మా?, నేను నిన్ను హోమ్ లో పెడతానని ఎలా అనుకున్నావ్? నువ్వు నా బంగారు తల్లివి. మా అమ్మ లాంటి అమ్మ ఎవరికీ ఉండదు. అవును నిజం... నువ్వు ఎప్పుడూ నాకు అద్భుతంగా అనిపిస్తావు. నువ్వేం చేసినా నాకోసమే కదమ్మా చేసింది. ఎప్పుడూ నిన్ను దూరం చేసుకోను. ఇప్పుడు నువ్వు నా కూతురివి కూడా!, నువ్వెప్పుడూ మాతోనే ఉంటావు తెలిసిందా”? అన్నాడు తల్లి నుదుటిని ముద్దాడుతూ. మైథిలి నవ్వుతూ చూస్తోంది ఇద్దరినీ.

పిల్లల్ని ప్రేమించడం అంటే బ్యాంక్ లో డబ్బు దాచుకున్నట్లే. పిల్లల పట్ల చూపించిన ప్రేమ అవసరమైన అవసాన దశలో వడ్డీతో సహా తిరిగి మన దగ్గరకి వస్తుంది. తల్లి గా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించక పోయినా, తండ్రి లక్షణాలని, ప్రేమించే మనసుని పుణికిపుచ్చుకున్న అభిరామ్ కొడుకుగా తన కర్తవ్యాన్ని మనస్ఫూర్తిగా స్వీకరిస్తున్నాడు. ‘చెడ్డకొడుకు ఉండచ్చుగాని చెడ్డతల్లి ఉండదు’ అన్నాడు రామాయణంలో శ్రీరాముడు. ఇప్పుడు చూస్తే “చెడ్డ తల్లి ఉంటుంది కాని ‘కుపుత్రా న భవతి” అంటాడేమో! తన ప్రియపుత్రుడి అందమైన బాల్యాన్ని తాను రసవత్తరంగా, స్మరణీయంగా తీర్చి దిద్దలేకపోయినా తనకి మాత్రం వృద్ధాప్యం శాపం కాకుండా కమ్మని వరంగా మార్చి ఆసరాగా నిలబడుతున్న కొడుకు, కోడల్ని ఆప్యాయంగా దగ్గరకి తీసుకుంది మనసు మారిన మనస్విని.




ఆఫీసుకి బయల్దేరుతున్న నేను ఎదురింటి గేటు తీసుకుని లోపలికి వెళ్ళబోతున్నావిడ్ని చూసి ఆశ్చర్యానందాలకి లోనయ్యాను.

తను నిజంగా వైష్ణవేనా లేక పక్కనించి చూడ్డం వల్ల నాకలా అనిపించిందా? లేదు లేదు నా కళ్ళు నన్ను మోసం చేయవు. అయినా వెళ్ళి చూసొస్తే సరి. ఎదురుగా వున్న ఆ ఇండిపెండెంట్ ఇల్లు ఖాళీగా వుందని తెలుసు కాని తనెప్పుడు దిగిందో?'

నేను పెద్ద పెద్ద ఆడుగులేస్తూ "వైష్ణవి!" అని పిలిచి సరిదిద్దుకుని "వైష్ణవి గారూ.." అని పిలిచాను గేటు తీస్తూ..

వైష్ణవి బయటకి వచ్చింది. నా ఆనందానికి అవధిలేదు. పోగొట్టుకున్న పెన్నిధి ఏదో దొరికిందన్న సంతోషం నన్ను నిలవనీయడం లేదు.తనకీ అలాగే వుందని తననిచూస్తే తెలుస్తోంది.

"రా రఘు.. రా.. ఎన్నాళ్లయింది నిన్ను చూసి" పక్కకి జరిగింది. నేను లోపలికెళ్ళి కూర్చున్నాను. తను ఫ్యాన్ ఆన్చేసి నా కోసం కాఫీ పెట్టడానికనుకుంటూ వంటింట్లోకెళ్ళింది.

నన్ను గతం అంచెలంచెలుగా తనలోకి తీసుకెళ్ళింది.

****　　　****　　　****　　　****

అప్పుడు మేము విజయవాడలో వుండే వాళ్ళం. మా పక్కింట్లోకి కొత్తగా వచ్చారు రాజశేఖరంగారు. ఆయనకి ఒక్కగానొక్క కూతురు వైష్ణవి. చూడముచ్చటగా వుండేది. మా కుటుంబం వాళ్ళ కుటుంబం కలిసి మెలిసి వుండేది. మా నాన్న ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవారు. రాజశేఖరంగారేమో ఏవో బిజినెస్‌లు చేస్తుండేవారు.

ఒకే స్కూలు ఒకే తరగతి కావడంతో నేను వైష్ణవి కలసి మెలసి తిరిగేవాళ్ళం. నేనంటే ఎందుకో చాలా అభిమానంగా వుండేది. వాళ్ళమ్మ చేసే తినుబండారాలన్ని నా కోసం తెచ్చి ఆప్యాయంగా నాకు తినబెట్టేది.

ఒకనాడు రాజశేఖరంగారు మా నాన్నతో "ఇలా ఎంతకాలం ఉద్యోగాలు చేస్తారు? నాతో చేయికలపండి. బిజినెస్ లో డక్కమొక్కిలు తిన్నవాణ్ణి. మిమ్మల్ని పైకి తీసుకొచ్చే పూచీ నాది" అన్నాడు. మా నాన్న నమ్మి ఉద్యోగానికి రిజైన్ చేసి ఆ వచ్చిన డబ్బు బిజినెస్ లో పెట్టాడు.

ఇంతకుముందు కన్నా మా ఇంటికి కొన్ని హంగులు సమకూరాయి. రాజశేఖరంగారి దయవల్లనే తమజీవితాల్లో మార్పు చోటు చేసుకుందని అమ్మా.. నాన్న మాట్లాడుకోవడం నేనెన్నోసార్లు విన్నాను.

కొంతకాలం బాగానే జరిగింది. ఉన్నట్టుండి వైష్ణవి బయటకి కనిపించడం మానేసింది. వాళ్ళింట్లో బంధువుల హడావుడి. స్కూలుకి కూడా రావడం లేదు. నాకేం పాలు పోవడంలేదు. తను లేకపోతే పిచ్చెక్కినట్టు వుంది. అమ్మని విషయం అడిగాను. "వైష్ణవి పెద్దమనిషయిందిరా.." అంది.

"అంటే నీ అంత పెద్దదిగా అయిందా? అందుకే సిగ్గుపడుతూ బయటకి రావట్లేదా?" అన్నాను.

"ఏడిశావుగాని వెళ్ళి చదువుకో..ఇహనుంచి నీతో అంత క్లోజ్‌గా వుండదు తను" అంది.

హడావుడి సద్దుమణిగింది. వైష్ణవి బయటకి వచ్చింది. ఎందుకో కొత్తగా..కొత్తందాలతో కనిపించింది. వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. నేను కనిపిస్తే తుర్రు మని లోపలికి పరుగెడుతోంది. నన్ను చూసి తనలా ఎందుకు దాక్కుంటోందో అర్థం కావడంలేదు. స్కూలు కొచ్చినా స్నేహితురాళ్ళతోనే వుంటోంది. నేను ఒకనాడు తనని ఒంటరిగా దొరకబుచ్చుకుని కోపంగా "నీకేమయింది..నన్ను తప్పించుకు తిరుగుతున్నావు? నా స్నేహం మానేశావా?" అన్నాను.

వైష్ణవి బెదిరిపోయి చుట్టూ చూస్తూ "నేను ఇదివరకటిలా మగాళ్ళతో మాట్లాడకూడదుట. ఆటలాడకూడదుట. మరీ ముఖ్యంగా నీతో. సిగ్గు పడుతూ వుండాలట. అలా వుండకపోతే పాపం తగులుతుందిట.." అంది కళ్ళనీళ్ళతో.

నా పరిస్థితి అలాగే వుంది. "నువ్వు నాక్కావాలి వైష్ణవి, నువ్వు లేకుండా నేను బ్రతకలేను" అన్నాను.

తను కూడా "నాకూ అంతేరా..కాని ఏంచేస్తాం?" అంది బేలగా!

ఇదిలా వుండగా బిజినెస్ లో లాస్ వచ్చింది. అది మానాన్న వల్లనే అని రాజశేఖరంగారు రాక్షస అవతారంతో రంకెలెయ్యడం చూశాను. మా నాన్నగారు మానసికంగా కృంగిపోయారు. అప్పటి పరిస్థితుల ఛాయలు నా మీద పడకుండా నన్ను దూరంగా పట్నంలో హాస్టల్లో వుంచి చదివించసాగారు. నాకు వైష్ణవి గుర్తు కొచ్చినప్పుడల్లా చాలా బాధ అనిపించేది. కాని ఆ వెంటనే రాజశేఖరంగారు గుర్తొచ్చి కోపం నషాలానికి అంటేది. నన్ను ఇంటికి మాత్రం రానిచ్చేవారు కాదు.

చాలాకాలానికి నేను ఇంటికి వెళ్ళాను. ఎంతో ఆశతో పక్కింటి వైపు చూశాను. వేరెవరో వున్నారు. నేను అమ్మను వైష్ణవి గురించి అడిగాను. అమ్మ కళ్ళనీళ్ళతో 'వాళ్ళు కనిపించినంత మంచివాళ్ళు కాదని, నాన్నని నిలువునా ముంచేశారని, ఆ మానసిక వ్యాధితో నాన్న చాలా కృంగిపోయి కోలుకోవడానికి చాలా కాలంపట్టిందని, వాళ్ళు అలా చాలా మందిని ముంచేసి రాత్రికి రాత్రి ఎక్కడికో వెళ్ళిపోయారని' చెప్పింది కళ్ళనీళ్ళతో.

****　　****　　****　　****

ఆ తర్వాత ఇంతకాలానికిలా..

"ఇదిగో కాఫీ" అంది.

నేను అందుకున్నాను. "నన్ను చూస్తే కోపంగా వుందా?" అంది హఠాత్తుగా.

నేనేం మాట్లాడలేదు.

"వుంటుంది..ఎందుకుండదు?..మా నాన్న చేసిన మోసానికి మరొకరైతే నన్ను చంపేసేవారు.." అంది ఏడుస్తూ.

"చూడు వైష్ణవి..నాకు నువ్వంటే అప్పుడు ఇప్పుడు అభిమానమే! అందుకే పలకరించాను. నీకు పెళ్ళయిందా?"అన్నాను.

"చెబుతాను.. నీకు చెప్పి కాస్త మనసుని ప్రశాంత పరచుకుంటాను. నాకంటూ ఎవరూ లేరు..ఇన్నాళ్ళకి నువ్వొచ్చి నేనూ మనిషినే అన్న విషయం గుర్తుచేశావు." అని గతం విప్పి చెప్పసాగింది.

****　　****　　****　　****

మా నాన్న ముంచేసిన వాళ్ళందరూ మా ఇంటిమీద పడి రోజూ గొడవ పడుతూండడంతో, ఒక రాత్రివేళ అక్కడినుండి పారిపోయి మరో వూరెళ్ళాం. అప్పటికే మా నాన్న మీద నాకూ మా అమ్మకి చెప్పలేనంత అసహ్యం కలిగింది. మా అమ్మ నాన్నతో మాట్లాడడం మానేసింది. మా నాన్న విపరీతంగా తాగి ఒళ్ళు తెలియకుండా ఎక్కడో పడిపోయేవాడు. ఒకరోజు అలా పడిపోయివున్న ఆయనమీదనుంచి లారీ వెళ్ళిపోయి కుక్క చావు చచ్చాడు. మా అమ్మ అక్కడ స్కూళ్ళో టీచరుగా చేరింది. నాకు పెళ్ళి చేయాలని సంబంధాలు చూడసాగింది. నేను మీ ఊరెళ్ళి నీతో నా పెళ్ళి విషయం మాట్లాడమన్నాను. అమ్మ "వెళితే మీ నాన్న చేసిన పనికి మన ముఖాన పేడనీళ్ళు పోస్తారు." అంది. నాకూ అది నిజమే అనిపించింది.

ఆ తర్వాత నాకు ఓ తెలుగు మాస్టారితో పెళ్ళి జరిపించింది. మనిషి మంచివాడు. కాని మా నాన్న చేసిన పాపాలు ఎక్కడికి పోతాయి? అతనికి కిడ్నీలు రెండూ పాడయి హృదయ విదారక పరిస్థితుల్లో కన్ను మూశాడు.అతని వుద్యోగం నాకు వచ్చింది.

****            ****            ****            ****

"లాంగ్ సర్వీస్ లో ప్రిన్సిపాల్ నయ్యాను. ఇక్కడికి పోస్టింగ్ మీద వచ్చాను. ఇందులోకి అద్దెకి వచ్చి నాలుగు రోజులవుతోంది. నా సోదితో నిన్ను విసిగించాను. ఇహ నీ సంగతి చెప్పు. మీ ఆవిడెలా వుంటుంది? పిల్లలేం చేస్తున్నారు?" అంది కళ్ళు తుడుచుకుంటూ.

నాకూ పెళ్ళయింది. నాకో కొడుకు.. ఆర్మీలో వున్నాడు. ఈ మధ్యనే మా ఆవిడ కాలంచేసింది. ఆఫీసుకెళ్ళాలి.. ఇప్పటికే ఆలస్యమైంది. నేను ఒక కంపెనీకి కన్సల్ టెంట్ గా పనిచేస్తున్నాను.

"అన్నట్టు నాకు నువ్వంటే ఎంతో అభిమానం. ప్రేమ. అదృష్టమో, దురదృష్టమో మనిద్దరికీ తోడుండాల్సిన వాళ్ళు లేరు. పెద్దవాళ్ళ మూర్ఖత్వానికి బలయ్యాం. ప్రేమ ఆకర్షణతో మొదలై క్రమ క్రమంగా పరిణతి సాధిస్తుంది. మనిద్దరికి నిజానికి తోడు కావలసింది ఇప్పుడే! ఇప్పటి ఈ జీవితాలు మనవి. మనని ఎవరూ శాసించలేరు. మనమే శాసన కర్తలం. మనిద్దరం ఒకటై మిగిలిన ఈ జీవితాన్ని తృప్తిగా గడుపుదాం! ఏమంటావు? ఈ ప్రపోజల్ నచ్చితే సాయంత్రం ఆరు గంటలకి వస్తాను. తయరుగా వుండు.. బిర్లా టెంపుల్ కి వెళదాం." అన్నాను.

****            ****            ****            ****

సాయంత్రం ఆరు గంటలు.

వైష్ణవి కొత్తచీర కట్టుకుని..పూలుపెట్టుకుని ఎదురుచూస్తోంది. ఇప్పుడు ఆమెకి మానసికంగా పదహారేళ్ళు.




హాయ్ మధూ ఏం చేస్తున్నావ్?" అంటూ సుడిగాలి లా దూసుకు వచ్చిన మంజులని హాల్లోనే "స్టాప్ స్టాప్!" అంటూ ఆపేశాడు మాధురి భర్త అజయ్.. "క్యా బాత్ హై? మధూ ఇంట్లో లేదా ఏంటి కొంపదీసి?" కనుబొమ్మలు ముడి వేస్తూ అడిగింది మంజు.

"లేకేం? సుజిత్ తో మాట్లాడులోంది ఫోన్లో. వారం రోజులకి దొరికాడు పుత్రరత్నం. కాసేపు నిరీక్షించక తప్పదు. ఇంతకీ మీ వారెక్కడా?" "ఇదిగో ఇక్కడ, కార్ పార్క్ చేసి వస్తున్నా" వెనకాలే వచ్చిన అవినాష్ చేయి అందుకుంటూ సోఫా లో కూచోబెట్టాడు అజయ్. "ఒక్క నిమిషం జ్యూస్ తెస్తా" అని లోపల్నించి మేంగో జ్యూస్ పట్టుకొచ్చాడు.

దాదాపు పదిహేను నిమిషాలకి మాధురి కొంచెం విచారం, కొంచెం సంతోషం కలగలుపుగా హాల్లోకి వచ్చింది. "హాయ్ మంజూ! చాలాసేపైందా వచ్చి? ఎలా ఉన్నారు? సారీ, వెయిట్ చేయించాను. అన్నట్టు అవినాష్! ఏం తీసుకుంటారు? కాఫీ, జ్యూస్?" అని

హడావిడి పడిపోసాగింది. "మర్యాదలన్నీ అయ్యాయిలే గాని సుజిత్ ఏమంటున్నాడు? బాగా అడ్జస్ట్ అయ్యాడట్నా? చదువెలా సాగుతోందట?" కుతూహలం గా అడిగింది మంజుల. మాధురి ముఖం మళ్ళీ చిన్నబోయింది. "ఇప్పట్లో రాడే! ఏదీ ఏడు నెల్లేగా అయింది టెక్సస్ వెళ్లి. ఏం చదువులో ఏంటో? కనీసం ఫోన్ చేయడానికైనా తీరిక ఉండదా? వారం రోజుల్నించి ఫోన్ లేదు. ఎంత బెంగగా అన్పించిందో తెల్సా? అదే మాట్లాడుతున్నా ఇంతసేపూ. రెండ్రోజులకొక్కసారైనా ఫోన్ చేయాల్సిందేనని! వాడేదో చెప్తున్నాడనుకో. మా అక్క కొడుకు పెళ్ళాం, పిల్లాడితో సిడ్నీ వెళ్లి రెండేళ్లవుతోంది. ఉద్యోగం, సంసార జంఝాటం లో పడి పదిహేను రోజులకోమారు ఫోన్ చేస్తాడు. వీడు చూస్తే చదువుకోడానికే గా వెళ్లింది. ఏం వ్యాపకాలుంటాయి చెప్పు? అమ్మానాన్నలకి ఫోన్ చేయటానిక్కూడా తీరిక దొరకదా?" ఆవేదనగా చెప్పుకుపోతోంది మాధురి.

"అంతేనే! విదేశాలకి వెళ్తే ఇక్కడి వాళ్ళు ఏమైపోయినా పట్టదు. చదువు, ఉద్యోగం, సంసారం... ఇలా వాళ్ళ ప్రపంచమే వేరు. ఇక్కడ మన దగ్గర ఉన్నట్టు అక్కడికెళ్ళాక ఎలా ఉంటారే మొద్దూ? కానీ నేను మాత్రం అలా ఉండను లేవే." అంటూ నవ్వింది మంజు. "నువ్వు అలా ఉండనంటావేంటే? నువ్వంటున్నది ఇక్కడే కదా? ఇండియా వదిలి ఎక్కడికి పోతావే?" వీపు మీద చరుస్తూ నవ్వింది మాధురి. అది చెప్పటానికే నండీ మీ ఫ్రెండ్ వచ్చింది, తను విజిటింగ్ ప్రొఫెసర్ గా బల్గేరియా వెళ్తోంది రెండేళ్లపాటు." అన్నాడు అవినాష్ నవ్వుతూ. "వావ్! ఇంత మంచి వార్త ఎంత కూల్ గా చెప్తున్నారో చూడు మధూ! ఎనీ వే కంగ్రాట్స్ మంజూ" అన్నాడు సంతోషంగా అజయ్. మాధురి ఆప్యాయంగా మంజులని కౌగిలించుకుంది. "ఇంతకీ ఎప్పుడు ప్రయాణం? మంజూ తో మీరూ వెళ్తున్నారుగా?" అనుమానంగా అడిగింది మధు. "ఆయనా వస్తున్నారే! నెల ఉండి అన్నీ చూస్కొని వస్తారు. నాక్కాస్త అలవాటవుతుంది ఈలోగా." అంది మంజు. "మళ్ళీ సమ్మర్ లో కోమల్ పరీక్షలయ్యాక ఇద్దరం కలిసి బల్గేరియా వెళ్తాం" అందుకుంటూ చెప్పాడు అవినాష్. "అమ్మో అయితే రెండేళ్ళు కన్పించవా? ఎలాగే మంజు?" అంటూనే మళ్ళీ "పోన్లేవే, ఇంత మంచి ఛాన్స్ ఎంత మందికి దొరుకుతుంది? మన వయసు వాళ్ళు పిల్లలు ఫారిన్ లో ఉంటే వాళ్ళని చూడ్డానికి వెళ్తారు గాని ఇలా తమ మెరిట్ మీద వెళ్లగల్గుతున్నది నువ్వేనే నాకు తెలిసి. ఫోన్ చేస్తూ ఉండు. పెద్దవాడు విమల్ ముంబై లో జాబ్ చేస్తున్నాడు. సో, వాడి గురించి బెంగ అక్కర్లేదు. కోమల్ ని వీలైనపుడల్లా మా ఇంటికి రమ్మనమను. అయినా వాడి నంబరు నా దగ్గర ఉందిగా. నేను టచ్ లో ఉంటాలే. ఏం పరవా లేదు." అంది మాధురి మంజు చేయి నిమురుతూ.

"థాంక్సే! వాడు మేనేజ్ చేసుకోగలడు. పర్లేదు. అన్నట్టు రేపు నేను హైదరాబాద్ వెళ్తున్నా, అమ్మకి, అన్నయ్యా వాళ్లకి నా ప్రయాణం గురించి చెప్పి రెండ్రోజులుండి అమ్మ చెప్పే జాగ్రత్తలు బుద్ధిగా విని వస్తాను" అంటూ వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని ఇంటికి బైలుదేరుతోంటే "మంజూ! వెళ్ళేలోగా మళ్ళీ వస్తావు కదా, అందరం కలిసి బైట డిన్నర్ కి వెళ్దాం" అంది మాధురి బొట్టు పెడుతూ.

****　　****　　****　　****

సాధారణంగా నీ ఈడు తల్లులు పిల్లల్ని పై చదువులకని విదేశాలు పంపిస్తూ వీడ్కోలు చెప్తూ ఉంటారు. కానీ పిల్లల్ని ఇక్కడ వదిలి నువ్వు కెరియర్ పరంగా విదేశాలకి వెళ్తున్నావే" అన్నాడు మంజు అన్నయ్య నవ్వుతూ. వదిన కొసరి కొసరి తిన్పించింది మంజుకి

ఇష్టమైన వంటకాలన్నీ అత్తగారి సూచనలతో! గిరిజమ్మ బాగా ఆందోళన పడిపోయింది కూతురి విదేశీ యానం సంగతి విని. మాటిమాటికి కళ్ళుతుడుచుకుంటూ మంజుని దగ్గరికి తీస్కొని "జాగ్రత్తే మంజూ! దేశం కాని దేశం వెళ్తున్నావు. ఎలా ఉంటావో ఏంటో?" అని బాధపడింది.

"నువ్వు మరీనమ్మా. నేనేమైనా చిన్నపిల్లనా? అయినా నాతో మా ఆయన కూడా వస్తున్నారుగా కొన్నాళ్ళపాటు! భయమేం లేదు." అని సముదాయించింది తల్లిని.

"నీకేంటే ఏమైనా చెప్తావు. దగ్గరాదాపా? సముద్రాలు దాటి వెళ్తున్నావు. వైజాగ్ లో ఉంటే రెన్నెల్లకోసారైనా సెమినారనో, మీటింగనో హైదరాబాద్ వచ్చేదానివి. ఇప్పుడెలాగే నిన్ను చూసేది?" అంటూ బావురుమంది గిరిజమ్మ.

"అయ్యో అత్తమ్మా! కంప్యూటర్ లో చూస్తూ చక్కగా మాట్లాడుకోవచ్చు. అలా బాధపడకండి, శుభమా అని తను వెళ్తోంటే." బుజ్జగించింది కోడలు శాంతి అత్తగారిని. మొత్తమ్మీద తల్లికి ఎలాగో నచ్చచెప్పి వైజాగ్ వెళ్లిపోయింది మంజుల.

****         ****         ****         ****

కాలేజ్ లో అందరి దగ్గరా సెలవు తీసుకొని ఇంట్లో చిన్న కొడుక్కి బోలెడు జాగ్రత్తలు చెప్పి వంటామెకి, పనిమనిషికి అన్ని అప్పగింతలు పెట్టి ఫ్లాట్స్ లో వాళ్లకి, వాచ్ మెన్ కి పిల్లాడిని కాస్త కనిపెట్టమని అభ్యర్థించి, భారమైన మనసుతో భర్తతో పాటు బల్గేరియా బైలుదేరింది మంజుల. దాదాపు పన్నెండు గంటల ప్రయాణ మనంతరం సోఫియా చేరారు. విమానాశ్రయం లో దిగుతూనే హిమపాతం, వణికించే చలి వారిని ప్రేమగా స్వాగతించాయి. భారత దౌత్య కార్యాలయ అధికారి, సోఫియా విశ్వవిద్యాలయం భారతీయ విద్యావిభాగం డైరెక్టర్ వారిని రిసీవ్ చేసుకొని క్వార్టర్ లో దింపి వెళ్ళిపోయారు. అత్యాధునిక వసతులతో విశాలమైన ఫ్లాట్ ముచ్చటగా అన్పించింది మంజూ దంపతులకి.

మర్నాడు ఎంబసీ కి వెళ్ళి భారత రాయబారిని కలిసి అభివాదం చేసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి, యూనివర్సిటీ కి వెళ్ళింది మంజుల. ఇండాలజీ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు ఆమెని పుష్ప గుచ్ఛాలతో ఆహ్వానించి కేక్ కట్ చేయించారు. భారతీయుల రాజభాషకి బల్గేరియా విశ్వవిద్యాలయం లో ప్రాధాన్యతని చూసి ఆమె ఆనందభరితురాలయ్యింది. ఇండాలజీ విభాగ ప్రొఫెసర్లు బల్గేరియన్సే ఐనా హిందీ లో చక్కగా మాట్లాడ్డం, విద్యార్థులకి బోధించడం ముచ్చటన్పించింది. మర్నాటి నించి

క్లాసులకి రమ్మనమని టైం టేబిల్ ఇచ్చారు. తర్వాత వాళ్ళు భార్యాభర్తలిద్దరినీ లంచ్ కి తీసుకువెళ్ళారు... తాము తెచ్చిన ఇండియన్ స్వీట్స్ వాళ్ళు ఇష్టంగా మెచ్చుకుంటూ తినడం మంజుల కెంతో నచ్చింది.

రోజూ తప్పనిసరిగా కొడుకులతో మాట్లాడేది మంజుల ఎంత బిజిగా ఉన్నా. విప్రో లో ఇంజనీర్ గా చేస్తున్న పెద్దకొడుకు విమల్ ఫ్రెండ్స్ తో ఫ్లాట్ లో ఉంటున్నాడు. చిన్నవాడు కోమల్ వైజాగ్ లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. పిల్లలు పెద్ద వాళ్ళే అయినా దూరంగా ఉండడంతో వాళ్ళెలా ఉన్నారో, ఏం తింటున్నారో అని బెంగ. ఫోన్ చేసినా ఇవే ప్రశ్నలు... "టైమ్ కి తినండిరా, ఆరోగ్యం జాగ్రత్తరా" అంటూ. కొన్నాళ్ళుండి మంజు బాగా అడ్జస్ట్ అయ్యిందనిపించాక అవినాష్ ఇండియా వెళ్ళిపోయాడు. ఇండాలజీ ప్రొఫెసర్ వన్యాసుకోవా సరదాగా, స్నేహం గా ఉండటం తో మంజూ కి బాగా నచ్చేసింది. తను అవివాహిత కావడం వల్ల మంజూ తో కలిసి ఫ్లాట్ లో ఉండడానికి ఒప్పుకోవడంతో కొత్త దేశం లో ఒంటరిగా ఉండాల్సివస్తుందనే బెంగ తప్పింది మంజూకి. ఇద్దరూ కలిసి వండుకోవడం, కాలేజ్ కి వెళ్ళడం., సెలవు రోజుల్లో షాపింగ్, కొలీగ్స్ ఇళ్ళకి, చుట్టుపక్కల ప్రాంతాలకి వెళ్ళడం... ఇలా టైమ్ బాగానే గడిచిపోతోంది.

"వారం నించి కోమల్ ఫోన్ కి దొరకడం లేదు, ఎలా ఉన్నాడు?" ఆదుర్దాగా అడిగింది మంజు స్కైప్ లో వచ్చిన భర్తని. "వాడేదో ప్రాజెక్ట్ వర్క్ హడావిడిలో ఉన్నాడు కంగారుపడకు. ఇంటికి కూడా లేట్ గా వస్తున్నాడు. నేను చెప్తాలే నీకు ఫోన్ చేయమని. వంటావిడ, పనిమనిషి బాగానే వస్తున్నారు నాగాలు పెట్టకుండా" చెప్పాడు అవినాష్ ఆమె మనసులో మాట తెలిసినట్టుగా. మంజు మనసు చివుక్కుమంది. వాడెంత బిజి అయితే మాత్రం దూరంగా ఉన్న తల్లికి ఫోన్ చేయడా? తనే మన్నా ఇక్కడ ఖాళీగా ఉందా? ఇంకో పక్క ఆ విమల్ షిఫ్ట్ డ్యూటీ అంటూ రాత్రిళ్ళు లేట్ గా వచ్చాననంటాడు, ఉదయం లేట్ గా లేచాననంటాడు. వాడు సరిగ్గా మాట్లాడడు. అదేంట్రా అంటే "ఏంటమ్మా రోజూ ఏముంటాయి కబుర్లు? ఆఫీసు, ఇల్లు, వండుకోవడం, వీకెండ్స్ లో బట్టలుతుక్కోవడం, ఇంతేగా. నువ్వొచ్చి నాకు ఏం చేసి పెట్టలేవు, తెలుసుకుని బాధ పడ్డం తప్ప. ఫ్రెండ్స్ తో అలా గడిచిపోతోంది" అంటాడు.. నిట్టూర్చింది మంజుల.

రాత్రి ఏడు గంటలకి ఫోన్ వస్తే మంజు ఒక్క ఉదుటున అందుకుంది కోమల్ చేశాడని అనుకుంటూ. "మంజూ తల్లీ ఎలా ఉన్నావే?" అంటూ పలకరించింది ఆప్యాయంగా అవతల్నించి అమ్మ. ఒక్కసారిగా జావగారిపోయింది మంజు. అంటే అక్కడ పదిన్నర అయిందన్న మాట. "ఆ, నేను బాగానే ఉన్నా గాని నీ ఆరోగ్యం ఎలా ఉంది? ఇంతవరకూ పడుకోకుండా ఏం చేస్తున్నావసలు?" విసుక్కుంది తల్లిని. రెండు దేశాల మధ్య మూడున్నర గంటల తేడా. తనిక్కడ సాయంత్రం ఆరున్నరకి గాని యూనివర్సిటీ నించి ఇల్లు చేరలేదు. అక్కడ అమ్మ రాత్రి ఎనిమిది కల్లా మాత్రలు వేసుకుని పడుకుండిపోతుంది. అందుకే మాట్లాడ్డం కుదరడం లేదు., ఇవాళ పదిన్నర దాకా లేచే ఉందంటే మందులు వేసుకోలేదన్న మాట. మనసులో లెక్క వేసుకుంది. "నువ్వు వెళ్ళాక రెండు సార్లు మాట్లాడావంతే. ఎంత బెంగగా ఉందో తెల్సా తల్లీ? ఒక్కదానివి అక్కడ ఏం తింటున్నావో? ఏమవస్థలు పడుతున్నావో అని ప్రాణం కొట్టుకుపోతోందే!' అంది గిరిజమ్మ వణుకుతున్న స్వరంతో. "అబ్బా! ఏంటమ్మా ఎప్పుడూ ఇదే గోల? నాకేమీ పర్వాలేదు, హాయిగా ఉన్నానే అంటే వినవే? మందులేసుకుని పడుకో ముందు. ఆదివారం మాట్లడతాలే." విసుగ్గా అంది మంజు కి. కోమల్ అనుకోని ఫోన్ తీస్తే అమ్మ మాట్లాడుతోంది. ఈలోపు వాడుగానీ చేస్తే ఎంగేజ్డ్ వస్తుంది. మళ్ళా ఎప్పుడు చేస్తాడో ఏంటో అనుకోని

ఫోన్ కట్ చేసింది. మిస్ కాల్స్ లో ఏవో ఉన్నాయి గాని కోమల్ నంబర్ లేదు. ఏమైంది చెప్మా? భర్త చూస్తే కలకత్తా కాంప్ లో ఉన్నాడు. విమల్ కి కాల్ చేస్తే "ఏంటమ్మా నువ్వు? వాడేమైనా చిన్న పిల్లాడా? ఏదో బిజీగా ఉండుంటాడు. తర్వాత కనుక్కుని ఫోన్ చేస్తాలే. ఆఫీస్ లో ఉన్నా, డిస్టర్బ్ చేయకు" అని పెట్టేశాడు.

మంజుల మనసు చివుక్కుమంది. ఏంటీ పిల్లలు? తను విదేశం వచ్చినా ఎంత బిజీగా ఉన్నా పిల్లల కోసం ఎంతగా ఆలోచిస్తోంది? ఆరోజు మధు ఏమంది? విదేశాలకి వెళ్తే పిల్లలంతే, ఫోన్ కి కూడా దొరకరు అని కదా! కానీ వాళ్ళు స్వదేశం లోనే గా ఉన్నారు!

మరెందుకు పట్టించుకోవడం లేదు? కనీసం ఫోన్ కి కూడా అందుబాటులో ఎందుకుండడం లేదు? అంటే విదేశాలు వెళ్ళడం వల్లో, పెళ్ళాం పిల్లల వల్లో ఈ మార్పు రావడం లేదు. తన పిల్లలు విదేశాల్లో లేరు, పెళ్ళయిన వాళ్ళు కారు. అయినా తల్లికి సమయం కేటాయించలేనంత బిజీగా ఉన్నారు. ఒక్కసారిగా బాధ ఆవరించింది ఆమెని.

**** **** **** ****

"ఇవాళ సోఫియా మాల్ కి వెళ్దామా మంజూ" ఆదివారం ఉదయం లేస్తూనే అడిగింది వన్యా. "ఓకే పిల్లలకి షర్ట్స్ కొనాలనుకుంటున్నా ఎలాగూ, లంచ్ చేసి వెళ్దాం" అంది ఉత్సాహంగా మంజు. సాయంత్రం వరకు షాపింగ్ చేసి మాల్ లోనే ఏదో తినేసి ఫ్లాట్ కి తిరిగి వచ్చారిద్దరు. రాత్రి ఏడవుతోంటే కోమల్ దగ్గర్నుంచి ఫోన్... కొడుకు గొంతు విని. "నాన్నా, ఎలా ఉన్నావురా?. ఫోన్ కనీసం ఎత్తనైనా ఎత్తవు కదా? ఎన్ని రోజులైందిరా నీతో మాట్లాడి" అంటూ మంజు పొంగిపోయింది. "పోమ్మా, కొత్త సిమ్ నించి ఎన్నిసార్లు ట్రై చేశానో? నువ్వొక్కసారి కూడా రెస్పాండ్ కాలేదు." ఆరోపణగా అన్నాడు కోమల్. ఆశ్చర్యం గా నంబర్ చూసింది మంజు. నిజమే, కొత్త నంబరు. ఎవరిదో అనుకోని పట్టించుకోలేదు. "నా సెల్ పోయిందమ్మా, అందుకే కొత్తది తీస్కున్నా. నువ్వు పాత నంబర్ కి చేస్తుంటావని చాలాసార్లు ట్రై చేస్తే లక్కీగా ఇవాళ దొరికావు." చెప్పాడు కోమల్. "సారీ నాన్నా, నువ్వు ఫోన్ చేయలేదని ఎంత బెంగ పడ్డానో? వేళకి తింటున్నావా? అసలే చలికాలం. బైట మంచులో ఎక్కువసేపు తిరగకు. స్వెట్టర్ వేస్కో. చెవులు కవర్ చేసుకో. లేకపోతే దగ్గు, జలుబుతో బాధపడాలి." జాగ్రత్తలు చెప్తోంటే "ఆపమ్మా బాబూ ఇది వైజాగ్, బల్గేరియా కాదు. చలి, మంచు జాంతానై. ఫ్రెండ్స్ వచ్చారు, మూవీకి వెళ్తున్నా, బై" అంటూ ఫోన్ కట్ చేశాడు కోమల్. నివ్వెరపోయింది మంజు.

హాల్లో సిస్టమ్ దగ్గర మెయిల్ చూస్తున్న వెన్యా "మంజూ, మీ అన్నయ్య స్కైప్ లో వచ్చారు" అని అరవగానే "ఇదిగో వస్తున్నా" అంటూ కంప్యూటర్ ముందు కూచుని బాధ వెళ్లబోసుకుంది. "చూడన్నయ్యా! విమల్, కోమల్ ఎంత ఆరిందాల్లా మాట్లాడుతున్నారో? ఫోన్ కి దొరకరు, ఎప్పుడూ బిజీయే! వాళ్ళ గురించి నేనెంత ఆరాటపడుతున్నానో అర్థం చేసుకోవడం లేదు. స్వెట్టర్ వేసుకోమంటే చిన్నాడు కొట్టిపారేశాడు. ఆ పెద్దాడికి చూడబోతే టాన్సిల్స్! కూల్ డ్రింకులు, ఐసుక్రీములు తినద్దంటే నాకు తెల్సులే అమ్మా, తినకుండా ఎలా? తినేశాక మాత్రలేసుకుంటాలే అంటున్నాడు. తల్లంటే అస్సలు లెక్కలేదు." అంటూండగానే అన్నయ్య నవ్వుతూ "మంజూ అమ్మతో ఒకసారి మాట్లాడు" అని వెబ్ కామ్ తల్లి వైపు తిప్పాడు. "అమ్మా! ఏంటి ఇంకా

పడుకోకుండా...?" మాట పూర్తవకుండానే "ఏమే మంజూ ఆదివారం ఫోన్ చేస్తానన్నావు? పగలంతా చూసి చూసి ఇంకా ఉండబట్టలేక నేనే అన్నయ్యని చేయమన్నాను..." చటుక్కున గుర్తొచ్చింది మంజూ కి క్రితం సారి అమ్మతో మాట్లాడుతూ ఆదివారం ఫోన్ చేస్తానన్న సంగతి. కోమల్ గాడి హడావిడి లో పడి మర్చేపోయింది. అవతల్నించి అమ్మ "ఏంటి తల్లీ అక్కడ చల్లగా ఉంటుందన్నావు. శాలువా అయినా కప్పుకోకుండా కూచున్నావు?" అంటోంది.

"అబ్బా ఇక్కడ హీటర్లు ఉంటాయే ఇంట్లో చల్లగా ఏమీ ఉండదు, నాకేం కాదు గాని నువ్వెలా ఉన్నావు? వదిన, పిల్లలు ఎలా ఉన్నారు?" "అంతా బాగానే ఉన్నాం. నీకసలే సైనస్. మందులేసుకుంటే సరిపోదు. వేళపట్టున వేడిగా తినడం, వేడి నీళ్ళుతాగడం చేస్తున్నావా, లేదా? ఇంట్లో కూడా చెప్పులేసుకో. లేకపోతే నెమ్ము చేస్తుంది. తొందరగా పడుకో" అంటూ జాగ్రత్తలు చెప్తోంటే చిర్రెత్తింది మంజూకి. "అలాగే లేవే అమ్మా. నేనేమైనా చిన్నపిల్లనా? నా గురించి నాకు తెలియదా ఏంటి?" "నీ మొహం? నీకేం తెలుసు? ఏదో పెద్ద చదువులు చదివేసి పై దేశంలో ఉద్యోగం వెలగబెడుతున్నంత మాత్రాన పెద్దదాన్ని అయిపోయాననుకుంటున్నావో ఏమో తల్లీ? చెప్పిన మాట విను కాస్త. ఫోన్ చేస్తూ ఉండు, పడుకుంటా ఇంక" అని లేచి వెళ్ళిపోయింది గిరిజమ్మ.

"విన్నావా అన్నయ్యా అమ్మ మాటలు? నాకేమీ తెలియదట. ఇరవయ్యేళ్ళ వయసు పిల్లలున్నారు నాకు. ఇంకా చిన్నపిల్లలకి చెప్పినట్టు ఎలా జాగ్రత్తలు చెప్తోందో చూడు నిద్ర పోకుండా." అన్నగారికి ఫిర్యాదు చేసింది మంజు. "అమ్మ ప్రేమంటే అదేనే మరి. పిల్లలెంత పెద్దయినా తల్లికెప్పుడూ చిన్నగానే అనిపిస్తారు. అంతెందుకు? నా ఆఫీసు మనింటికి రెండు వీధులవతల. అయినా రోజూ ఆఫీసుకి వెళ్తుంటే "నాన్నా, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తరా. అటూ ఇటూ చూసుకొని రోడ్డు దాటు." అని జాగ్రత్తలు చెప్తుంది. సాయంత్రం ఇంటికి రావడం కాస్త లేట్ గాని అయితే ఒకటే గాబరా పడిపోయి అందర్నీ కంగారు పెట్టేస్తుంది. పెద్దయ్యే కొద్దీ చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తారే వీళ్ళు."

"ఎన్నయినా చెప్పు వీలయినప్పుడల్లా ఫోన్ చేస్తా కదా. రాత్రి పదిన్నర వరకు పడుకోకుండా ఫోన్ లో నాకు జాగ్రత్తలు చెప్పాల్సిన పనేంటి? తన హెల్త్ గురించి ఎందుకు ఆలోచించదసలు?"

"ఆహా అలాగా తల్లీ? ఆ మధ్య కోమల్ తెల్లవారుఝాము 5 గంటలకి ఢిల్లీ వెళ్తోంటే నువ్వక్కడ అర్ధరాత్రి ఒంటిగంట దాకా పడుకోకుండా ఎందుకు వాడికి జాగ్రత్తలు చెప్పావు? బంగాళా దుంపల వేపుడు తింటుంటే పిల్లలు గుర్తొచ్చి బెంగపడ్డానంటావు. ఇక్కడ అమ్మ కూడా దోసకాయ పప్పు, గోంగూర పచ్చడి తింటూ ఇవి మంజు తల్లికి ఎంతిష్టమో అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది. అదేనమ్మా అమ్మ మనసు....

నీకు నీ పిల్లలు ఎంత ప్రాణమో అమ్మకి కూడా మనమంటే అంతే ప్రాణం. కానీ మనం మన పిల్లల గురించి ఆలోచించినట్టు

అమ్మానాన్న ల గురించి ఆలోచించం. ఎప్పుడూ పిల్లల కోసం ఆరాటపడుతూ ఉంటాం. వాళ్ళేమో తమ ఫ్రెండ్స్, తమ వ్యాపకాల్లో బిజీగా ఉండి ఏదైనా కావాలన్పిస్తే ఫోన్ చేస్తారు. మనకేమో ఆదుర్దాగా ఉంటుంది వాళ్ళెలా ఉన్నారోనని పిల్లలు రెండు రోజులు ఫోన్లో మాట్లాడకపోతే ఎంత తల్లడిల్లపోయావు? నువ్వు చెప్పిన టైమ్ కి ఫోన్ చెయ్యకపోతే ఇక్కడ అమ్మ కూడా అంతే! నీకోసం పదయినా పడుకోకుండా కూచుంటుంది. నీతో ఫోన్లో మాట్లాడితే తృప్తిగా నిద్ర పడుతుంది ఆవిడకి." అన్నయ్య చెప్పుకుపోతున్నాడు.

మంజుల కళ్ళ నిండా నీళ్ళు. నిజమే కదా ఎంత బిజీగా ఉన్నా కాస్త టైమ్ చిక్కితే పిల్లలకే కేటాయించా గాని తల్లి కోసం కాదు. పిల్లలు సరిగ్గా మాట్లాడకపోయినా కనీసం వాళ్ళ గొంతు వింటే చాలని తెగ తాపత్రయ పడుతూ ఉంటా. వాళ్ళకిష్టమైన వస్తువులు కన్పించినా, వంటకాలు తింటున్నా ఇక ఆరోజు మరీనూ! మరి అమ్మ క్కూడాఅలాగే ఉంటుందని ఎందుకు అనుకోలేకపోయాను? మనిషి సైకాలజీ ఎంత చిత్రం గా ఉంటుందో కదా? ఎవరైతే తమ గురించి ఎక్కువ కేర్ తీసుకుంటారో, ఆలోచిస్తారో వాళ్ళకి అందరి కంటే తక్కువ ప్రాధాన్యతనిస్తారు. తను అమ్మని పట్టించుకోనట్లే తన పిల్లలు కూడా తనకి సమయం కేటాయించడం లేదు.

అవతల్నుంచి అన్నయ్య అంటున్నాడు... "అమ్మ ప్రేమించినట్టు ఎవరూ ప్రేమించరే మంజూ! ఈ టెక్నాలజీ పుణ్యమా అని దూరాలు దగ్గరవుతున్నాయి. చాదస్తం అని తీసిపారేయకుండా నీ పిల్లల్లాగానే అమ్మని కూడా చిన్న పిల్ల అనుకోని కాస్త టైమ్ కేటాయించు. ఆవిడేం చెప్పినా విసుక్కోకుండా ఓపిగ్గా విను."

అన్నయ్య మాటలు ఆ ప్రశాంత నిశీధి లో హిమపాతం లాగా ఆమె హృదయాన్ని చల్లగా తాకుతుంటే స్కైప్ లో కన్పిస్తున్న తల్లి ఫోటోని ప్రేమగా చూస్తూ ఉండిపోయింది అమ్మ మనసు తెలిసిన మంజుల.




బదరీనాథ్ ఓ ప్రభుత్వోద్యోగి. ఆ మధ్యే హైదరాబాద్ కు బదిలి అయి వచ్చాడు. ఆ మహా నగరంలో హఠాత్తుగా అద్దె ఇల్లు దొరకడమంటే అంత సులభం కాదు. అదీ - ఆఫీసుకు దగ్గరలో!... మొత్తానికి ఎలాగో కొలిగ్స్ సాయంతో ఓ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ లో ఫ్లాట్ ఒకటి సంపాదించగలిగాడు, అద్దె కొంచెం ఎక్కువైనా.

కొత్త ఊరు. కొత్త సంసారం... ఆ ఏరియాకు చెందిన కుకింగ్ గ్యాస్ సప్లయ్ ఏజెన్సీ కి వెళ్లి రిజిష్టర్ చేసుకోబోతే, ఐ.డి. తో పాటు అడ్రెస్ ప్రూఫు కావాలన్నారు. అదీ - అతని పేరులో!... అలాగే, బ్యాంక్ లో ఎకౌంట్ ఓపెన్ చేద్దామని వెళ్తే - అడ్రెస్ ప్రూఫ్ తో పాటు, అదే బ్రాంచ్ లో అకౌంట్ ఉన్న ఖాతాదారు చేత ఇంట్రడక్షన్ కూడా కావాలన్నారు.

కరెంట్ బిల్లు బిల్డర్ పేరులో ఉంది. అతను తన ఫ్లాట్ లో అద్దెకు ఉంటున్నట్లు ఇంటి ఓనర్ రాసిచ్చే లెటర్ కూడా చెల్లదట. ప్రభుత్వపరమైన గుర్తింపు కాగితమే కావాలట!

ఎవరో సలహా ఇవ్వడంతో, తన డిపార్ట్మెంట్ ఐ.డి. ని ఉపయోగించి గవర్నమెంట్ (బి.ఎస్.ఎన్.ఎల్) టెలిఫోన్ ల్యాండ్ లైన్ కనెక్షన్ తీసుకున్నాడు బదరీనాథ్, వేయి రూపాయల డిపాజిట్ కట్టి, నిజానికి అతనికి సెల్ ఫోన్ ఉంది. ల్యాండ్ లైన్ అవసరం లేదు. ఐనా అడ్రెస్ ప్రూఫ్ కోసం కనెక్షన్ తీసుకోకతప్పలేదు.

దాంతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి, గ్యాస్ ఏజెన్సీ లో పేరు నమోదు చేసుకుని తేలికగా ఊపిరి పీల్చుకున్న బదరీనాథ్ - అసలు సమస్య ఆ తరువాతే ఆరంభమౌతుందని ఊహించలేదు, పాపం!

ముప్ఫయ్ ఐదేళ్ళ బదరీనాథ్ ది చిరు కుటుంబం - భార్య కమల, పదేళ్ళ కూతరు రాధిక, తల్లి లక్ష్మమ్మాను.

ఓ సారి ఫోన్ మ్రోగితే లక్ష్మమ్మ వెళ్లి రిసీవర్ తీసింది.

ఆమె 'హలో!" అనగానే - అటువైపు నుండి, "హాయ్, స్వీటీ! నిన్నటి నుంచి నీకోసం ట్రై చేస్తూంటే రెస్పాన్స్ లేదేమమ్మా?" అన్న మగ గొంతుక.

"ఏయ్, ఎవరు నువ్వు?" గట్టిగా అడిగింది లక్ష్మమ్మ.

"ఎంత అలిగితే మాత్రం? బాయ్ ఫ్రెండ్ నే తెలియనట్టు నటిస్తావా! నా సెల్ లో చార్జ్ ఐపోయింది డియర్! అందుకే ఇందులో," అన్నాడతను. "ఏయ్, స్వీటీ! సాయంత్రం లవర్స్ పార్క్ కు వెళ్దాం, రెడీగా ఉండు, అక్కడ ఐస్ క్రీమూ, నీ కోపం పోయేలా స్వీట్ నథింగ్సూ తో ఎంజాయ్ చేద్దాం. ఓకే?"

"ఎవడ్రా నువ్వు? ఎవరు కావాలి?" కోపంగా అంది ఆవిడ.

"నువ్వే, నువ్వే... నువ్వే కావాలి!" కొంటెగా అన్నాడు అతను. అంతలోనే, "మీవాళ్లెవరైనా పక్కనున్నారేమిటీ... తెలియనట్టు నటిస్తున్నావ్?... ఓకే! ఈవెనింగ్..." అంటూ, ఫోన్లో

ముద్దులు పెట్టాడు.

చటుక్కున రిసీవర్ పెట్టేసి, అప్రయత్నంగా బుగ్గ తుడుచుకుంది లక్ష్మమ్మ.

"దరిద్రపుగొట్టు వెధవ! నన్ను లవర్స్ పార్క్ కు రమ్మంటాడా! నాకు ముద్దులు కూడా పెడతాడా!!... బదరీని రానియ్, పోలీస్ కంప్లెయింట్ ఇప్పించి, ఆ పోకిరిగాడి తిక్క కుదుర్చుతాను..." అంటూ కోపంతో గింజుకుంటున్న అత్తగారి వంక తెల్లబోయి చూసి, "ఏమయిందత్తయ్యా?" అనడిగింది కమల.

ఆవిడ జరిగిందంతా చెప్పి, "నా వయసుకూడా గౌరవం లేకుండా నోటికి వచ్చినట్టు వాగుతాడా! వాడికెంత ధైర్యం?" అంది మండిపడుతూ.

కమల నవ్వాపుకుంటూ, "టెలిఫోన్లో మీరు అతనికి కనిపించరు కదండీ? బహుశా అతను తన గర్ల్ ఫ్రెండ్ ఎవరికో చేస్తే... అది రాంగ్ నంబరుకు, మనకు వచ్చుంటుంది" అంది.

ఆవిడ "ఔనా!?" అంటూ విస్తుపోయి, "గర్ల్ ఫ్రెండ్ ఐతే మాత్రం... ఫోన్లో ఆ ముద్దులేమిటీ, అసహ్యంగా!' అంది.

'అది జెనరేషన్ గ్యాప్!' అని అత్తగారితో అనబోయి ఊరుకుంది కమల.

సాయంత్రం ఆఫీసు నుండి వచ్చాక తల్లి ఆనాటి తన టెలిఫోన్ అనుభవం గురించి చెబుతూంటే... పడిపడి నవ్వారు బదరీనాథ్, రాధికలు.

"నాన్నమ్మా! తప్పకుండా అది తాతయ్యే అయుంటాడు!" అంటూ ఆవిడను రాధిక ఆట పట్టిస్తూంటే...

"తప్పు!" అంటూ కూతురి నెత్తి మీద మురిపెంగా చిన్న మొట్టికాయ వేసింది కమల.

బదరీనాథ్ ల్యాండ్ లైన్ కు రాంగ్ కాల్స్ విరివిగా వస్తూండేవి. వాటిలో తరచుగా వచ్చే కాల్ - రాష్ట్ర మంత్రి ఏడుకొండలు కోసం! రోజుకు అర డజను సార్లైనా అతని కోసం ఫోన్ చేస్తూంటారు, ఎవరెవరో. అది మంత్రి గారి నివాసం కాదనీ, రాంగ్ నంబరనీ చెప్పినా కొందరు నమ్మేవారు కాదు... తమ నంబరూ, మంత్రి గారి నంబరూ పక్క పక్క వయ్యుంటాయనుకునేవాడు బదరీనాథ్. అతని కాల్స్ తమకు వచ్చినట్టే, తమ కాల్స్ అతనికి వెళ్తున్నాయేమోనన్న అనుమానం కూడా కలిగేది. ఆ విషయమై ఒకటి రెండు సార్లు టెలిఫోన్ డిపార్ట్మెంట్ కు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పులేదు.

ఓరోజు రాత్రి టీవీ లో న్యూస్ వాచ్ చేస్తూన్న బదరీనాథ్ కుటుంబాన్ని ఓ వార్త ఆశ్చర్యపరిచింది... ఆ రోజు ఉదయం మంత్రి ఏడుకొండలు తన పదవికి రాజీనామా చేసాడని తెలిసి అతని అభిమానులు, మద్దతుదారులూ అతని నివాసానికి ఊరేగింపుగా వెళ్లారు. అతను ఎట్టి పరిస్థితులలోనూ రిజైన చేయడానికి వీల్లేదంటూ నినాదాలు చేసారు. రాజీనామాను ఉపసంహరించుకోవాలంటూ గొడవ చేసారు. అది కేవలం గాలి వార్త అని చెప్పినా వినిపించుకోలేదు.

మంత్రి గారింటి ఆడంగులే ఆ నిజం చెప్పారంటూ వక్కాణించారు. ఆ గుంపును చెదరగొట్టడానికి పోలీసులు లాఠీ ఛార్జ్ కూడా చేయవలసి వచ్చింది... తరువాత, మహేశ్వరం లో పర్యటిస్తున్న మంత్రి గారే స్వయంగా వచ్చి, అది అబద్ధపు వార్త అనీ, కిట్టనివారెవరో దానిని పుట్టించి ఉంటారనీ చెప్పాకగానీ, జనాలు కుదుటపడలేదు.

"మంత్రి గారి రాజీనామా నిజమే అయ్యుంటుంది. ముఖ్యమంత్రితో ఏ విషయం లోనో అభిప్రాయభేదం వచ్చుంటుంది. ఆవేశంతో రిజైన్ చేసేసి ఉంటాడు గురుడు. మద్దతుదారుల ఒత్తిడితో ఉపసంహరించుకుని ఉంటాడు" వ్యాఖ్యానించాడు బదరీనాథ్.

"అంతే అయ్యుంటుంది. నిప్పు లేనిదే పొగరాదు కదా!" అంది లక్ష్మమ్మ.

"మంత్రి గారి రాజీనామా సంగతి ఆయన ఇంట్లోవాళ్ళే చెప్పారంటున్నారు కదా!" అంది కమల.

అంతలో ఏదో గుర్తుకు వచ్చిన రాధిక 'కెవ్వు' మని అరచింది.

త్రుళ్ళిపడ్డా రంతా.

భయపడ్డ అత్తగారు కంగారుగా గుండెల పైన ఊసుకుంటూంటే - కూతురి వంక కోపంగా చూసింది కమల.

"ఏమయిందే? ఎందుకలా గుండెలు అవిసిపోయేలా అరిచావ్?" అంది కోపంగా.

ఆ పిల్ల చెప్పింది ఆలకించి మొదట తెల్లబోయినా, ఆ తరువాత పడిపడి నవ్వారంతా.

ఆరోజు ఉదయం... ల్యాండ్ లైన్ మ్రోగింది. పెద్దవాళ్ళంతా ఎవరి పనులలో వాళ్ళు బిజీగా ఉండడంతో, రాధిక వెళ్లి రిసీవర్ తీసింది.

"మంత్రి గారు ఉన్నారండీ?" అని అడిగారు ఎవరో అటువైపు నుండి.

రోజుకు పదిసార్లు వచ్చే మంత్రి గారి కాల్స్ తో విసుగెత్తిపోయి ఉన్నారు ఇంట్లో అందరూ. అందుకే కొంటెగా, "మంత్రి గారు లేరు. రిజైన్ చేసేసారు!" అని జవాబిచ్చి, ఫోన్ కట్ చేసేసింది ఆ పిల్ల.

ఆ తరువాత ఫోన్ మళ్ళా మళ్ళా రింగ్ ఐనా అటెండ్ అవ్వలేదు...

మంత్రి ఏడుకొండలు 'రాజీనామా' వార్తకు మూలం రాధిక అని గ్రహించేసరికి, ఓ పక్క "అలా చెప్పడం తప్పుకాదటే, దయ్యం!" అంటూ ఆ పిల్లను మురిపెంగా మందలిస్తూనే... మరో పక్క రాత్రంతా నవ్వలేక చచ్చింది బదరీనాథ్ కుటుంబం.

ఐతే -

టెలిఫోన్స్ - ముఖ్యంగా, ల్యాండ్ లైన్స్ - కేవలం నవ్వించే సన్నివేశాలకే దారితీస్తాయనుకున్న బదరీనాథ్ - అది ఎల్లప్పుడూ నిజం కాదనీ, ఏడ్పించగలవు కూడాననీ తెలుసుకోవడానికి అట్టే రోజులు పట్టలేదు. కొండొకసారి అది హార్ట్ ఎటాక్స్ కూడా తెప్పిస్తుందనడానికి తానే నిదర్శనం అయ్యాడు.

ఆ రోజు సాయంత్రం - ఆఫీసు నుండి వచ్చి, వాష్ చేసుకుని, సోఫాలో కూర్చుని కాఫీ సిప్ చేస్తూ వార్తా పత్రిక చదువుతున్నాడు బదరీనాథ్. ఓ కాగితం తెచ్చి తండ్రికి ఇచ్చింది రాధిక.

దాన్ని చూడగానే, 'అమ్మో!' అంటూ గుండె పట్టుకుని సోఫాలో ఒరిగిపోయాడు బదరీనాథ్.

లబో దిబో మంటూ డాక్టర్ కు ఫోన్ చేసింది కమల.

డాక్టర్ వచ్చి బదరీనాథ్ ను పరీక్షించాడు. "ఏదో పెద్ద షాకే తిన్నట్టున్నాడు. కరెంటు తీగ ఏదైనా పట్టుకున్నాడా?" అనడిగాడు.

"లేదు. ఈ టెలిఫోన్ బిల్లు ముట్టుకున్నాడు," అని జవాబు ఇచ్చింది రాధిక.

"అదీ సంగతి! అందుకే హార్ట్ ఎటాక్ వచ్చింది," అంటూ బదరీనాథ్ కు ఇంజెక్షన్ ఇచ్చాడు. దాంతో కొంతసేపటికి కళ్ళు తెరిచాడు బదరీనాథ్.

"పరవాలేదు. మైల్డ్ ఎటాకే. మందులు వేసుకుని రెస్ట్ తీసుకుంటే సరయిపోతుంది" అంటూ మందులు రాసిచ్చాడు డాక్టర్. "ఎందుకైనా మంచిది... కొన్నాళ్ళపాటు టెలిఫోన్ బిల్లులూ, కరెంట్ బిల్లులూ అతనికి చూపించకండి".

కమలకు కొన్ని జాగ్రతలు చెప్పి... ఫీజు జేబులో వేసుకుని, మెడిసిన్ చెస్ట్ తీసుకుని వెళ్ళిపోయాడు అతను.

బదరీనాథ్ కోలుకునేసరికి వారం రోజులు పట్టింది.

భర్త పూర్తిగా కోలుకున్నట్టు నమ్మకం కలిగాక - ఎందుకైనా మంచిదని డాక్టర్ రాసిచ్చిన మందులవి దగ్గర పెట్టుకుని, "ఏమిటండీ,

ఈ దారుణం? రెండు నెలలకు యాభై వేల బిల్లేమిటి!? అన్ని కాల్స్ ల్యాండ్ లైన్ నుండి మనమెప్పుడు చేసాం?" అంది కమల ఆశ్చర్యము, ఆగ్రహమూ మిళితం కాగా.

బిల్లు తీసుకుని దానికి జతపరచియున్న కాల్స్ వివరాలను పరిశీలించిన బదరీనాథ్ నిశ్చేష్టుడయ్యాడు.

అర్థరాత్రి వేళ... ఇంటర్నేషనల్ కాల్స్... దుబాయ్, పాకిస్థాన్, సాల్మన్ ఐలెండ్స్, క్రిస్మస్ ఐలెండ్స్ వగైరా దేశాలకు చేయబడినట్టు ఆ రికార్డ్ చెబుతోంది! వాటి కారణం గానే బిల్లు మొత్తం యాభై వేలు అయింది!!

అయోమయంలో పడిపోయాడు బదరీనాథ్. తాను కాని, తన కుటుంబం కాని ఇంటర్నేషనల్ కాల్స్ ఎన్నడూ చేయలేదు. కనీసం - అమెరికాకు కూడా. ఎందుకంటే, తన బంధుమిత్రులెవరూ విదేశాలలో లేరు. పుట్టంతా స్వదేశంలోనే ఉంది... పైగా, దుబాయ్, పాకిస్థాన్ లు తప్పిస్తే... సాల్మన్ ఐలెండ్స్, క్రిస్మస్ ఐలెండ్స్ పేర్లు ఎప్పుడూ విననుకూడా లేదు.

అంతలోనే హఠాత్తుగా గుర్తుకు వచ్చింది అతనికి - తన ల్యాండ్ లైన్ కు అసలు ఐ.ఎస్.డి. ఫెసిలిటీయే లేదన్న విషయం!... నవ్వాలో ఏడవాలో తెలియలేదు అతనికి.

ఐతే అతని కుటుంబం మాత్రం ఏడ్చింది, ఆ టెలిఫోన్ బిల్లు మూలంగా... ఆరోగ్యంగా ఉన్న మనిషికి హార్ట్ ఎటాక్ వచ్చినందుకు!... టెలిఫోన్ బిల్లుకు డాక్టర్ బిల్లు కూడా తోడయినందుకు!!

బిల్లు తీసుకుని టెలిఫోన్ డిపార్ట్మెంట్ కు వెళ్ళాడు బదరీనాథ్. జూనియర్ ఇంజనీర్ ను కలుసుకుని విషయం చెప్పాడు.

ముందుగా బిల్లు పేచేసి, ఆనక కంప్లెయింట్ రాసివ్వమన్నాడతను.

బదరీనాథ్ తెల్లబోయి, "చేయని కాల్స్ కు నేనెందుకు బిల్లు కట్టాలి?" అనడిగాడు.

అతను నవ్వి, "అదంతే. 'పే ఫస్ట్ - ప్రొటెస్ట్ లేటర్' అన్నది మా డిపార్ట్మెంట్ తంబ్ రూల్!" అన్నాడు.

ఆ రూల్ తన కేసుకు వర్తించదని అతనికి నచ్చజెప్పబోయాడు బదరీనాథ్. ఫలితం లేకపోయింది.

డిపార్ట్మెంట్ హెడ్ జనరల్ మేనేజర్ (జి.ఎమ్) దగ్గరకు వెళ్ళాడు బద్రీనాథ్. తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

బదరీనాథ్ చెబుతూన్నది సానుభూతితో, సావధానంగా ఆలకించాడు జనరల్ మేనేజర్.

"ఎక్స్ఛేంజ్ లన్నీ కంప్యూటరైజ్డ్. పొరపాట్లకు ఆస్కారం లేదు. మీరో, మీ కుటుంబ సభ్యులలో ఎవరో ఆ కాల్స్ ను చేసి మరచిపోయుంటారు," అన్నాడు కూల్ గా.

"కంప్యూటర్స్ ను ఆపరేట్ చేసేది మనుషులే. పొరపాటు ఎలాగో జరిగిపోయింది. అది మా దగ్గర మాత్రం కాదు" చికాకును అణుచుకుంటూ అన్నాడు బదరీనాథ్. "జరిగిన పొరపాటును సరిదిద్దవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను".

"సారీ సార్! మా జేయీ చెప్పింది నిజమే. మా సిస్టం ఎంతగా స్ట్రీమ్ లైన్ అయిందంటే... మొదట మీరు బిల్ పే చేస్తే తప్ప మీ కంప్లయింట్ ను యాక్సెప్ట్ చేయదు" అన్నాడు

జి.ఎమ్. పొలైట్ గా.

బదరీనాథ్ తెల్లబోయాడు. "బట్, వై షుడ్ ఐ పే?"

"మీ టెలిఫోన్ డిస్కనెక్ట్ అవకుండా ఉండడానికి" చిరునవ్వుతో సమాధాన మిచ్చాడు జి.ఎమ్.

"దెన్, ఐ విల్ డిమాండ్ సి. బి. ఐ ఇంక్వైరీ!" కోపంగా అన్నాడు బదరీనాథ్.

అతని వంక జాలిగా చూసాడు జి.ఎమ్. బదరీనాథ్ కు వార్తా పత్రికలను చదివే అలవాటు లేదా అని అడిగాడు. రోజూ వాటితోనే

ముఖం కడుగుతానని చెప్పాడు బదరీనాథ్, అలా ఎందుకు అడిగాడో అర్థం కాక.

"మరైతే ఇటీవల దేశంలో జరుగుతున్న సంఘటనల గురించి మీకు తెలిసే ఉండాలే!" అన్నాడు జి.ఎమ్.

"ఏ సంఘటనలను గురించి మీరు మాట్లాడేది?"

"అదే - బాంబ్ బ్లాస్ట్స్... మొదట బోంబే లో, తరువాత డిల్లీ లో, ఆ మధ్య మన హైదరాబాద్ లో. రేపు ఎక్కడో!?" అన్నాడు జి.ఎమ్.

"దేశంలో జరుగుతూన్న బాంబ్ బ్లాస్ట్స్ కూ, నా టెలిఫోన్ బిల్లుకూ ఏమిటి సంబంధం?" అయోమయంగా, అనుమానంగా చూసాడు బదరీనాథ్.

"ఉంది, సార్! బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్ ను మీరు ఎరుగుదురనుకుంటాను?" మందహాసం చేసాడతను.

"ఆఫ్ కోర్స్, మున్నాభాయ్ ని ఎరుగనివారు ఎవరుంటారు!?

అదంతా ఎక్కడకు దారి తీస్తోందో ఇంకా బోధపడడం లేదు బదరీనాథ్ కు.

"నౌ, లుక్, మై లెర్నెడ్ సార్! ఆ సూపర్ స్టార్ కు అండర్ వరల్డ్ తో సంబంధం ఉందన్న అనుమానం పోలీసులకు ఎలా కలిగిందంటారు?"

అతని ప్రశ్నతో బదరీనాథ్ మస్తిష్కం అర్జెంట్ గా ఆలోచనల అగాధం లోకి జారిపోయింది... సంజయ్ దత్ ఇంట్లోని ల్యాండ్ లైన్ నుండి దుబాయ్ వంటి దేశాలకు చేయబడ్డ కొన్ని

ఫోన్ కాల్స్ ఆధారంగా... పోలీసులు తీగ లాగితే డొంకంతా కదిలింది. దఫాలుగా శ్రీకృష్ణ జన్మస్థానానికి కూడా వెళ్లివచ్చాడు అతను.

ఆ కేసింకా ఓ కొలిక్కి రాలేదు...

'తన ఫోన్ బిల్లుకూ, సంజయ్ దత్ కేసుకూ సంబంధం ఏమిటో? అదంతా ఎక్కడకు దారి తీస్తున్నట్లో!?'... పజ్లింగ్ గా చూసాడు బదరీనాథ్.

"మీకు ఇంకా బోధపడలేదా?!" ఆశ్చర్యంగా అడిగాడు జి.ఎమ్. "ఐతే, మీకు బుర్రకు ఎక్కేలా చెప్పడం నా విద్యుక్త ధర్మం!"

బ్లాంక్ గా చూసాడు బదరీనాథ్.

"మీరు ఫోన్ బిల్ గురించి సి.బి.ఐ. దర్యాప్తును డిమాండ్ చేస్తానన్నారు. రైట్?" అన్నాడు జి.ఎమ్. "కాని, సి.బి.ఐ రంగం లోకి దిగితే ఏమౌతుందో తెలుసా?"

"ఏమౌతుంది?"

"మీ కప్ బోర్డ్ లో స్కెలెటెన్స్ ను సృష్టించగలదు ఆ ఏజెన్సీ..."

"వాడ్డూ యూ మీన్?"

"మీ కాల్స్ గమ్యం దుబాయ్, పాకిస్థాన్ వంటి దేశాలు అని మీరు విస్మరించకూడదు".

"బట్, ఆ కాల్స్ మేం చేయలేదు" గుర్తుచేశాడు బదరీనాథ్.

"అని మీరంటున్నారు. కాని, ఆ విషయంలో సి.బి.ఐ. ఆలోచనలు వేరేలా ఉండొచ్చును!" మందహాసం చేసాడు జి.ఎమ్. "దె కుడ్ ఈవెన్ ట్రేస్ యూ టు ద ఇంటర్నేషనల్ టెర్రరిస్ట్ గ్రూప్స్..."

అదిరిపడ్డాడు బద్రీనాథ్. "ఇటీజ్ రిడిక్యులస్!" ప్రొటెస్ట్ చేసాడు. "నా ఫోన్ కు అసలు ఐ.ఎస్.డి. ఫెసిలిటీయే లేదు!"

"ఓహ్, దట్ కుడ్ స్పెల్ ఫరదర్ ట్రబుల్ ఫర్ యూ..." అన్నాడు జి.ఎమ్. "రెండు మూడేళ్ళ క్రితం హైదరాబాద్ లో ఓ ఫేక్ టెలిఫోన్ ఎక్స్చేంజ్ రాకెట్ ను పోలీసులు బర్స్ట్ చేసారు, గుర్తుందా? ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయాన్ని నష్టం కలిగిస్తూ ప్రైవేట్ కంపెనీలకూ, బిజినెస్ మెన్ కూ రహస్యంగా ఇంటర్నేషనల్ కాల్స్ ను తక్కువ రేటుకు కనెక్ట్ చేసేది ఆ ముఠా... మీరూ అలాగే ఏ దొంగ ఎక్స్చేంజ్ ద్వారానో అంతర్జాతీయ కాల్స్ ను చేస్తున్నట్లు సి.బి.ఐ. దర్యాప్తు లో తేలవచ్చును!"

హతశుడయ్యాడు బదరీనాథ్. హఠాత్తుగా జబ్బుపడ్డవాడిలా ఐపోయాడు.

"ఐతే నన్నిప్పుడు ఏం చేయమంటారు?" నిస్సహాయంగా అడిగాడు.

"నేనే కనుక మీ స్థానంలో ఉంటే గప్ చుప్ గా బిల్లు చెల్లించేసేవాణ్ణి!" సజెస్ట్ చేసాడతను.

"మై గాడ్! యాభై వేలు! అకారణంగా!!" ఉలికిపడ్డాడు బదరీనాథ్.

"ఇంక్వైరీ వరకు వెళ్తే... అది మరింత కాస్ట్లీ ఆఫైర్ కావచ్చును!"

"బట్, అంత సొమ్ము నేనెక్కన్నుంచి తేను?"

"దట్స్ యువర్ ప్రాబ్లెమ్!" తాపీగా అన్నాడు జి.ఎమ్. "యూ బెట్టర్ గెట్ ద హెల్ ఔటాఫ్ హియర్... బిఫోర్ ద సి.బి.ఐ. స్మెల్స్ ఎ ర్యాట్!"

మెసేజ్ మెదడులో సూటిగా నాటుకోవడంతో - చటుక్కున లేచి నిలుచున్నాడు బదరీనాథ్...

తక్షణమే ఆఫీసుకివ వెళ్లి ప్రావిడెంట్ ఫండ్ నుండి లోన్ కు అప్లై చేసాడు - జి.ఎమ్. సలహా ప్రకారం టెలిఫోన్ బిల్ ను 'గప్ చుప్ గా' పే చేసేయడం కోసమని...!!

విషయం ఆలకించిన బదరీనాథ్ కుటుంబం అవాక్కయింది.

కమల తేరుకుని, "ఏమండీ! ఇవాళ దినపత్రికలో చూసాను - ప్రభుత్వం పోస్టాఫీసుల ద్వారా వ్యక్తిగత గుర్తింపు కార్డులను జారీ చేస్తోందట. అందులో చిరునామాతో పాటు అవసరమైన ఇతర వివరాలవీ ఉంటాయట. ఆ కార్డ్ అన్నిటికీ ఉపయోగిస్తుందట," అని చెప్పింది.

ఆమె పలుకులు బదరీనాథ్ చెవులలో అమృతం పోసాయి.

"నిజంగా? ఐతే ఇప్పుడే టెలిఫోన్ డిపార్ట్మెంట్ కు అప్లికేషన్ ఇచ్చేస్తాను, మన ల్యాండ్ లైన్ తీసేయమని!" అన్నాడు, హృదయాన్ని తేలికపరచుకోవడానికి ప్రయత్నిస్తూ.




అప్పుడే సినిమా సక్సెస్ మీట్ పూర్తయింది. దర్శకుడు సునీల్ కార్యక్రమం పూర్తికాగానే తన కోసం ప్రత్యేకంగా ఎదురుచూస్తున్న విలేకరి దగ్గర ఆగాడు.

అతనేదో ప్రశ్న వేశాడు. సునీల్ కి అదేమిటో అర్థం కాక మరోసారి అడగమని కోరాడు.

“సర్… మీ చిత్రం వైవిధ్యంగా నిర్మించామని చెప్పారు. ప్రారంభోత్సవానికి ముందూ, ఆ తర్వాత కూడా… కానీ మీ సినిమాలో కొత్తదనం లేదు. ఒక్క బలమయిన సన్నివేశం లేదు. ఐదు పాటలు, మూడు ఫైట్లతో రొటీన్ ఫార్ములా సినిమా తీశారు. పోనీ, పాటలు, బ్యాగ్రౌండ్ సంగీతం ఏమయినా ఆకట్టుకుందా అంటే అదీ లేదు. ప్రేక్షకుల్ని కట్టిపడేద్దామన్న ఆలోచన లేకుండా రీళ్లు చుట్టిపడేసారనిపిస్తోంది.”

తను చెబుతున్నది దర్శకుడు సీరియస్ గా వింటున్న భావం కలిగింది అతనికి… మళ్లీ చెప్పటం కొనసాగించాడు.

“మొదటి రోజు ఉదయం ఆట నుంచి జనం లేరు. వారం తర్వాత థియేటర్లలో ఈ సినిమా ఉంటుందన్న నమ్మకం కుదరటం లేదు... మీరేమో సినిమా విజయోత్సవ సభ నిర్వహించి... ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారని అంటున్నారు. మీతో పాటు చిత్ర నిర్మాత, దర్శకుడు, చివరకు హీరోయిన్ కూడా వంత పాడారు. ఏమిటిదంతా...” ఆవేశంగా అడిగాడు.

ఆ కుర్రాడి ఉత్సాహం చూసి సునీల్ కి ముచ్చటేసింది.

ఇంతకు ముందు అతను చాలా సినిమాలకు దర్శకత్వం వహించాడు. అందులో జయాపజయాలు రెండూ ఉన్నాయి. అయితే... మునుపు ఎవరూ తనను ఇంత సూటిగా ప్రశ్నించింది లేదు.

“సినిమా విలేకరిగా కొత్తగా ఉద్యోగంలో చేరావా?” అడిగాడు.

“అవును”... తలూపుతూ అతను చెప్పాడు.

సునీల్ కూల్ గా సమాధానం చెప్పటం మొదలుపెట్టాడు.

“ప్రతి సినిమా ప్రారంభానికి ముందు మేం ఇదే చెబుతాం. ప్రతిష్ఠాత్మక చిత్రం తీస్తున్నామని ప్రకటిస్తాం... ఇంతకు ముందెప్పుడు తెలుగు తెరపైన చూడని చిత్రం. స్క్రిప్టు పైన రచయితలు ఏడాదిపైగా కూర్చుని తయారు చేశారంటాం. నిర్మాత మనసు ఉప్పొంగుతుంది. ప్రేక్షకుల్లో ఉత్కంఠ పెరుగుతుంది.”

మధ్యమధ్యలో తలాడిస్తూ దర్శకుడు చెప్పేది శ్రద్ధగా వినసాగాడు అతను.

“సినిమా నిర్మాణ సమయంలోనూ హీరోహీరోయిన్లచేత ఇవే చిలకపలుకులు పలికిస్తాం. బయ్యర్లలో పోటీ పెరుగుతుంది. సంగీతానికి మంచి బ్రేక్ వచ్చిందని, ఇబ్బడిముబ్బడిగా క్యాసెట్లు అమ్ముడయ్యాయని చెబుతాం... నిర్మాత ఖర్చుకు అంగీకరిస్తే మరో కార్యక్రమం కూడా పెడతాం... పేరున్న దర్శక, నిర్మాతలను పిలిపించి పొగిడిస్తాం. పోస్టర్లలోనూ, ప్రచారంలోనూ ఆడవాళ్లను, యూత్

ని ఆకర్షించేందుకు చూస్తాం."

విలేకరికి ఇదంతా అర్థమయి, కానట్టుగా ఉంది.

...ఇదంతా దేనికి? లక్షలు ఖర్చు పెట్టిన నిర్మాతకి, సినిమా కొనుక్కున్న బయ్యర్లకి నాలుగు రాళ్లు మిగల్చటానికే" అరటిపండు వలిచిపెట్టినట్టు చెప్పి...

ఆ తర్వాత విలేకరి భుజం తట్టి "డిన్నర్ చేసి వెళ్లటం మరిచిపోకు" అని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

దర్శకుడు అటు వెళ్లగానే అతను...

మిగిలిన వాళ్లందరితో కలసి సుష్టుగా భోజనం చేశాడు. ఫుల్ గా మందు కొట్టాడు.

ఆ తర్వాత సినిమా నిర్మాతల తరఫు వారందించిన కవరు సంతోషంగా అందుకున్నాడు. అందులో తళతళమెరుస్తున్న వెయ్యి నోట్లు ఊరిస్తూ కనిపించాయి.

కార్యక్రమం నుంచి తిరిగి రాగానే...

"వైవిధ్యమయిన కథాంశంతో వచ్చిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. నిర్మాత, దర్శకులు పూర్తిగా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు... అంటూ మొదలుపెట్టి... చిత్రాన్ని పొగుడుతూ పత్రికకి కథనం పంపాడు.

మరుసటి రోజు అది రంగుల చిత్రాలతో అందంగా అచ్చయింది.

దర్శక, నిర్మాత లిద్దరూ ఫోన్ చేసి విలేకరిని అభినందించారు. ఉబ్బితబ్బిబ్బయిపోయాడతను.

****           ****           ****           ****

మరో నాల్రోజులకి ఆ చిత్రం నగరంలోని ఏ థియేటర్లలోనూ కనిపించలేదు. భారీ నష్టాలొచ్చాయి.

అప్పుడు గుర్తొచ్చాడు ఆ విలేకరి సునీల్ కి.

ఆ రోజు అతను వేసిన ప్రశ్నలకు తెలివిగా సమాధానం చెప్పాననుకున్నాడే గానీ... అందులోని వాస్తవాన్ని తను గ్రహించలేదు.

‘‘ప్రేక్షకులు చాలా తెలివయిన వారు. దర్శక నిర్మాతలు చెప్పే కాకమ్మ కథల్ని ఎంత మాత్రం నమ్మరు. వారి మాటల్లో చిత్తశుద్ధి లేకపోతే... అదే చిత్రంలో వైవిధ్యం లేకపోతే... ఇట్టే గ్రహిస్తారు. చిత్రాన్ని థియేటర్ల నుంచి తరిమికొడతారు’’

భారంగా నిట్టూరుస్తూ అనుకున్నాడు     దర్శకుడు సునీల్.




రాత్రి పది గంటలవుతుంది... అమావాస్య చీకటి కాటుకలా చిక్కగా, దుష్టుడి మనసులా నల్లగా అలముకుంది. శీతాకాలమేమో, గ్రామం సందకడనే చీకటి దుప్పటి కప్పేసుకోవడంతో గ్రామస్థులంతా చలికి ముసుగులుదన్ని నిద్రాదేవి ఒళ్ళో వెచ్చగా ఒరిగిపోయారు.

ఊరికి ఉత్తరాన ఉన్న చింతతోపులో చెట్లు దయ్యాలలా తలలు విరబోసుకుని గాలికి భయంకరంగా ఊగుతున్నాయి. దట్టంగా నిండుకున్న చీకట్లో కీచురాళ్ళ ధ్వనులు, తీతువు పిట్టల కూతలు, గాలి వేసే ఈలలు, ఏవేవో వింత శబ్దాలు, స్వైరవిహారం చేస్తూన్న మిణుగురు పురుగుల మెరపు కాంతులూ తప్ప గుండెలు అవిసే నిశ్శబ్దం ఆవహించుకుంది. వాచ్ టవర్స్ నుండి

కనిపెడుతూన్న పహరాగాళ్ళలా చెట్లమీదున్న గుడ్లగూబల కళ్ళు టార్చ్ లైట్సులా చీకట్లో వెలుగుతున్నాయి.

అదే సమయంలో - తెల్లటి చీరలో ఉన్న ఓ స్త్రీ ఆకారం ఆ చింతతోపులో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఒంటరిగా తిరుగాడుతోంది. ఆమెను చూసి కాబోలు, ఓ చెట్టు మొదట్లో ముడుంకె వేసుకుని పడుకున్న కుక్క ఒకటి మొరిగింది. తరువాత ఎవరో పోయినట్టు మోర పైకెత్తి ఏడ్పు లంకించుకుంది. చెట్ల మీద ప్రశాంతంగా నిద్రిస్తూన్న పక్షులలో ఓ క్షణం కలకలం రేగింది. కుక్క పడుకున్న చోటు నుండి కదలకుండా ఏడుస్తూనే ఉంది.

హఠాత్తుగా నిల్చుండిపోయింది ఆ స్త్రీ. కట్టెదుట ప్రత్యక్షమైన ఆకారాన్ని చూడడంతో 'కెవ్వు'న అరచి తెలివితప్పి దబ్బున నేలపైన పడిపోయింది...

****   ****   ****   ****

"దయ్యాలు, భూతాలు... నాన్సెన్స్! అదంతా మన చిత్తభ్రమ. మన మనసులోని భయాలే దయ్యాలై మనల్ని భయపెడుతూంటాయి," అన్నాడు నాయుడు గారి బుల్లెబ్బాయి. "లోకంలో మనిషిని మించిన దయ్యం ఎక్కడుంటుంది!"

బుల్లెబ్బాయికి ఇరవయ్యేళ్ళుంటాయి. హ్యాండ్సమ్ గా ఉంటాడు. పల్లెలో పుట్టి పల్లెలో పెరిగిన పదహారణాల రైతు బిడ్డ. కాని, పల్లె ప్రజలలో ఉండే మూఢనమ్మకాలకు దూరం. చిన్నప్పట్నుంచి దయ్యాల కబుర్లు, కథలూ వింటూ పెరిగినా... వాటి మీద నమ్మకంలేదు అతనికి.

"ఒకవేళ నిజంగానే నీకు దయ్యం ఎదురైతే ఏం చేస్తావ్?" అడిగాడు కృష్ణ.

"దాని పుట్టుపూర్వోత్తరాలు కనుక్కుంటాను" అన్నాడు బుల్లెబ్బాయి.

"అంత మొనగాడివా?" వెటకారంగా అడిగాడు ఎర్రియ్య.

"దయ్యమనేదే ఉంటే, పంపించి చూడు. దానితో ఆడుకుని నేనెంతటి మొనగాణ్ణో దానికే చూపిస్తాను" నవ్వాడు బుల్లెబ్బాయి. "ఐతే నీకు దయ్యాలంటే అసలు భయం లేదంటావ్?" రెట్టించాడు రాములు.

"దయ్యాలంటే భయమే కాదు, వాటి ఉనికి మీద నాకు నమ్మకం కూడా లేదు" దృఢంగా అన్నాడు బుల్లెబ్బాయి.

ముఖాలు చూసుకున్నారు మిత్రులు ముగ్గురూ.     ఆ నలుగురూ ఇంచుమించు ఒకే వయసువాళ్ళే. చిన్నప్పట్నుంచీ ఆడుతూ పాడుతూ కలసి పెరిగినవాళ్ళే. గ్రామంలో ఉన్న బళ్ళో పదో తరగతి వరకు చదువుకుని, పై చదువులు చదివితే మాత్రం ఉద్యోగాలు దొరుకుతున్నాయా ఏమిటి అనుకుని, తండ్రుల వ్యవసాయంలో సాయం చేయసాగారు.

ఇంతకూ వారి దయ్యాల సంభాషణకు మూలం ఏమిటంటే...

కాలక్షేపం కోసం కథల పుస్తకాలు చదవడం అలవాటు ఆ మిత్రులకు. క్రైమ్ కథలంటే మరీ ఇష్టం. సమీపంలోని టౌన్ కు వెళ్ళినప్పుడల్లా ఎవరికి కనిపించిన పత్రికలు వారు తీసుకొస్తూంటారు. వాటిని తమ మధ్య సర్క్యులేట్ చేసుకుంటూంటారు.

రెండు రోజుల క్రితం ఎరువులు కొనడానికి టౌన్ కు వెళ్ళిన ఎర్రియ్య స్టాండ్స్ లో ఓ కొత్త పత్రికను చూడడం జరిగింది. ఓసారి దాన్ని తిరగేసి చూసి వెంటనే కొనేసాడు... అందులోని కథలు, బొమ్మలు ఆకట్టుకోవడంతో రెండు రోజుల్లోనే దాన్ని చదవడం పూర్తిచేసేసారు ఎర్రియ్య, కృష్ణుడు, రాములూను. తరువాత వాళ్ళు దాని గురించే చర్చించుకుంటూంటే బుల్లెబ్బాయి అక్కడకు రావడం జరిగింది.

"దీని మీద భయానక మాసపత్రిక అని రాసుంది. అంత భయానకంగా ఉంటుందా?" సాశ్చర్యంగా అడిగాడు బుల్లెబ్బాయి.

"చదివి చూడు" అన్నాడు ఎర్రియ్య.

బుల్లెబ్బాయి పత్రిక తిరగేసి, "దీన్నిండా దయ్యాలు భూతాలే కనిపిస్తున్నాయి!" అన్నాడు నవ్వుతూ.

"నేరాలు ఘోరాలు కూడాను" అన్నాడు రాములు.

ఆ విధంగా మిత్రుల సంభాషణ 'అసలు దయ్యాలనేవి ఉన్నాయా లేవా?' అన్న విషయంపైకి దారి తీసింది. పత్రిక చదువు. నీకే తెలుస్తుంది" అన్నారు వాళ్ళు. కథలు వేరు, కఠిన సత్యాలు వేరూనన్నాడు అతను. చినికి చినికి గాలివాన ఐనట్టు, వారి వాదం పందాల వరకు దారి తీసింది.

"మన ఊరి బైటున్న చింతతోపులో దయ్యాలు తిరుగుతున్నాయంటారు. అప్పుడప్పుడు రాత్రులు మన గ్రామంలో ఎందరికో అవి కనిపించిన దాఖలాలు ఉన్నాయి" అన్నాడు కృష్ణ.

"అవన్నీ నీడల్ని చూసి జడుసుకునే కేసులు. నేను నమ్మను" అంటూ కొట్టిపారేసాడు బుల్లెబ్బాయి.

"సరే. మనం ఓ పందెం వేసుకుందాం... రాబోయే అమావాస్యనాటి రాత్రంతా చింతతోపులో ఒంటరిగా గడపాలి నువ్వు. అప్పుడే నీకు నిజంగానే దయ్యాలంటే భయం లేదని నమ్ముతాం" అంటూ సవాలు విసిరాడు రాములు.

"తప్పకుండా. దయ్యం కనిపించాలే కాని, దానితో ఓ ఆటాడుకోనూ?" అన్నాడు బుల్లెబ్బాయి నవ్వుతూ.

"పరిహాసానికి పోయి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దురా, బుల్లెబ్బాయ్!" హెచ్చరించాడు ఎర్రియ్య.

"నో ప్రోబ్లెమ్. పందెం ఏమిటో చెప్పండి" అన్నాడు బుల్లెబ్బాయి.

"నువ్వు నిజంగానే అమావాస్యనాటి రాత్రంతా చింతతోపులో గడిపి వచ్చావంటే... 'మగధీర' బిరుదుతో నిన్ను సత్కరిస్తాం" అన్నాడు ఎర్రియ్య.

"నాకు బిరుదులొద్దు. పందెంలో నేను గెలిస్తే మీరు ముగ్గురూ మా పొలంలో వారమేసి రోజులు పనిచేయాలి. మీరు గెలిస్తే నేను మీ పొలాలలో పనిచేస్తాను" చెప్పాడు బుల్లెబ్బాయి.

మిగతావారు ముఖాలు చూసుకుని, 'సరే' నన్నారు.

****     ****     ****     ****

ఆ రోజు ఆదివారం. బహుళ అమావాస్య. చీకటికి భయపడి కాబోలు చంద్రుడు అంబరంలో అడుగుపెట్టలేదు. నెలరేడును కానక బిక్కు బిక్కు మంటున్నాయి నక్షత్రాలు.

చింతతోపు చీకట్లో జలకాలాడుతోంది. దూరంగా ఉన్న గోదావరి మీంచి వీస్తూన్న గాలి హోరు జోరు పెరగడంతో దయ్యాల్లా నిల్చున్న చింత చెట్లు పూనకం వచ్చినట్టు తలలు ఊపుతున్నాయి. కీచురాళ్ళు సంగీతం పాడుతూంటే... లయగా గాలి ఈల వేస్తూంటే... మిణుగురు పురుగులు ఫ్లయింగ్ సాసర్స్ లా ఎగురుతూ చీకటికి వెలుగు చూపడానికి వృథా ప్రయాస పడుతూంటే... నిశ్శబ్దం తోపును ఏలుతూంటే... చెట్ల మీది గుడ్లగూబలు టార్చ్ లైట్స్ లాంటి కనుగ్రుడ్లతో చూస్తూ ఉండి ఉండి అరుస్తూంటే... అక్కడి వాతావరణం భయానకంగా ఎంతటి ధైర్యవంతుడికైనా గుండెలు అవిసేలా ఉంది.

రాత్రి పది గంటలకు - ఆ చింతతోపులో అడుగుపెట్టాడు బుల్లెబ్బాయి. చేతిలో పెన్ టార్చ్ ఉంది. ఆ వాతావణం చూస్తే ఓ క్షణం ఏదో   భీతి కలిగింది అతనికి... పెన్ టార్చ్ గ్రుడ్డి వెల్తురులో తోపంతా తిరిగివచ్చాడు.

ఓ చింతచెట్టు క్రింద కూర్చుంటూంటే, ఆ సాయంత్రం ఎర్రియ్య అన్న మాటలు గుర్తుకు వచ్చాయి -'ఒరేయ్! దయ్యాలు చింతచెట్ల మీదే ఉంటాయి. నువ్వు వెళ్తున్నది చింతతోపుకు. ఎందుకైనా మంచిది, ఇంకోసారి ఆలోచించుకోరా' అన్నాడు... చిన్నగా నవ్వుకున్నాడు.

అంతలో ఎక్కణ్ణుంచో కుక్క మొరుగుడు, ఆ తరువాత ఏడ్పూ, పక్షుల కలవరం వినవచ్చాయి.

ఉన్నట్టుండి 'కెవ్వు'మన్న స్త్రీ కేక వినిపించడంతో అదరిపడ్డాడు బుల్లెబ్బాయి. చటుక్కున లేచి నిల్చున్నాడు. కేక పెట్టింది ఎవరో, ఎటువైపునుండి వచ్చిందో తెలియలేదు. "ఎవరదీ? ఏమయింది?" అంటూ తోచిన దిశగా అడుగులు వేసాడు. నాలుగు అడుగులు వేసేసరికి ఎవరో కొట్టినట్టు చేతిలోని పెన్ టార్చ్ ఎగిరి ఎక్కడో పడిపోయింది. దాంతో ఆ గ్రుడ్డి వెలుతురు కూడా

లేకుండాపోయింది.

కాసేపు ఆ చీకట్లో గ్రుడ్డివాడిలా తడుముకుంటూ దిరిగాడు. ఎవరూ కనిపించలేదు...

ఈరీ సౌండ్స్ కు తోడు, కుక్క ఆగి ఆగి ఏడుస్తోంది.

అదే సమయంలో - ఎక్కడినుండో అడుగుల శబ్దం వినవచ్చింది.

ఆగి, చెవులు రిక్కించాడు. చప్పుడు ఆగిపోయింది.

మళ్ళీ ముందుకు సాగాడు. రెండడుగులు వేసాడో లేదో, పాదాల చప్పుడు మళ్ళీ వినవచ్చింది.

తన నెవరో వెంబడిస్తున్నారనిపించింది. నిశ్శబ్దంగా అటువైపు నడిచాడు. కొన్ని అడుగుల దూరం వెళ్ళేసరికి తెల్లటి ఆకారం ఒకటి చీకట్లో కదలుతున్నట్లనిపించింది.

"ఎవరదీ?" అంటూ అటువైపు వెళ్ళాడు. ఆకారం ఓ చెట్టు వెనుక అదృశ్యమైపోయింది.

కళ్ళు చించుకుని చుట్టూ పరికించాడు. ఎవరూ కనిపించలేదు.

అంతలో చేరువలో ఉన్న పొద దగ్గర చప్పుడయింది. అటువైపు గెంతాడు. ఎవరూ కనిపించలేదు కాని... చప్పుడునుబట్టి పెద్ద సర్పం ఒకటి తన కాళ్ళ దగ్గర నుండి జరజరా ప్రాక్కుంటూ వెళ్ళిపోతున్నట్టు గ్రహించాడు. ఒళ్ళు జలదరించింది. ఓ క్షణం అక్కడే నిలబడిపోయి, తిరుగు ముఖం పట్టాడు.

అదిగో, అప్పుడే... అల్లంత దూరంలో ప్రత్యక్షమయింది తెల్లటి ఆకారం.

ఈసారి నిశ్శబ్దంగా అటువైపు నడిచాడు. ఆకారాన్ని సమీపించాక, అది తెల్ల చీరలో ఉన్న స్త్రీగా గ్రహించాడు. 'ఆ వేళప్పుడు ఆ నిర్జన ప్రదేశంలో ఆడమనిషి ఎలా వచ్చింది!? ఆమె మనిషేనా? లేక, అందరూ చెబుతూన్న దయ్యమా??' అన్న తలంపు కలగడంతో... తెలియకుండానే అతని గుండె ఓ బీట్ ని మిస్ చేసింది.

ఆమె అతన్ని చూసినట్టు లేదు. మెల్లగా నడుచుకుంటూ వెళ్తోంది. చప్పుడు చేయకుండా అనుసరించాడు... చెట్టు పక్కగా వెళ్ళి నిల్చుంది ఆమె.

వెనుకగా వెళ్ళి నిల్చున్నాడు బుల్లెబ్బాయి. సెంటు వాసన అతని ముక్కుపుటాలను సోకింది. "ఎవరు నువ్వు?" అన్నాడు. ఉలికిపడి గిర్రున అతని వైపు తిరిగింది ఆమె.

చీకట్లో ముఖం స్పష్టంగా కనిపించడంలేదు. "ఎవరు నువ్వు?" సాశ్చర్యంగా అడిగాడు మళ్ళీ.

సమాధానంగా మంజులహాసం ఒకటి సన్నగా వినిపించింది. గిర్రున వెనుదిరిగి ముందుకు నడచిందామె. అతను విస్తుపోతూ అనుసరించాడు. దట్టంగా ఉన్న ఓ పొదరింటి వద్ద హఠాత్తుగా ఆగింది. చటుక్కున అతని వైపు తిరిగి గాఢంగా కౌగలించుకుంది.

బుల్లెబ్బాయి తెల్లబోయాడు. ఆమె లతలా తనకు అల్లుకుపోవడంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆమె ఒంటి నుండి వస్తూన్న సుగంధాలు మదికి ఆహ్లాదం కలిగిస్తూంటే... ఆమె మృదు స్పర్శ, బిగి కౌగిలి, వేడి చుంబనాలు మత్తుకు గురిచేసాయి. ఆమె పరువాలు తనను ఆర్తిగా హత్తుకుంటూంటే, వేడిగా కాలిపోతూన్న ఆమె దేహం... అతని శరీరంలో విద్యుత్ షాక్ ను కలిగించింది. అతనిలో కోర్కె కోడెనాగులా చివాలున తల ఎత్తింది.

'ఎవరీమె? మనిషా, తన మిత్రులు చెప్పిన మోహినిపిశాచా?...' అతని సందేహాలకు జవాబులు లేవు. మెత్తగా ఒత్తుకుంటూన్న ఆమె మేని స్పర్శతో రగిలిన మొగలిపొదలా అతని యవ్వనం బుసలు కొట్టింది.

క్షణ క్షణానికీ ఉధృతమౌతూన్న కాంక్షతో ఆమెను తన బిగి కౌగిట్లో బిగించి ఆమె ముఖమంతా ముద్దులతో ముంచెత్తాడు. ఆమె అధరాలను తన అధరాలతో పరామర్శించాడు. ఆమె కంఠాన్ని వెచ్చటి పెదవులతో రాస్తూ ఆమెలో అగ్ని రగిలించాడు.

తమకంతో అతని వక్షానికి హత్తుకుపోయిందామె...

మృదువుగా ఆమెను నేలపైన పూదీవెలలో పరుండబెట్టాడు. ఆ తరువాత వారి నడుమ కాలం స్థంభించిపోయింది!

****　　　****　　　****　　　****

బాలభానుడు లేత కిరణాలతో గ్రామానికి మేలుకొలుపు పలుకుతున్నాడు...

మిత్రులు వచ్చి లేపేంతవరకు బుల్లెబ్బాయికి మెలకువ రానేలేదు. రాత్రి ఎక్కడ పడుకున్నాడో అక్కడే తీగలపైన పడుకునియున్నాడు ఒంటరిగా.

బుల్లెబ్బాయిని ప్రాణాలతో చూడడంతో మిత్రబృందానికి ప్రాణాలు కుదుటబడ్డాయి.

"నేనెక్కడున్నాను?" అడిగాడు బుల్లెబ్బాయి కన్నులు నులుముకుని చూస్తూ.

"చింతతోపులో" అని జవాబిచ్చారు.

ఏదో గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ, "ఆమె ఎక్కడా?" అనడిగాడు.

"ఎవరూ?" సాశ్చర్యంగా అడిగింది మిత్రబృందం.

"రాత్రి నాతో గడిపిన యువతి" చెప్పాడు బుల్లెబ్బాయి, మెరిసే కళ్ళతో.

"నీకు...దయ్యం కనిపించిందా!?" ముగ్గురూ ఒకేసారి అడిగారు ఉత్కంఠతో.

"దయ్యమా? లేదే!"         "మరి, యువతి ఎవరు?"            "ఆమె...ఓ శృంగార దేవత!"

"దాన్నే దయ్యాల భాషలో మోహినిపిశాచి అంటారు బాబూ!" అన్నాడు రాములు.

"చ ఛ, రాత్రంతా నాకు స్వర్గ సౌఖ్యాలను చవిచూపిన ఆ యువతిని దయ్యం అనడానికి మీకు నోరెలా వచ్చిందిరా? ఆమే మనలాగే మనిషి!" అన్నాడు బుల్లెబ్బాయి. ముఖాలు చూసుకున్నారు వాళ్ళు...           రాత్రి తన అనుభవం గూర్చి విపులంగా చెప్పాడు బుల్లెబ్బాయి. ఆశ్చర్యపోయారంతా.

ఎర్రియ్య సైగ నందుకున్న కృష్ణ వెళ్ళి, చెట్టు చాటున నిల్చున్న ఓ యువతిని వెంటబెట్టుకొచ్చాడు. తెల్లగా, పొట్టిగా ఉందామె. కొంచెం ఒళ్ళుంది. తెల్ల చీర కట్టుకుంది.

"రాత్రి నీతో గడిపిన యువతి ఈమేనా?" అడిగాడు ఎర్రియ్య.

బుల్లెబ్బాయి ఆమె వంక ఎగాదిగా చూసి తల అడ్డంగా త్రిప్పాడు. "ఆమె స్లిమ్ గా, పొడవుగా, నాజూకుగా ఉంటుంది" అన్నాడు. "ఈమె ఎవరు?" మిత్రులు చెప్పింది ఆలకించి మిక్కిలి ఆశ్చర్యపోయాడతను...

'బుల్లెబ్బాయి గుండె ధైర్యాన్ని బాగా ఎరుగుదురు అతని మిత్రులు. పందెంలో అతను గెలిచినట్లైతే తామంతా అతని పొలంలో పనిచేయాల్సి ఉంటుంది. చింతతోపులోని దయ్యం ఎప్పుడు పడితే అప్పుడు కనిపించకపోవచ్చును. ఒకవేళ ఆరోజు బుల్లెబ్బాయికి దయ్యం కనిపించకపోతే అతను పందెం గెలవడం ఖాయం. అందుకే ఎందుకైనా మంచిదని, పక్క ఊరి నుంచి నాటకాలు వేసే శకుంతలను తీసుకువచ్చారు దయ్యం వేషం వేయడానికి! ఆ వేళప్పుడు చింతతోపులోకి వెళ్ళడానికి మొదట ఆమె ఒప్పుకోలేదు.       తాము ఆమె వెనుకే నీడలా ఉంటామని హామీ ఇవ్వడంతో, దయ్యం వేషంలో ఓ గంటసేపు చింతతోపులో తిరగడానికి ఒప్పుకుంది... కాసేపటికే ఆమెకు నిజం దయ్యం కనపడడంతో భయంతో వెర్రికేక పెట్టి స్పృహతప్పి పడిపోయింది. ఆమె కేకలో జడుసుకున్న మిత్రత్రయం అక్కణ్ణుంచి పలాయనం చిత్తగించింది... తెల్లవారాక వచ్చి చూస్తే, పడున్న శకుంతల కనిపించింది. ఆమెను లేపి విషయం అడిగితే, రాత్రి తనకు దయ్యం ఎదురయిందని చెప్పింది...'

"నేను చూసిన దయ్యం అచ్చు మీరు వర్ణించినట్టే ఉంది" అంది శకుంతల బుల్లెబ్బాయితో, భయంతో గుండెలపైన చేయి వేసుకుంటూ.

"అంటే...రాత్రి నాతో గడిపింది...?!" తెల్లబోయాడు అతను. అతని మదిలో 'ఆమె' రూపం మెదిలింది... తెల్ల చీర, విరబోసుకున్న కురులు, అడుగులో అడుగు వేసుకుంటూ ఆ నడక... తపనతో తనను కౌగలించుకున్న తీరు...! ఆ వేళప్పుడు అటువంటి నిర్జన ప్రదేశంలో ఏ సామాన్య స్త్రీ ఐనా ఒంటరిగా తిరుగాడుతుందా!?

అతని శరీరం భయంతో సన్నటి కంపనకు గురయింది. "ఐతే, అది... దయ్యమేనంటారా?" అన్నాడు.

"నిస్సందేహంగా! వయసులో ఉన్నవాళ్ళు ఒంటరిగా కనపడితే మోహినిపిశాచాలు వెంటపడతాయట. మానవకాంతలుగా మారి తమ కోర్కెలను తీర్చుకుంటాయట" అన్నాడు ఎర్రియ్య.

"నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఇంకా ప్రాణాలతో ఉన్నావు. సాధారణంగా దయ్యాలతో రమించిన వారెవరూ బ్రతికుండరని విన్నాను" అన్నాడు కృష్ణ రిలీఫ్ గా.

అంతటి ధైర్యవంతుడికీ గుండె ఝుళ్ళుమంది బుల్లెబ్బాయికి.

"ఇప్పటికైనా ఒప్పుకుంటావా దయ్యాలున్నాయని?" నవ్వాడు రాములు.

"ఒప్పుకోవాలనే ఉంది. కాని, ఎందుకో ఆమె మనిషి కాదంటే నా మనసు అంగీకరించడంలేదురా" అన్నాడు బుల్లెబ్బాయి సాలోచనగా.

"పందెం ఎగ్గొట్టడానికి నాటకమాడకురోయ్!" అన్నాడు కృష్ణ.

"ఛ్, అదేం కాదురా. నిజంగానే ఎటూ డిసైడ్ కాలేకపోతున్నాను" నిజాయితీగా అన్నాడు బుల్లెబ్బాయి.

"ఒప్పుకోండి సార్. అది దయ్యమేననడానికి నేనే సాక్ష్యం కదా!" అంది శకుంతల నవ్వుతూ.

భుజాలు ఎగరవేసాడు అతను.

****     ****     ****     ****

నాయుడుగారి బుల్లెబ్బాయికి చింతతోపులో మోహినీపిశాచి కనిపించిందన్న వార్త మంత్రగాడు వేసిన సాంబ్రాణి ధూపంలా గ్రామ మంతటా గుప్పుమంది. అనవసరపు పందాలకుపోయి ప్రాణాలను రిస్క్ లో పెట్టుకున్నందుకు కొడుకును తల వాచేలా చీవాట్లు పెట్టాడు నాయుడు.

అరవయ్యేళ్ళ ఆ ఊరి కరణం గారి పాతికేళ్ళ రెండో భార్య శేషారత్నం ఎర్రగా బుర్రగా నాజూకుగా ఉంటుంది. సోకులు చేస్తుంది. కరణం గారు పట్నం నుండి తెప్పించే 'పాయిజన్' సెంటును వాడుతుంది.

బుల్లెబ్బాయికి మోహినీపిశాచి కనిపించిందన్న వార్త ఆలకించి గుంభనంగా నవ్వుకుంది శేషారత్నం.

'కోడె వయసులో... కండలు తిరిగిన దండలతో... ఎన్నాళ్ళు ఊరించావురా కుర్రోడా! ఆ రోజు మీ మిత్రుల పందెం, నీలాటి రేవు నుండి వస్తూన్న నా చెవిన పడబట్టి కాని, లేకుంటే చిటారు కొమ్మను మిఠాయి పొట్లం లాగే మిగిలిపోయేవాడివి కదురా!... రాత్రి నా ఒళ్ళంతా హూనం చేసి మగాడి వనిపించుకున్నావు... ఆ మధురానుభూతినే తలచుకుంటూ మా ముసలాడితో జీవితమంతా గడిపేస్తాను...'  చెక్కిలిపైన చేయి వేసుకుని అద్దంలో చూసుకుంటూ తన్మయత్వంతో అనుకుంది ఆమె.




వాడిని చూస్తే రజని కడుపు తరుక్కు పోతోంది. మంచానికి అతుక్కు పోయి మగతలో వున్నాడు.

రెండు వారాల నుండి స్కూల్ కి వెళ్ళడం లేదు. డాక్టర్లు... మందులు ఇదే వాడి జీవితమైంది. ఇంతవరకు వాడికేమైందో ఎందుకలా అయిపోతున్నాడో ఎవరూ చెప్పలేకపోతున్నారు.

బాబు పక్కనే కుర్చీలో కూర్చుని కునికి పాట్లు పడుతున్నాడు రఘు. ఆఫీసుకి అప్పుడప్పుడూ వెళ్ళి వస్తున్నాడు. పండు లాంటి కొడుకు. నిన్న మొన్నటి దాకా ముద్దులు మూటకడుతూ చిన్ని కృష్ణుడిలా ఇల్లంతా కలయ తిరిగి అల్లరి చేసిన వాడు... ఈరోజు ఇలా మంచం మీద పడుకునుంటే పనెలా చేయ బుద్ధవుతుంది? మూడు రోజులు హాస్పిటల్లో అడ్మిట్ కూడా చేశారు... కానీ ఏమీ లాభం లేకపోయింది. డాక్టర్ వాళ్ళ దగ్గరకొచ్చి "మీ అబ్బాయికి ప్రాబ్లం ఏమిటో అంతు బట్టడం లేదు. ఇక్కడ హాస్పిటల్లో ఎక్కువ కాలం వుంచడం వల్ల ఉపయోగం వుంటుందని నేను అనుకోవడం లేదు. పైగా ఖర్చులు. మీరు వాడిని ఇంటికి తీసుకుపోండి." అన్నాడు. పదునైన బాణం గుండెని తాకినట్టయింది. విల విల్లాడారు... బాబుని ఇంటికి తీసుకొచ్చేశారు. అప్పటినుండి ఇద్దరికీ జీవితం మీద అనాసక్తత. బ్రతకడానికింత తినడం... వాడిపక్కన భారమైన హృదయాలతో కూర్చోడం. చుట్టాలు... తెలిసిన వాళ్ళు వచ్చి... వాడి పరిస్థితికి జాలిపడడం పరామర్శించడం... ఇదే రొటీనయింది.

అలా రోజులు గడుస్తుంటే వచ్చింది ఆదెమ్మ. ఆదెమ్మ అంటే ఒకప్పటి వాళ్ళ పనిమనిషి. పెద్దావిడ... వాళ్ళకు మంచి చెడూ చెప్పేది. ఒకసారి అత్యవసర పనిమీద ఊరెళ్ళాలని చెప్పి తనకు రావలసింది తీసుకుని వెళ్ళిపోయింది. మళ్ళీ ఇప్పుడే రావడం. ఆవిడ్ని చూడగానే రజనికి ప్రాణం లేచివచ్చింది. ఆవిడ్ని హత్తుకుని... వాడ్ని చూపిస్తూ హృదయ విదారకంగా రోదిస్తూ... జరిగిందంతా చెప్పింది. ఆవిడ సీరియస్ గా విని, "నాకు తెలిసి ఇది మందులకి లొంగదు. వాడు ఏదో తొక్కో... దాటో వుంటాడు. అందుకే అలా వున్నాడు." అంది.

"అంటే?"

"రోడ్డు మీద దిగదుడుపులుంటాయి... యధాపలంగా వాటిని తొక్కడమో... లేదా దాటడమో చేస్తే ఆ చెడు వాళ్ళ నుండి మనకి వస్తుంది." అంది.

"మరి... మరి... దీనికి విరుగుడు లేదా?" ఆశ ఆత్రుతగా అడిగించింది.

"ఎందుకులేదు..." అని ఆగి "ఆదివారం అర్ధరాత్రి జిల్లేడు ఆకుల్లో కాస్త అన్నం, పసుపు, సున్నం, ఎండు మిరపకాయలు, నిమ్మకాయలు, బొగ్గు ముక్కలు అన్నీ కలిపి బాబుకి దిష్టి తీసి నాలుగు రోడ్లు కలిసేచోట పడేసి వెనక్కి చూడకుండా రావాలి. అంతే నీ కొడుకు మామూలు పిల్లాడయిపోతాడు." లోగొంతుకతో చెప్పింది.

"అయితే రేపే ఆదివారం నువ్వు చెప్పినట్టే చేస్తాను. మా బాబు నాకు దక్కితే నీకు పట్టుచీరతో పాటు మంచి కానుక ఇస్తాను" అంది ఉద్విజ్ఞతతో.

ఆదివారం అర్ధరాత్రి.

రజని ఆదెమ్మ పర్యవేక్షణలో అన్నీ జిల్లేడు ఆకులతో సిద్ధం చేసుకుని భర్తతో స్కూటర్ మీద వెళ్ళి నాలుగు రోడ్ల కూడలిలో దాన్ని జాగ్రత్తగా ఎవరూ చూడకుండా జారవిడిచి ఇంటికొచ్చి స్నానం చేశారు.

****    ****    ****    ****

బాబు కోలుకున్నాడు. ముఖంలో మృత్యుకళ పోయి జీవం ఉట్టిపడుతోంది.

ఆ భార్యాభర్తల ఆనందానికి అవధిలేదు. పిళ్ళాడు దక్కడేమో అనుకున్నారు అలాంటిది మళ్ళీ పునర్జన్మలా కోలుకోవడం కలగా వుంది.

"ఆదెమ్మా! నువ్వు రాకపోతే మేము అన్యాయమైపోయే వాళ్ళం. నీ ఋణం తీర్చుకోలేము. ఆవిడకి మంచి చీరపెట్టి ఖరీదైన కానుకలతో సత్కరించారు.

"నేను మా చుట్టాలింటికి పెళ్ళికిక్కడికి వచ్చి మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను. నేను రావడం చాలా మంచిదయింది. ఇగ నే పోతా" అని వెళ్ళిపోయింది.

రోజులు ఆనందంగా కదిలిపోతున్నాయి.

ఒకరోజు -

"ఏవండీ! పార్వతి గారూ రోజా సంచిలో ఏదో సర్దుకుని ఎక్కడికండి వెళుతున్నారు... బాగా ఆందోళనగా వుంటున్నారు కూడా" అంది రజని రెండిళ్ళవతల వుండే పార్వతిని పలకరిస్తూ.

"నా స్నేహితురాలి పిల్లాడికి బాగా లేదండి... లాస్ట్ టైం మీ బాబుకి వచ్చినట్టే హెల్త్ ప్రాబ్లం వచ్చింది. ఎన్ని హాస్పిటల్స్ తిప్పినా ఎంతమంది డాక్టర్లకి చూపించినా నయం కావడం లేదు. నేను వాళ్ళకి మీ అబ్బాయి పడిన బాధ గురించి చెప్పాను... తను మిమ్మల్ని ఏదన్నా సలహా అడగమంది. నేనే ఈ హడావుడిలో మర్చిపోయాను. వాళ్ళకే వండినవి తీసుకెళుతున్నాను. నేను కాస్త పెడితే తప్ప ఏవీ తినడం లేదు వాళ్ళు" అంది బాధగా.

"అయ్యో పిల్లాడికి ఒంట్లో బాగాలేదా... ఉండండి నేనూ వస్తాను." అని గబ గబ తయారయి పార్వతితో బయలు దేరింది. ఆటోలో ఆ ప్రదేశానికి వెళుతుంటే రజనీకి శరీరం లోని రక్తం ఇంకిపోయినట్టుగా అనిపించింది. అది ఆమె జిల్లేడు ఆకులు జారవిడిచిన నాలుగు రోడ్ల కూడలి ప్రదేశం.

దానికి కొద్ది దూరంలోనే వాళ్ళుంటున్నారు.

రజనీకి పూర్తిగా అర్ధమైపోయింది.

వాళ్ళ ఇంట్లోకి వెళ్ళింది. తమ బాబు లానే వాడు కూడా ఒళ్ళు తెలియని జ్వరంతో బాధ పడుతున్నాడు. "పాపం ఆడుతూ... ఆడుతూ వాడు దానిని దాటడమో... తొక్కడమో చేసుంటాడు. ఇప్పుడు భయంకరమైన బాధ అనుభవిస్తున్నాడు. "రజనీకి కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. ఆ భార్యాభర్తలు వచ్చిన వాళ్లకి తమ బిడ్డని చూపిస్తూ తల్లడిల్లి పోతున్నారు.

'తనెంత తప్పు చేసింది? తన కన్న పేగుని కాపాడుకోవాలనుకుంది కాని మరో తల్లి కడుపు శోకానికి కారకులవుతోందనుకోలేదు' ఇప్పుడేం చేయాలి?. సమయానికి ఆదెమ్మ కూడా లేదు. ఎక్కడుందో తెలియదు. అయినా దానిమొహం దానికి ఇంకొకళ్ళకి అంటించడం తెలుసుగాని... వదిలించడం తెలుస్తుందనుకోను. "శ్రీ వెంకటేశ్వరా... నువ్వు ఈ పిల్లాడిని కాపాడితే నీకు నిలువుదోపిడీ సమర్పించుకుంటా... ఆ తల్లి తండ్రుల శోకాన్ని తీర్చగలవాడివి నువ్వే!" అని అప్పటి నుండి పశ్చాత్తాపంతో వాళ్ళ దగ్గిరే వుండి సహాయం చేసింది. తన భర్తకి కూడా విషయం చెప్పి చేసిన తప్పుకి ప్రాయశ్చిత్తంగా వాళ్ళకి పరిపూర్ణంగా సహకరించాలని కోరింది.

కొద్ది కాలంలోనే బాబు కోలుకోవడం చూసి వాడి తల్లితండ్రుల కన్నా తామే ఎక్కువగా మురిసిపోయారు. ఆ పిల్లాడు నిజంగా దాన్ని తొక్కడమో... దాటడమో చేసుంటే ఎలా మృత్యుముఖం నుండి బయటపడ్డాడు? అంటే అవన్నీ అభూత కల్పనలన్న మాట... మానసిక బలహీనతలన్న మాట. ఆదెమ్మ లాంటి వాళ్ళు ఇక్కడే తమ వశం చేసుకుంటారు. చదువుకున్న వాళ్లైన తామే ఈ ట్రాప్ లో పడిపోతే ఇంక ఊళ్లలో, మారుమూల గ్రామాల్లో వుండే నిరక్షరాస్యులు గుడ్డిగా నమ్మడంలో వింతేముంది? తమ పిల్లాడి అనారోగ్యానికి కారణం తెలియనంత మాత్రాన మూఢ నమ్మకాలవైపు మొగ్గడమేనా? ఎంత చదువుకున్నా దిష్టులు తీయడం, తాయెత్తులు కట్టించడం, బాబాలని నమ్మడం ఏమిటిదంతా?... ఇప్పటికీ ఆ బలహీన క్షణంలో తామెలా తప్పుదోవపట్టిందీ తలుచుకుని 'చదువు సంస్కారం వున్న తాము చేయదగ్గ పనేనా?' అనుకుంటారు. విజ్ఞానం ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో మూఢనమ్మకాలతో ఎంతగా దిగజారిపోయిందీ గుర్తుకొస్తుంటే సిగ్గుతో కుంచించుకు పోతారు.

****     ****     ****     ****

('తాము పచ్చగా వుంటే చాలు ఎవరేమయిపోతేనేం' అనే మనస్తత్వంతో మూఢాచారాలని నమ్మి మూర్ఖంగా నాలుగు రోడ్ల కూడళ్ళలో పెట్టుబడివుండే పదార్థాలని చూసినప్పుడల్లా మనస్సు కలుక్కుమంటుంది. వాళ్ళ అజ్ఞానానికి, కుహనా సంస్కారానికీ ఓ మనిషిగా సిగ్గుపడుతూ రాసిన కథ ఇది)